ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital
Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
4-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 124 పేజీలు: 8+4 వెల: 6.50

రూ. 10వేల కోట్లతో ఇంధన ధరల స్థిరీకరణ నిధి

మమతా బెనర్జీ షాక్.. 58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు 5లో



# ఢిల్లీలో ఘోర అగ్నిప్రమాదం

## భగ్గుమన్న రెస్టారెంట్, 21 మంది సజీవ దహనం

## మృతులలో 10 మంది విదేశీయులు

**న్యూఢిల్లీ, జూన్ 3:** రాజధాని నగరంలోని మాల్వియా నగర్‌లో ఉన్న రెస్టారెంట్ బిల్డింగ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో 21 మంది మృతిచెందారు.మరో 40 మందికిపైగా తీవ్ర గాయాలపాలయినట్లు అధికారులు తెలిపారు. అయితే ప్రాథమిక దర్యాప్తులో ఈ ప్రమాదానికి సంబంధించి ఆసక్తి కర అంశాలు వెలుగులోకివచ్చాయి. ఫ్లోరిష్‌స్టే హోటల్‌లోపర్మిషన్ కేవలం ఆరురూమ్‌లకు మాత్రమే >>2

# ఆరోగ్యాంధ్ర కోసం 'యోగాంధ్ర'

రాష్ట్రంలో 10 లక్షల మంది యోగా సాధకులు

7 నుంచి 21 దాకా 14 రోజులు ప్రత్యేక కార్యక్రమాలు

యోగా యజ్ఞంలో కోటిమంది భాగస్వామ్యం

హైదరాబాద్‌లో పవన్ సభను అడ్డుకోవడం సరికాదు: సిఎం చంద్రబాబు


బుధవారం సచివాలయంలో యోగాంధ్ర పోస్టరును ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** యోగాంధ్ర 2026కు ప్రజా చైతన్యం, ప్రజా సహకారం ఎంతో అవసరమని సిఎం చంద్రబాబు తెలిపారు. జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఉత్తమ సాధనమన్నారు. పాఠశాల నుంచీ స్వర్ణ వార్డు వరకూ ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అమరావతి అందాలను ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచానికి చాటుతామని వివరించారు. రాష్ట్రంలో 10లక్షల మంది యోగా సాధకుల్ని తయారు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 21 వ్యాధులకు యోగాసనాల వీడియోలను ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు రూపొందించారన్నారు. సోషల్ మీడియాలో ఈ వీడియోలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. సందేహాలకు సంబంధించి 8142404888 కాల్ సెంటర్ ద్వారా సమగ్ర సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. సంజీవిని పథకంలో యోగాను అనుసంధానం చేస్తామన్నారు. ఈ ఏడాది "యోగాంధ్ర ఫర్ హెల్తీ ఏజింగ్" థీమ్‌తో కోటి మందిని భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా ఈ నెల 7 నుంచి 21 వరకూ 14 రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాన కార్యక్రమం అమరావతి వేదికగా కృష్ణానది ఒడ్డున పశ్చిమ బైపాస్‌ను 25 వేల మందితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు.అంతర్భాగంగా చంద్రబాబు మీడియా ముఖాముఖిలో యోగా నెలగా జూన్ మాసం: యోగాంధ్ర 2026కు రూ. 10 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు వెల్లడించారు. నూనె, ఉప్పు, చక్కెర వంటివి వీలైనంత తక్కువ మోతాదు వాడితే ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు.

డయాబెటిస్ అన్ని రోగాలకు గేట్‌వేగా మారుతున్నందున దీనిపై ప్రజల్ని చైతన్యపరుస్తామన్నారు. జూన్‌నెలను యోగానెలగా ప్రకటించుకుని ముందుకెళ్తున్నామని వెల్లడించారు. ఆరోగ్యండబ్బులు ఆదాకు యోగా మంచి సాధనం అని స్పష్టం చేశారు. యోగాతో పాటు ప్రకృతి సేద్యాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 20 లక్షల ఎకరాల్లో 20లక్షల మంది రైతులు చేస్తున్న ప్రకృతి సేద్యాన్ని 50 లక్షల ఎకరాల్లో 50లక్షల మంది రైతులకు విస్తరిస్తారని వివరించారు. యోగాంధ్ర 2026పై మంతెన సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో యోగాపై యోగాసాధకులు చేసిన >>2

## కన్నడ ముఖ్యమంత్రిగా డికె పదవీ ప్రమాణం

ఆయనతోపాటు 13 మంది సీనియర్ ఎమ్మెల్యేలు కేబినెట్‌లోకి 5లో

యతీంద్ర, యుటిఖాదర్‌లకు కూడా ఛాన్స్



## రాష్ట్రానికి ప్రత్యేక విద్యుత్ బస్సులు

### 5,500 సర్వీసులు త్వరలో రోడ్లపైకి

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. ఎపికి ప్రత్యేక విద్యుత్ బస్సులను కేటాయించింది. ప్రధానమంత్రి ఇ-బస్సు పథకంలో భాగంగా రాష్ట్రానికి ఎలక్ట్రిక్ బస్సులను కేటాయిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఉన్న డిజల్ బస్సుల్లో కొన్ని కాలంచెల్లాయి. వీటిస్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ఎపిఎస్ఆర్టీసీ ప్రవేశపెట్టేందుకు >>2






## టెట్ తప్పనిసరి

### సర్వీసులో ఉన్న టీచర్లకూ యేడాదికి రెండు సార్లు పరీక్ష

### ఉత్తీర్ణత గడువు 2028 ఆగస్టు 31 దాకా పొడిగింపు

### సుప్రీం కోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఉద్యోగంలో ఉన్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఇటి) తప్పనిసరి అని సుప్రీంకోర్టు 65కు పైగా సమీక్షా పిటిషన్లను కొట్టివేస్తూ తీర్పు ఇచ్చింది.అయితే, పిల్లల ప్రాథమిక విద్యలో నిరంతరాయతను నిర్ధారించాల్సిన ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఇకపై ఎటువంటి పొడిగింపులు ఉండవని పేర్కొంటూ, పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి గడువును ఆగస్టు 31, 2028వరకు పొడిగించడం ద్వారా కోర్టు పాక్షిక ఉపశమనం కల్పించింది. ఉపాధ్యాయులు టెట్ (టిఇటి) అర్హతను పొందడానికి అసలు గడువు ఆగస్టు31,2027 కాగా, దానిని ఇప్పుడు ఆగస్టు 31, 2028 వరకు పొడిగించారు. అర్హులైన ఉపాధ్యాయులకు చట్టబద్ధ >>2

# ఎఐ ఇంజినీర్ల వేదిక ఎపి

మాస్కోలో రష్యా స్బేర్‌బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్‌తో మంత్రి లోకేష్ భేటీ

భారత్‌లో గిగాచాట్ ఎఐ, బ్యాంకింగ్ భద్రత టెక్నాలజీపై కీలక ప్రతిపాదనలు

విశాఖ ఫార్మా, వ్యవసాయ ఎగుమతిదారులకు ప్రత్యేక రుణాలు అందించాలని విజ్ఞప్తి


మాస్కోలో బుధవారం రష్యాకు చెందిన స్బేర్‌బ్యాంక్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజినీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు వేదికగా సిద్ధమవుతుందని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు.రష్యా పర్యటనలో భాగంగా మంత్రి నారా లోకేష్ ఆ దేశ ప్రభుత్వ నియంత్రణలోని అతిపెద్ద రిటైల్ బ్యాంకింగ్ సంస్థ స్బేర్‌బ్యాంక్‌తో కీలక చర్చలు జరిపారు. మాస్కోలో స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్‌తో భేటీ అయిన లోకేష్, భారత్‌లో బ్యాంకింగ్,టెక్నాలజీ, స్మార్ట్‌సిటీ రంగాలలో సహకారానికి సంబంధించి పలు ముఖ్యమైన ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ... స్బేర్‌బ్యాంక్ అభివృద్ధి చేసిన 'గిగాచాట్ ఎల్ఎల్ఎం'ను భారత బ్యాంకింగ్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రిటైల్ రంగాలకు విస్తరించాలని కోరారు. పాశ్చాత్య ప్లాట్‌ఫారమ్‌లకు ఇది ఒక సురక్షితమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దేశంలోని యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) నెట్‌వర్క్ భద్రతను మరింత పటిష్టం చేసేందుకు, స్బేర్‌బ్యాంక్ యొక్క అత్యాధునిక వాయిస్ రికగ్నిషన్, బయోమెట్రిక్ యాంటీఫ్రాడ్ నెట్ వర్క్‌ను భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ఇంటిగ్రేట్ చేయడానికి సాంకేతిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.భారత్‌లో కొనసాగుతున్న స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యకలాపాలను మెరుగుపరచడానికి స్బేర్‌బ్యాంక్ >>2



## భారత్‌పై 12.5% అదనపు సుంకాలు

### ఊహించని షాక్ ఇచ్చిన అమెరికా

**వాషింగ్టన్,జూన్ 3:** భారత్, అమెరికాల మధ్య ప్రతిపాదిత ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై న్యూఢిల్లీలో కీలకమైన ఉన్నత స్థాయి చర్చలు జరుగుతున్న తరుణంలో అమెరికా ఊహించని షాక్ఇచ్చింది. భారత్‌లో అన్యాయమైన వాణిజ్య పద్ధతులు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ, యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ కార్యాలయం భారత్‌ను దోషులజాబితాలో చేర్చింది. ఈ అన్వేషణల ఆధారంగా భారతదేశం నుంచి అమెరికాకు వెళ్లే వివిధ రకాల దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతంవరకు అదనపు సుంకాలను విధించాలని యూఎస్‌టిఆర్ ప్రతిపాదించింది. అమెరికా ట్రేడ్ యాక్ట్ 1974లోని సెక్షన్ >>2

# ఇంకా ప్రాంతీయ విద్వేషాలా?

● అది దేశ సమగ్రతకు భంగం కలిగించడమే ● కులదూషణలకు స్వస్తిచెప్పేందుకు సేనాగళం పేరిట కమిటీ ● తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం ● కెటిఆర్ తప్పుగా మాట్లాడి ఉండకపోవచ్చు ● పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన డి.సిఎం పవన్

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రాంతీయ విభేదాలతో రాజకీయాలు చేయడం అంటే దేశ సమగ్రతకు భంగం కలిగించడమేనని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అణచివేయగలిగే శక్తి ఎవ్వరికి లేదన్నారు.తెలంగాణ భారతదేశంలో అంతర్భాగం. ఎవరైనా అక్కడకు వెళ్లవచ్చు, ఆస్పత్రిలో చూపించుకోవచ్చు. హద్దులకు ఫెన్సింగ్‌లు వేస్తారేమో కానీ, మనుషుల మనసులకు వేయలేరు కదా! అని స్పష్టం చేశారు. అమరావతిలో పవన్ బుధవారం పర్యటించారు.శాఖమూరులో అక్కడి 58 అడుగుల అమరజీవి పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం కోరుకోవడం వేరని, కానీ తెలుగువారి కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఎప్పుడూ వేరే రాష్ట్రంవారు రాకూడదని చెప్పలేదని గుర్తుచేశారు. తెలంగాణలో ఆంధ్రా కాంట్రాక్టర్లు, ఎపిలో తెలంగాణ కాంట్రాక్టర్లు పనులు చేసుకుంటున్నప్పుడు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం ఎందుకని పవన్ ప్రశ్నించారు. పుష్కర కాలం తర్వాత కూడా ఇంత ద్వేషం ఉంటుందని తాను అనుకోలేదన్నారు. 'హైదరాబాద్ నా ఇల్లు, నా పార్టీ అక్కడే ఆవిర్భవించింది. అక్కడికి వెళ్లడానికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణలో పుట్టిన భూమి పుత్రులు సభలు పెట్టుకుంటే తప్పేంటి?'అని నిలదీశారు. బిఆర్ఎస్ నేత కెటిఆర్‌తో తనకు సోదర సమాన బంధం ఉందని, ఆయన తప్పుగా మాట్లాడి ఉండరని అభిప్రాయపడ్డారు. అలాగే ఈ వ్యవహారంలో సిఎం రేవంత్ రెడ్డి పాత్ర కూడా ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది నేతలే పనిగట్టుకుని ఇలాంటి విద్వేషాలు రేపుతున్నారని మండిపడ్డారు. రాహుల్ గాంధీ దేశమంతా తిరిగినా ప్రయోజనం ఏముందని, బూర్గుల రామకృష్ణారావు, పివి నరసింహారావు వంటి మహనీయుల త్యాగాలను గుర్తించాలని హితవు పలికారు. ఇలాంటి ప్రాంతీయ విద్వేషాలకు ముగింపు పలకడమే తన తపన అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయులను కూడా నేడు కుల చట్రాల్లో >>2



బుధవారం శాఖమూరులో మీడియాతో మాట్లాడుతున్న డి.సిఎం పవన్

## లేగదూడలపై పులి పంజా

### పోలవరం జిల్లాలో 13 ఆవుదూడలు హతం

**పోలవరం జిల్లా ప్రతినిధి మే 3 ప్రభాతవార్త:** పోలవరం జిల్లా దేవీపట్నం మండలం గంగవరం గ్రాములో బుధవారం తెల్లవారుజామున పశువుల పాకపై రాయల్ బెంగాల్ టైగర్ మెరుపు దాడి చేసి పంజా విసిరింది. పెద్ద పులి దాడిలో మొత్తం 13 లేగ దూడలు మృతి చెందాయి. ప్రాణాలు కోల్పోయిన దూడలకోసం తల్లి ఆవుల అక్రందన చూరులను సైతం కంట తడి పెట్టిస్తుంది.పెద్ద పులి వరుస దాడులతో గిరిజన గ్రామాల్లో అలజడి మొదలైంది. పులిని కట్టడి చేయటానికి రిస్క్యు బృందాలు సైతం రంగంలోకి దిగాయి. మైదాన ప్రాంతంలో పట్టుకున్న పులిని పాపికొండల అభయారణ్యంలో సుర >>2

# కల్తీ నెయ్యి కేసులో సోదాల కలకలం

## దేశంలోని 15 ప్రాంతాల్లో ఇడి అధికారులు తనిఖీలు, రూ. 60 లక్షల నగదు స్వాధీనం

**తిరుమల,జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడు కొండల వేంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడాల్సిన కీలక పెద్దలు లోపాలను అవకాశంగా మార్చుకుని నెయ్యిటెండర్లు మార్చి కల్తీనెయ్యి సరఫరా చేసుకున్నారనే ప్రధాన వివాదంలో తాజాగా ఇడి అధికారులు కీలక వ్యక్తులపై దాడులు చేయడం సంచలనంగా మారింది. ఇప్పటికే ఈ కల్తీనెయ్యి కేసులో సిబిఐ సిట్ అధికారులు, ఏకసభ్యకమిటీ ఇచ్చిన నివేదికల ఆధారంగా త్రిసభ్య కమిటీ వస్తుందనే హాట్‌టాపిక్‌గా మారినా తాజాగా బుధవారం ఏకకాలంలో దేశవ్యాప్తంగా కీలకమైన వ్యక్తులపై ఇడి దాడులు చేయడం మాత్రం ఆందోళనకలిగిస్తోంది. బుధవారం తిరుమల కల్తీ నెయ్యి కేసులో ఇడి జరిపిన విస్తృత సోదాల్లో ఎవరెవరికి ఏమేరకు వాటాలు అందాయనేది బయటకురానుంది. లడ్డూల కల్తీ నెయ్యి కేసులో దేశంలోని 15ప్రాంతాల్లో ఇడి అధికారుల సోదాలు చేయడం ప్రధానసూత్రధారుల్లో గుబులు రేకెత్తిస్తోంది. ఈ కేసులో నిందితులు పోమిల్ జైన్, విపిన్ జైన్, రాజు రాజశేఖరన్, రాజేష్ చావ్డా, అపూర్వ చావ్డా,సుచీంద్ర శాంతారామ్ లాంకే, అజయ్‌కుమార్ సుగంధ్, మహేష్‌కుమార్ రోహిరా, ఆశిష్ అగర్వాల్ తదితరుల నివాసాలు, కార్యాలయాల్లో ఇడి సోదాలు చేసి 60 లక్షల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మరీ కేసుల్లో ఉన్న వారివద్ద అంత భారీమొత్తంలో ఇప్పుడు లభించడం మాత్రం చర్చనీయాంశంగా మారింది, 2019-24 మధ్యకాలంలో గత వైసిపి ప్రభుత్వంలోని టిటిడి వైసిపి బోర్డు ఛైర్మన్, కొందరు టిటిడి అధికారులు చేతులు కలిపి ఏకంగా టెండర్ల నిబంధనలే మార్పుచేసి ,అర్హత లేని డెయిరీలకు నెయ్యిసరఫరా చేయడం అప్పగించారనేది 2024లోనే గుప్పుమంది. సుమారు 70 లక్షలకిలోల కల్తీ నెయ్యి టిటిడికి తిరుమలకు చేరిందని, దాదాపు 300 కోట్ల రూపాయలుపైమాటే ఆర్థిక లావాదేవీలు జరిగాయనేది ఇప్పటికే సిబిఐ సిట్, ఏకసభ్య కమిటీలు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి అందించాయి. ఇప్పుడు కల్తీనెయ్యి వినియోగం, సరఫరాలో గత మాజీ ఛైర్మన్‌లు వైవి సుబ్బారెడ్డి, అప్పటి టిటిడి ఇఒ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఇఒ ఏవి ధర్మారెడ్డి పాత్ర ఉందనేది ఏకసభ్యకమిటీ నిగ్గుతేల్చింది.



బుధవారం సచివాలయంలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన ఓఎన్‌జిసి చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్

# సిఎం చంద్రబాబుతో ఓఎన్‌జిసి చైర్మన్ భేటీ

**విజయవాడ, జూన్3, ప్రభాతవార్త ప్రతినిధి:** ఓఎన్‌జిసి చైర్మన్ అరుణ్ కుమార్ సింగ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర సచివాలయానికి వచ్చిన ఆయన రాష్ట్రంలో ఓఎన్‌జిసి చేపడుతున్న ప్రాజెక్టులు, భవిష్యత్ కార్యకలాపాలపై ముఖ్యమంత్రికి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా గోదావరి డెల్టా బేసిన్‌లో సహజవాయువు, చమురు అన్వేషణ, వెలికితీత పనుల పురోగతి సహా వివిధ అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. రాష్ట్రంలో ఇంధన రంగం అభివృద్ధికి ఓఎన్‌జిసి చేస్తున్న కృషిని, తదుపరి విస్తరణ ప్రణాళికల గురించి అరుణ్ కుమార్ సింగ్ సిఎంకు వివరించారు. ఓఎన్‌జిసి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రానికి సమకూరే ఆదాయం, ఉపాధి అవకాశాలు స్థానిక ఆర్థిక వ్యవస్థపై వాటి ప్రభావంపై సీఎం మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, ఓఎన్‌జిసి మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా చూడాలని, తద్వారా ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఇంధన భద్రతను పెంపొందించడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. సామాజిక బాధ్యతగా ఓఎన్‌జిసి సిఎస్‌ఆర్ నిధులను ఆయా గ్రామాల్లో ఖర్చు పెట్టాలని సిఎం సూచించారు. చమురు సహజవాయువు తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఓఎన్‌జిసి చైర్మన్ కాకినాడ, గుంటూరులో కేన్సర్ చికిత్సల్లో వినియోగించే అధునాతన యంత్రాలను ఆస్పత్రులకు సమకూరుతున్నట్టు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశానికి రాష్ట్ర పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, ఓఎన్‌జీసీ అధికారుల బృందం హాజరయ్యారు.

# టెట్ తప్పనిసరి

>> మైన అవసరాన్ని పూర్తి చేయడానికి సహేతుకమైన అవకాశాన్ని కల్పించేందుకు, వరుస పరీక్షల మధ్య సుమారు ఆరు నెలల వ్యవధి ఉండేలా, ప్రాధాన్యంగా సంవత్సరానికి రెండుసార్లు టెట్‌ని క్రమానుగతంగా నిర్వహించాలని రాష్ట్రాలు, సంబంధిత అధికారులను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. 'అంజుమన్ ఇషాత్‌ఎతలీమ్ ట్రస్ట్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర, 2025 ఎస్సీసీ ఆన్‌లైన్ ఎస్సీ 1912' కేసులో ఇచ్చిన తీర్పులోని ఒక భాగాన్ని సమీక్షించాలని కోరుతూ వివిధ రాష్ట్రాలు, ఉపాధ్యాయ సంఘాలు, సంస్థలు, వ్యక్తిగత ఉపాధ్యాయులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ చేపట్టి ఈ మేరకు తీర్పునిచ్చింది. సమీక్షా పిటిషన్ల బ్యాచ్‌లో, పిల్లల ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2009 (ఆర్‌టిఇ చట్టం)కు ముందు నియమితులై, 5 సంవత్సరాల కంటే ఎక్కువ సర్వీసు మిగిలి ఉన్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు, 1 సెప్టెంబర్ 2025 నుండి 2 సంవత్సరాల లోపు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిఇటీ)లో అర్హత సాధించాలని, అలా చేయని పక్షంలో వారు సర్వీసులో కొనసాగడానికి అనర్హులవుతారని నిర్దేశిస్తూ దాఖలైన పిటిషన్లపై, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం, 'అంజుమన్ ఇషాత్‌ఎతలీమ్ ట్రస్ట్' కేసులో ఇచ్చిన తమ తీర్పులోని సరైనతను పునరుద్ఘాటించింది. ఆర్‌టిఇ చట్టంలోని సెక్షన్ 23 ఎల్లప్పుడూ ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు నిర్దేశిత అర్హతలను పొందడాన్ని ఉద్దేశించిందని, ఆర్టికల్ 21ఎ కింద నాణ్యమైన విద్యకు రాజ్యాంగం కల్పించిన హామీలో భాగంగా టిఇటి ఒక తప్పనిసరి అర్హత అవసరం అని పేర్కొంది. "గతానికి వర్తింప జేయడం, ఎన్‌సిటిని చట్టంతో వైరుధ్యం, సేవా నిబంధనలలో అనుమతిలేని మార్పులు వంటి ఆరోపణలతో సహా సమీక్షలో పేర్కొన్న అన్ని కారణాలను కోర్టు తిరస్కరించింది. అయితే, ఆర్టికల్ 142 కింద ఆచరణాత్మక విధానాన్ని అవలంబిస్తూ, టిఇటి అర్హతను పొందేందుకు పాటించాల్సిన గడువును 2 సంవత్సరాల నుండి 3 సంవత్సరాలకు పొడిగించి, 31 ఆగస్టు 2028ని తుది గడువుగా నిర్ణయించింది.

# సిఐ చిన్నమల్లయ్యను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు

**విజయవాడ,జూన్3, ప్రభాతవార్తప్రతినిధి:** పల్నాడు జిల్లా సిఐ చిన్నమల్లయ్యను ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. సిఐ చిన్నమల్లయ్యను శాశ్వతంగాతొలగిస్తూ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నమల్లయ్య అత్యాచారం చేశాడని వినుకొండలో మహిళ ఫిర్యాదుతో సిఐ చిన్నమల్లయ్యపై అత్యాచారం కేసు నమోదు కావడం గమనార్హం. కేసునమోదు తర్వాత సిఐ చిన్నమల్లయ్య అజ్ఞాతంలోకి వెళ్లారు. అత్యాచారం కేసులో సిఐ చిన్నమల్లయ్యకు సుప్రీంకోర్టులో ఊరట దక్కలేదు. దాంతో చిన్నమల్లయ్య ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

# ప్రణయ్ ప్రకాశ్‌ను ఎసిబి కోర్టులో హాజరుపరిచిన సిట్

**విజయవాడ, జూన్ 3,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కేసులో ప్రణయ్ ప్రకాశ్‌ను సిట్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచింది. రిమాండ్ ముగియడంతో ప్రణయ్ ప్రకాశ్‌ను అధికారులు కోర్టులో హాజరుపరిచారు. మద్యం కుంభకోణం కేసులో ఏ52 నిందితుడిగా ప్రణయ్ ప్రకాశ్ ఉన్నారు. ఈ నెల 17వ తేదీకి రిమాండ్ పొడిగిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. నిందితుడు ప్రణయ్ ప్రకాశ్‌ను గుంటూరు జైలుకు అధికారులు తరలించారు.

# టూరిజం హబ్‌గా పోలవరం ప్రాజెక్టు: మంత్రి నిమ్మల

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** వచ్చే గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు ను టూరిజం హబ్ గా రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారని తెలిపారు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. అందుకు తగ్గట్లే లేఅవుట్ ప్లాన్ డిజైన్ తయారు చేసేందుకు 9,900 ఎకరాల విస్తీర్ణంతో లైడార్ సర్వే కూడా పూర్తి చేశామని స్పష్టం చేశారు. బుధవారం అమరావతి సచివాలయంలో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి నిమ్మల పోలవరం ప్రాజెక్టును ఏలూరు, కొవ్వూరు, రాజమండ్రిలకు జాతీయ రహదారులతో అనుసంధానించేలా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు.

# ఆరోగ్యాంధ్ర కోసం 'యోగాంధ్ర'

>> ఓ వీడియో, పోస్టర్లను సిఎం విడుదల చేశారు

**'తెలంగాణలో కొందరు విద్వేషాలు రెచ్చగొడుతున్నారు'**

తెలంగాణలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యక్రమం అడ్డుకోవడం సరికాదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దీనికి ప్రజల్లో చైతన్యం తీసుకురావటం తప్ప మరోమార్గం లేదన్నారు. ప్రజలకు మంచి చేయటంలో పోటీ పడాలి తప్ప ప్రజల మధ్య విభేదాలు తేవటం సరికాదని హితవు పలికారు. విభజన జరిగి 12 ఏళ్ల సమయం గడిచిపోయిందన్నారు. ప్రజలకు ఎవరు మంచి చేశారన్నది అందరికీ తెలుసునని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఈ అభివృద్ధిని లాజికల్‌గా తీసుకెళ్లాలన్నారు. అనవసరంగా వివాదాలు సృష్టించటం ఎవరికీ మంచిది కాదని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ఎవరు ఎక్కడైనా కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేశారు. తానూ ఇటీవల తమిళనాడు వెళ్లి ఎన్నికల ప్రచారం చేసొచ్చానని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాలుగా విడిపోయాం. తెలంగాణలోని కొందరు నాయకులు ఇప్పుడు మాట్లాడి విద్వేషాలు రెచ్చగొట్టలేరు.ఏ ప్రాంతానికి ఎవరేం చేశారో ప్రజలకు తెలుసు. తెలంగాణలోని కొందరు నాయకులు అనవసర అంశాలు మాట్లాడుతున్నారు.నేను తమిళనాడులో ఎన్నికల ప్రచారం చేసి వచ్చాను.తమిళనాడుకు కర్నాటకతో పాటు ఆలిండియా నేతలతో పాటు అన్ని ప్రాంతాల నేతలు వచ్చారు. కర్ణాటక నుంచి డికె శివకుమార్ కూడా వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీతో పాటు బిఆర్‌ఎస్ ఉంది. బిఆర్‌ఎస్ నేషనల్ పార్టీ అని ఆంధ్రప్రదేశ్‌లో కూడా పెట్టారు. విస్తరిస్తాం అన్నారు. మరి ఇప్పుడు ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో నాకైతే అర్థం కావడం లేదు. ఇది కరెక్ట్ కాదు. అమెరికాలో, ఆస్ట్రేలియాలో, యూకేలో తెలుగువాళ్లు రాజ్యాంగ పదవుల్లో ఉన్నారు.ప్రపంచంలో అన్ని దేశాల్లో మన వాళ్లు పదవులు చేపడుతున్నారు. అక్కడ ఉండే రాజ్యాంగం ప్రకారం పని చేస్తున్నారు.ప్రజలకు ఎవరు మంచిగా సేవలందిస్తారో... వాళ్లు ఆయా ప్రాంతాల్లో నాయకులు అవుతున్నారు. అభివృద్ధిలో, ప్రజా సేవలో పోటీ పడాలి. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి. గొడ్డలి పార్టీకి విమర్శలు, విధ్వంసం తప్ప ఏమీ చేతకాదు. ఆరోగ్యకరమైన రాజకీయాలు చేయలేని వారిని ప్రజలు బహిష్కరించాలి.అసత్యాన్ని పదేపదే చెబితే ప్రజలు విశ్వసిస్తారని కొందరు అనుకుంటున్నారు.డీఎస్సీ ద్వారా ఉద్యోగాల నియామకానికి టీడీపీ ఓ బ్రాండ్.ఎన్నికల్లో ప్రకటించి అధికారంలోకి రాగానే మొదటి సంతకం చేసి అత్యంత కట్టుదిట్టంగా నియామకాలు చేపట్టాం.స్పోర్ట్ కోటాలో అక్రమాలు అంటున్నారు. కానీ వారికి క్రీడల్లో ఏమేమి ఉన్నాయో కూడా తెలీకుండా మాట్లాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి చేసిన కేటగిరీల ఆధారంగా ఈ ఉద్యోగాలు వచ్చాయి. వాళ్ల పేటిఎం బ్యాచ్‌ల ద్వారా లేని పోని దుష్ప్రచారం చేస్తున్నారు అని చంద్రబాబు విమర్శించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్, యోగా నేచురోపతి సలహాదారు మంతెన సత్యనారాయణగారు, అధికారులు పాల్గొన్నారు.

**ఒక అసత్యాన్ని పదేపదే చెబితే నమ్మేస్తారని అనుకుంటున్నారు**

ఒక అసత్యాన్ని పదేపదే చెబితే నమ్మేస్తారని అనుకుంటున్నారని సిఎం చంద్రబాబు అన్నారు. మెగా డిఎస్సీని పారదర్శకంగా నిర్వహించామన్నారు. నోరు ఉందని, ఉందని, ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారన్నారు. క్రీడలు, వాటి సంఘాల గురించి తెలియకుండానే మాట్లాడుతున్నారన్నారు. గాలికబుర్లు, బురద చల్లితే ఎవరూ నమ్మరన్నారు. రవిశంకర్, దాజీ పిల్లలకు కొన్ని కార్యక్రమాలు నిర్వహించారని వివరించారు. వెయ్యి రెసిడెన్షియల్ పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్ట్ తెస్తున్నామని పేర్కొన్నారు.

# ఎఐ ఇంజినీర్ల వేదిక ఎపి

>> ప్రిడిక్టివ్ అనలిటిక్స్, స్మార్ట్ ట్రాన్సిట్ సర్వైలెన్స్ వంటి డిజిటల్ పరిష్కారాలను అందించాలని లోకేష్ సూచించారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజనీర్లను వేగంగా తీర్చిదిద్దేందుకు స్బేర్‌బ్యాంక్ యొక్క ప్రత్యేక శిక్షణా విధానమైన స్కూల్ కోడింగ్ అకాడమీలను భారత్‌లోని ప్రధాన విద్యా కేంద్రాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నంలోని ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం రూపాయి,రూబుల్ వాణిజ్యానికి అనుమతులు ఇవ్వడంతో పాటు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై స్బేర్‌బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో తమ కార్యకలాపాలను వివరిస్తూ, న్యూఢిల్లీలోని కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక వాణిజ్య ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. బెంగళూరులోని తమ ఐటీ హబ్, రూపాయిరూబుల్ వాణిజ్య లావాదేవీలకు సమన్వయ కేంద్రంగా పనిచేస్తోందని చెప్పారు. న్యూఢిల్లీ, ముంబైలోని తమ శాఖలు వ్యూహాత్మక వాణిజ్య కారిడార్లలో మౌలిక సదుపాయాల పెట్టుబడులకు గేట్‌వేలుగా ఉన్నాయని వివరించారు. మంత్రి లోకేష్ చేసిన ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి, సానుకూల నిర్ణయం తీసుకుంటామని యెఫిమోవ్ హామీ ఇచ్చారు.మాస్కో కేంద్రంగా పనిచేస్తున్న స్బేర్‌బ్యాంక్, రిటైల్ బ్యాంకింగ్‌తో పాటు క్లౌడ్ సేవలు, కృత్రిమ మేధ (ఏఐ) రంగాల్లో విస్తరించిన భారీ సంస్థ. ప్రపంచవ్యాప్తంగా 11 కోట్లకు పైగా రిటైల్, 35 లక్షల కార్పొరేట్ ఖాతాదారులను కలిగి ఉన్న ఈ బ్యాంకు, 12,000 శాఖలతో ప్రతిరోజూ 8 కోట్ల మంది డిజిటల్ వినియోగదారులకు సేవలందిస్తోంది.

**ప్రముఖ రష్యన్ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఒ ఇల్యా కోసిహ్‌తో లోకేష్ సమావేశం**

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రష్యాలో పర్యటిస్తున్న రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్, మాస్కోలో కీలక సమావేశం నిర్వహించారు. రష్యాలో గ్యాస్ ఫీల్డ్స్, మిథనాల్ కెమికల్ ప్రాజెక్టులను నిర్వహిస్తున్న ప్రముఖ సంస్థ రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఒ ఇల్యా కోసిహ్, అంతర్జాతీయ వ్యాపార విభాగాధిపతి దర్యా అషానియాలతో ఆయన భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను వివరిస్తూ, పలు కీలక ప్రతిపాదనలను వారి ముందుంచారు.ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ, "భారత్ దిగుమతి చేసుకునే పెట్రోకెమికల్స్, స్పెషాలిటీ కెమికల్స్‌ను ప్రాసెస్ చేసేందుకు వీలుగా, భారత తూర్పు తీరంలోని విశాఖ కాకినాడ పిసిపిఐఆర్ పరిధిలో రస్ కెమ్ ఆధ్వర్యంలో ఒక అత్యాధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయండి" అని ఆహ్వానించారు. పోర్టు ఆధారిత కెమికల్ లాజిస్టిక్స్ హబ్‌ల నిర్మాణం, బల్క్ కెమికల్ స్టోరేజీ వసతులు, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. అంతేకాకుండా, ఎపిలో అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యాన్ని వినియోగించుకుని ఒక కొలాబరేటివ్ పాలిమర్ అప్లికేషన్, మెటీరియల్ సైన్స్ పరిశోధన కేంద్రాన్ని స్థాపించాలని సూచించారు. రస్ కెమ్ టెక్నాలజీతో పునరుత్పాదక ఇంధన కారిడార్లను అనుసంధానిస్తూ, తక్కువ కర్బన ఉద్గారాలు వెలువరించే రసాయనాల తయారీ యూనిట్‌ను నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు.

మంత్రి లోకేష్ ప్రతిపాదనలపై రస్ కెమ్ గ్రూప్ డిప్యూటీ సిఇఒ ఇల్యా కోసిహ్ సానుకూలంగా స్పందించారు. భారత్‌లో ప్రత్యేక ఎస్‌పివిల ద్వారా హోల్‌సేల్ కెమికల్ పంపిణీ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సంస్థలతో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, ఇప్పటికే ముంబై, కాన్పూర్‌లలోని పంపిణీ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన రసాయనాలను సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ సరఫరా కేంద్రం ద్వారా విశాఖపట్నం, కాకినాడలోని ఫార్మా, తయారీ పరిశ్రమలకు కీలక రసాయనాలను అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత్‌లోని భారీ పెట్రోకెమికల్ ప్లాంట్లను ఉపయోగించుకుని తమ గ్లోబల్ ఖాతాదారులకు స్థిరమైన సరఫరా అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి నారా లోకేష్ చేసిన ప్రతిపాదనలు ఆశాజనకంగా ఉన్నాయని, వీటిపై తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి త్వరలోనే తుది నిర్ణయం ప్రకటిస్తామని ఇల్యా కోసిహ్ తెలిపారు.

# ప్రత్యేక విద్యుత్ బస్సులు

>> సిద్ధమవుతోంది. పర్యావరణాన్ని రక్షించేందుకు ఏకంగా 5,500 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ తీసుకురానుండగా.. 500 సిఎన్‌జీ బస్సులను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు. దశలవారీగా ఈ బస్సులు రోడ్డెక్కనున్నాయి. 750 బస్సుల్లో 300 బస్సులు జులై నుంచి పరుగులు పెట్టనున్నాయి.2027 మార్చి నాటికి..450 బస్సులు ఆగస్టులో రోడ్లపైకి రానున్నాయి. తిరుపతి, కర్నూలు, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, అమరావతి, గుంటూరు, విజయవాడ, కాకినాడ, విశాఖపట్నం, రాజమండ్రి నగరాల్లో ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సులు సర్వీసులు అందించనున్నాయి. కాలం చెల్లిన పల్లెవెలుగు, సిటీబస్సులు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ బస్సుల స్థానంలో వీటిని ప్రవేశపెట్టనున్నారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ పద్దతిలో రాష్ట్ర ప్రభుత్వం 1450 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకోవాలని ప్లాన్ చేసింది. జులై నాటికి వీటికి టెండర్లను ఆహ్వానించనున్నారు. అనంతరం 2027 మార్చి నాటికి వీటిని అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు రచిస్తున్నారు. పూర్వోదయ అనే పథకం కింద కేంద్రం రాష్ట్రాలకు విద్యుత్ బస్సులను కేటాయిస్తోంది. అందులో భాగంగా ఏపీకి వెయ్యి బస్సులను కేటాయించింది. ఇక పిఎం ఈ డ్రైవ్ పథకం కింద మరో 2 వేల బస్సుల మంజూరు కోసం కేంద్రానికి ఎపిఎస్‌ఆర్టీసీ ప్రతిపాదనలు పంపింది. అలాగే 500 సిఎన్‌జి బస్సులు కూడా తీసుకోవాలని చూస్తోంది. సిఎన్‌జి ఎక్కువగా అందుబాటులో ఉండే నగరాల్లో వీటిని నడపనుంది. ప్రస్తుతం ఉన్న రంగులతోనే ఈ బస్సులు ఉండనున్నాయి. దీంతో ప్రయాణికులకు గందరగోళానికి గురి కాకుండా ఉంటారని ప్రభుత్వం చెబుతోంది. ఇక సిఎన్‌జి బస్సుల కోసం సిఎన్‌జి కంపెనీలతో సంప్రదింపులు జరుపుతోంది.

# 5, 8 తేదీల్లో సిఎం విశాఖ పర్యటన

**విజయవాడ,జూన్3,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ నెల 5, 8 తేదీల్లో విశాఖలో సిఎం చంద్రబాబు పర్యటించనున్నారు. 5న సముద్ర ఆహార ఎగుమతులపై నేషనల్ కాన్ఫరెన్స్ కేంద్ర మంత్రులతో కలిసి పాల్గొననున్న సిఎం చంద్రబాబు. విశాఖ ఎకనామిక్ రీజియన్‌పై సమీక్ష చేయనున్న సిఎం. ఈ నెల 8న ఎపిఐసి టెక్నాలజీస్ సెమీ కండక్టర్ యూనిట్‌కు భూమిపూజ చేస్తారు.

# భారత్‌పై 12.5% అదనపు సుంకాలు

>> 301 కింద నిర్వహించిన 60 సుదీర్ఘ దర్యాప్తుల ఫలితాలను యూఎస్‌టిఆర్ విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 54 ఆర్థిక వ్యవస్థలలో బలవంతపు శ్రమ ద్వారా తయారయ్యే వస్తువుల దిగుమతులను సమర్థవంతంగా నిషేధించడానికి లేదా నిరోధించడానికి తగినంత కఠినమైన చర్యలు లేవని అమెరికా తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ 54 దేశాల జాబితాలోనే భారతదేశాన్ని కూడా చేర్చడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. అమెరికా ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంబాసిడర్ జామీసన్ గ్రీం ఈ విషయమై మాట్లాడుతూ మా అత్యంత ముఖ్యమైన వాణిజ్య భాగస్వాములు బలవంతపు శ్రమతో తయారైన వస్తువుల దిగుమతుల సమస్యను పరిష్కరించడంలో విఫలం కావడం అంగీకరించలేనిది. దీనివల్ల అమెరికా కార్మికులు ప్రపంచవ్యాప్తంగా అసమానమైన, అన్యాయమైన వాతావరణంలో పోటీ పడాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యూఎస్‌టిఆర్ నోటిఫికేషన్ ప్రకారం బలవంతపు శ్రమకు సంబంధించిన దిగుమ తులపై ఇప్పటికే పాక్షిక ఆంక్షలు విధించిన లేదా పరస్పర వాణిజ్య ఒప్పందాల ద్వారా ఆ నిబంధనలను అమలు చేయడానికి అంగీకరించిన దేశాలపై 10 శాతం అదనపు టారిఫ్ పడుతుంది. ఈ ప్రమాణాలను అస్సలు పాటించని భారతదేశం, చైనా, జపాన్, సౌత్ కొరియా, బ్రెజిల్ వంటి దేశాల దిగుమతులపై గరిష్టంగా 12.5 శాతం అదనపు సుంకం విధించనున్నారు.

## వారం - వర్జ్యం

04-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
చవితి రా.11.29
ఉత్తరాషాఢ రా.3.41
వర్జ్యం : ఉ.9.53-ఉ.11.40
దు.ఉ.9.54-ఉ.10.46,
2) మ.3.08-4.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సంతానము మీ అభిప్రాయములతో ఏకీభవించక పోవచ్చు. రహస్య పెట్టుబడి పెట్టిన వ్యవహారాలు చిక్కుల్లో పడతాయి.

**వృషభం:** ఏ కార్యక్రమమును చేపట్టినా ఆలోచించి, నిర్ణయములను తీసుకొనుట మంచిది. ఆర్థిక సంస్థలనుండి ఋణాలు తీసుకుంటారు.

**మిథునం:** గృహ నిర్మాణాలు వాహనాలు కొనుగోలు ప్రయత్నాలు సాగిస్తారు. ఆర్థిక భారం పెరుగుతుంది.ఆస్తి వివాదాలు.

**కర్కాటకం:** కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. పెట్టుబడులకు తగిన సమయం. వస్త్రలాభం కలదు.

**సింహం:**కోర్టు వివాదాలు పరిష్కారమవుతాయి. వరిశ్రమలు, సంస్థల ఏర్పాటులో ఆటంకాలు తొలగుతాయి.

**కన్య :**ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదురుతాయి. సెల్ఫ్ డ్రైవింగ్ పట్ల మెలకువ అవసరం.ఆరోగ్యం జాగ్రత్త.

**తుల :** ముఖ్యమైన కార్యక్రమాలు నెమ్మదిగా పూర్తికాగలవు. ఆరోగ్య సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు.స్పెక్యులేషన్‌కు దూరముగా వుండండి.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి కీలక సమాచారం అందుకుంటారు. పలుకుబడి కలిగిన వ్యక్తులను కలుసుకుంటారు.

**ధనుస్సు:** ఇతరులకు సైతం మీరు సహాయం అందిస్తారు. బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తిస్తారు.వస్త్రలాభం కలదు.

**మకరం:**ఆర్థికపరమైన లావాదేవీలలో ఆటు పోట్లు తొలగుతాయి. శత్రువులు సైతం మిత్రులుగా మారతారు.బంధువులను కలుస్తారు.

**కుంభం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**మీనం:** విదేశీ పర్యటనల అవకాశాలు. సోదరుల నుండి విలువైన సమాచారం అందుకోండి.పరిచయాలు పెరుగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం ధర్మశాలలోని నివాసంలో దలైలామాకు గ్రామీ అవార్డును అమ్జద్ అలీ ఖాన్ ప్రదానం చేస్తున్న దృశ్యం

# ఘోర అగ్నిప్రమాదం

>> ఉన్నది. కానీ ఆ స్టే ఇన్‌లో 24 రూమ్‌లకు బుకింగ్ అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. లైసెన్సు జారీ అంశంలో ఏవైనా ఉల్లంఘనలు జరిగాయా లేదా అన్న కోణంలో విచారణ చేపడుతున్నారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన అతిపెద్ద అగ్నిప్రమాద ఘటనగా ఇది నమోదు అయ్యింది. బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్ కింద ఆరు రూమ్‌లకు ఢిల్లీ టూరిజం శాఖ పర్మిషన్ ఇచ్చింది. కానీ అక్రమంగా ఆ హోటల్ గదిలో 24 రూమ్‌లను నడుపుతున్నట్లు గుర్తించారు. ఆన్‌లైన్ బుకింగ్‌లో ఆ హోటల్‌కు 24 రూమ్‌లు ఉన్నట్లు రిజర్వేషన్ చూపిస్తున్నది. అయిదు అంతస్తుల ఆ బిల్డింగ్ ప్రమాదంలో 40 మందిని రక్షించారు. ఆ బిల్డింగ్‌లో ఉన్న లెమన్ గ్రీన్ రెస్టారెంట్ నుంచి మంటలు వ్యాపించి ఉంటాయని తొలుత అనుమానించారు. కానీ బీ అండ్ బీ ఈటరీ బిల్డింగ్ నుంచే మంటలు వ్యాప్తి చెందినట్లు అంచనాకు వచ్చారు. 21 మంది మృతుల్లో పది మంది విదేశీయులు ఉన్నట్లు నిర్ధారించారు. వారిలో ఎక్కువ శాతం మంది సెంట్రల్ ఏషియా, ఆఫ్రికా దేశస్థులు ఉన్నారు. గాయపడ్డ వారి సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. బిల్డింగ్‌లో ఓ బేస్మెంట్, గ్రౌండ్ ఫ్లోర్, అయిదు అంతస్తులు ఉన్నట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖ చెబుతోంది. ఉదయం 9.30 నిమిషాల సమయంలో బిల్డింగ్‌లో మంటలు, పొగ అలుముకున్నట్లు తెలిసింది. బీ అండ్ బీలో స్టే చేస్తున్న వారి పరిస్థితి దారుణంగా ఉంది. సమీప ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారే ఎక్కువగా బీ అండ్ బీలో బస చేస్తున్నట్లు తెలుస్తోంది. బంగ్లాదేశ్ నుంచి మోకాలి మార్పిడి గురించి అయిదు రోజుల క్రితం ఓ ఫ్యామిలీ ఆ హోటల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తున్నారు. బిల్డింగ్‌లో ఎటువంటి వెంటిలేషన్ లేదని, కిటికీలు లేవని, బాత్రూమ్‌ల్లో కూడా కిటికీలు లేవని ఓ వ్యక్తి ఆరోపించాడు. ఆ బిల్డింగ్‌కు ఒకే ఎగ్జిట్ ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న రెస్టారెంట్ నుంచి మంటలు వ్యాపించాయా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మికాసా ఇన్‌కు చెందిన రెస్టారెంట్‌లో మొదలైన మంటలు ఆ తర్వాత పైకి వ్యాపించాయి. ఆ బిల్డింగ్ అయిదు అంతస్తులు ఉన్నది. మంటలు, పొగ దట్టంగా కమ్ముకున్న సమయంలో ఓ మహిళ ఆ హోటల్ పైనుంచి కిందకు దూకింది. ఆ బిల్డింగ్ నుంచి ఇద్దరు మహిళలు దూకినట్లు తెలుస్తోంది. ఆ మహిళలను స్థానికులు కాపాడే ప్రయత్నం చేశారు. బిల్డింగ్ వద్ద మాట్రిసెస్ ఏర్పాటు చేశారు. ఆ పరుపు బెడ్‌లపై ఓ మహిళ దూకిన విజువల్స్ చిక్కాయి. ప్రస్తుతం ఆ వీడియో వైరల్ అవుతోంది.

# ఇంకా ప్రాంతీయ విద్వేషాలా?

>> బంధించడానికి సగటు రాజకీయ ఆలోచనలు చేస్తున్నారని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి తప్పు చేస్తే, దానికి కులాలను ఆపాదిస్తూ సమాజంలో చిచ్చు పెడుతున్నారని దుయ్యబట్టారు. కొంతమంది స్వార్థపరులు ఈ కుల సంఘాలను అడ్డం పెట్టుకుని వ్యక్తిగతంగా బాగుపడుతున్నారనే అనుమానం ఉందన్నారు. ఇటీవల కూటమి మంత్రులు, ఎమ్మెల్యేల సమావేశంలో దీనిపై చర్చించామని.. ఎవరు ఎలా మాట్లాడినా తామంతా కలిసికట్టుగా స్పందిస్తామని పవన్ తెలిపారు. కులదూషణలకు స్వస్తి చెప్పాలని సేనాగళం పేరుతో కమిటీ ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సిఎం పవన్ అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు దారి తీసిందన్నారు. వైఎస్సార్సీ వచ్చాక రాజకీయాల్లో కులదూషణలు మరింత పెరిగాయని గుర్తుచేశారు. ఎవరైనా తప్పుచేస్తే ఆ వ్యక్తిని నిందిం చాలి తప్ప అతడి కులాన్ని కాదని పవన్ హితవు పలికారు. సమాజంలో ఏదైనా తప్పు జరిగితే, అది చేసిన వ్యక్తిని మాత్రమే దోషిగాభావించాలి. అతని కులానికి, ప్రాంతానికి ఆపాదించకూడదు. రెండు దశాబ్దా లుగా రాజకీయాల్లో కుల దూషణలు, విద్వేషాలు బాగా ఎక్కువయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వ సమయంలో ఇవి తారస్థాయికి చేరుకున్నాయి. ఒక వ్యక్తి చేసే తప్పునుగానీ, నేరాన్నిగానీ మొత్తం కులానికి ఆపాదించి, అందరి మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం అధికం అయింది. దీనివల్ల ప్రజలు మధ్య విద్వేషాలు, వైషమ్యాలు ఎక్కువ అవుతున్నాయి. ఇదే పద్ధతి కొనసాగితే సమాజం విచ్ఛిన్నం ఖాయం. దీనికి ఎక్కడో దగ్గర చెక్ పెట్టాలనే ఉన్నతమైన ఆలోచనతో జనసేన పార్టీ సేనా గళం పేరుతో అన్ని సామాజిక వర్గాల ప్రతినిధులతో ఓ ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేసిందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ సేవాగళం కులాలకు, ప్రాంతాలకి అతీతంగా ఎవరు తప్పు చేసినా ఎత్తి చూపుతుందన్నారు.

**గద్దర్ కుటుంబసభ్యులు అంటే తనకు చాలా ఇష్టం, కెటిఆర్ నాకు మిత్రుడు**

గద్దర్ కుటుంబసభ్యులు అంటే తనకు చాలా ఇష్టమని పవన్ కల్యాణ్ అన్నారు. పాలసీలపై కెటిఆర్ మాట్లాడి ఉండవచ్చు, ఆయన నాకు మిత్రుడని పవన్ వివరించారు. విభజన రాజకీయాలకు స్వస్తి పలకాలి, ఎవరికీ మంచిది కాదన్నారు. కెటిఆర్, నేను అనేక విషయాలు మాట్లాడుకుంటాం, విభేదాలు ఏమీ లేవని పవన్ తేల్చిచెప్పారు. తెలంగాణా,ఆంధ్ర పౌర సంబంధాలు భంగం కలిగించడం మంచిది కాదన్నారు.

**మూడు రాజధానులు అయిపోయాయి... ఇప్పుడు మూడు జిల్లాల రాజధానా!**

అమరావతి ఉద్యమ సమయంలో అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చేలా ఒక భావన కలపాలనే ఉద్దేశంతోనే జై ఆంధ్ర నినాదం ఇవ్వాలని కోరాను. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అంటూ పాలన సాగించింది. ఇప్పుడు అధికారంపోయాక మూడుజిల్లాలను కలుపుతూ ఏదో పేరుతో రాజధాని అంటున్నారు. 2014లో అమరావతి అనే రాజధాని నిర్ణయం తీసుకున్నారు. దానికి కట్టుబడి ముందుకు వెళ్లాలి. ప్రతిసారీ ఇష్టానుసారం రాజధాని మార్చుకునేలా మాట్లాడటం సరికాదు. ఇక్కడ రైతులు 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారు. ఇక్కడ రాజధాని అభివృద్ధి చేయాలి. ప్రతిసారీ అమరావతి విషయంలో వైసీపీ ద్వంద్వ విధానాలతో ప్రజల్లోనూ, పారిశ్రామికవేత్తల్లోనూ కావాలనే అయోమయం నెలకొల్పుతోంది. జనసేన నూతనంగా ఏర్పాటు చేస్తున్న సేనా గళం అందరినీ కలపాలనే బృహత్తర ఆశయంతో ముందుకు సాగుతుంది' అన్నారు.

# లేగదూడలపై పులి పంజా

>> క్షి త ప్రాంతంలో వదలటంతో అడవి నుండి బయటకు వస్తున్న పులి సమీపంలో ఉన్న గిరిజన గ్రామాల్లో పశువులపై దాడి చేసి హతమారుస్తుంది.పులి దాడులతో పశువులతో పాటు తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఆకలేసి నప్పుడు మాత్రమే ఆవులను చంపి తినేది. కేవలము రెండు మూడు రోజులకు మాత్రమే ఒక పశువును చంపేది. నాలుగు నెలల పాటు ఇదే పందాను అనుసరించిన పెద్దపులి తన పందా మార్చింది. గత నెల రోజులుగా పశువులపై దాడి చేసి మూకుమ్మడిగా చంపి వేస్తోంది. తమ పశు సంపదను పెద్దపులి చంపి వేస్తుంటే అటవీ శాఖ అధికారులు కంటి తుడుపు చర్యలు మాత్రమే తీసుకుంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల విలువ వేలరూపాయలు ఉంటే కేవలం కొద్ది మాత్రమే పరిహారము చెల్లిస్తు న్నారని ఆదివాసులు ఆరోపిస్తున్నారు. గతంలోనే పెద్దపులి మెడకు అటవీ అధికారులు జి పి ఎస్ ట్రాకర్‌అమర్చారు. దీంతో ఎంత దట్టమైన అడవిలో ఉన్నప్పటికీ పులి కదలికలు అధికారులకు సులువుగా తెలిసిపోతున్నాయి.

పులిని బంధించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ సైతం రంగంలోకి దింపామని అటవీ అధికారులు రోజు చెప్తున్నారు. అలాగే రాష్ట్రస్థాయి జిల్లాస్థాయి అటవీ అధికారులు పులి వెనుకే ప్రయాణం సాగిస్తున్నారు. పులి ఉనికిని చెబుతూ ప్రజలను అప్రమత్తం చేయటం మినహా గత నాలుగు నెలలుగా చేసింది ఏమీ లేదని ఆదివాసీలు పెదవి విరుస్తున్నారు. మైదాన ప్రాంతంలో స్వల్ప కాలంలోనే పులిని బంధించగలిగిన అటవీ అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో పులిని బంధించడంలో ఎందుకు విఫలమవుతున్నారు అనేది వేలడాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. పులిని బంధించేందుకు ఈ నాలుగు నెలల కాలంలో ప్రభుత్వానికి కొన్ని లక్షల రూపాయల ఖర్చయినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లభించలేదు. పులి వైఖరిలో వచ్చిన మార్పుతో రాబోయే రోజుల్లో మనుషులపై దాడి చేస్తే పరిస్థితి ఏంటా?అని ఇక్కడ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. త్వరలోనే పులి మనుషులపై దాడి చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం పులిని సురక్షితంగా వెంటనే బంధించమని అటవీ అధికారులను ఆదేశించారు. ఫిబ్రవరి 14న ఈ పులిని మైదాన ప్రాంతంలో నుండి తీసుకువచ్చి పాపికొండల సమీపంలో వదిలిపెట్టారు. అప్పటినుండి ఈబెంగాల్ టైగర్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అటు మైదాన ప్రాంతం ఇటు ఏజెన్సీ ప్రాంతాన్ని కలియ తిరుగుతూ షికారు చేస్తోంది. పులి దాడులలో పశుసంపదను కోల్పోతున్న రైతులు ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. ఎంతోకొంత పరిహారం చెల్లించి చేతులు దులుపుకొని ముందుకు సాగిపోవడం తప్ప అటవీ అధికారులు చేసిందేమీ కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.బుధవారం గంగావరం గ్రామాన్ని సందర్శించిన అటవీశాఖ అధికారులు పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, మత్తుమందు ప్రయోగానికి అనువైన అవకాశాన్ని గుర్తించేందుకు 6 ర్యాపిడ్ రెస్క్యూ టీమ్‌లు,5 ప్రజా అవగాహన బృందాలు, 4 ట్రాంక్విలైజింగ్‌బృందాలు, 2 డ్రోన్ బృందాలు, 1 కేజ్ బృందం, 1 వన్యప్రాణి అంబులెన్స్ బృందం మరియు ఫ్రంట్‌లైన్ సిబ్బందితో కూడిన 19 హనుమాన్ బృందాలు సమన్వయంతో పనిచేస్తు న్నాయని,అన్ని బృందాలు అత్యంత అప్రమత్తంగా ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాయని, పులిని త్వరితగతిన బంధించేందుకు అటవీ శాఖ 200 మందికి పైగా అధికారులు, సిబ్బందిని మోహరించి యుద్ధప్రాతిపదికన చర్యలు చెపట్టింది.

# ఎపి ప్రకృతి సాగుకు ఫుడ్ ప్లానెట్ ప్రైజ్

• అవార్డు లభించడం రాష్ట్రానికి గర్వకారణం: మంత్రి అచ్చెన్నాయుడు



ప్రతిష్మాత్మక ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026 పురస్కారం అందుకుంటున్న వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ కార్యనిర్వహణ అధికారి తల్లం విజయ్ కుమార్

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమానికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్మాత్మక "ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026" పురస్కారం ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం (ఎపిసిఎన్ఎఫ్)కు దక్కింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026 రాష్ట్రానికి లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దార్శనికతతో రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం విజయవంతంగా అమలవుతోందన్నారు. రైతులు, గ్రామీణ మహిళలు, వ్యవసాయ శాఖ అధికారులు, ఆర్‌వైఎస్ఎస్ సంస్థ, శాస్త్రవేత్తల సమిష్టి కృషి ఫలితంగానే ఈ అంతర్జాతీయ గుర్తింపు లభించిందని తెలిపారు. ప్రపంచ స్థాయిలో లభించిన ఈ పురస్కారాన్ని రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు అంకితం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతమైన ఈ నమూనాను దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సుస్థిర వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు రైతాంగ అభివృద్ధికి కొత్త అవకాశాలు తీసుకురావడంతో పాటు ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయం రైతులకు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయాన్ని అందించడమే కాకుండా నేల సారాన్ని పెంపొందించడం, జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం, రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం వంటి ప్రయోజనాలను అందిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నమూనా దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు శ్రీలంక, జాంబియా దేశాల్లోనూ అమలవుతుండటం ఆంధ్రప్రదేశ్ రూపొందించిన విధానం ప్రపంచవ్యాప్తంగా ఆచరణీయమని నిరూపిస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా మహిళల నాయకత్వం ఈ ఉద్యమ విజయానికి ప్రధాన బలంగా నిలిచిందని వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులైన గ్రామీణ మహిళలు కుటుంబ స్థాయిలో ఆలోచనా విధానంలో మార్పు తీసుకువచ్చి రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 18 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు నడిపిస్తున్న 10 వేల మందికిపైగా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ల సేవలు అభినందనీయమని తెలిపారు. కర్ట్ బర్గ్‌ఫోర్స్ ఫౌండేషన్ జూన్ 2న స్వీడన్‌లోని బస్తాద్ నగరంలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి. రాజశేఖర్, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహణ అధికారి తల్లం విజయ్ కుమార్ పాల్గొని ఈ అవార్డును స్వీకరించారు. ప్రపంచ ఆహార వ్యవస్థలో పర్యావరణ అనుకూల మార్పులకు దోహదపడుతున్న వినూత్న కార్యక్రమాలను గుర్తించి ఈ పురస్కారం అందజేసారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో దశాబ్దం క్రితం ప్రారంభమైన ప్రకృతి వ్యవసాయ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అతిపెద్ద వ్యవసాయ పర్యావరణ కార్యక్రమాలలో ఒకటిగా ఎదిగిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రకృతి సిద్ధాంతాలకు అనుగుణంగా వ్యవసాయ విధానాలను అమలు చేయడం ద్వారా వాతావరణ మార్పులు, పర్యావరణ సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని ఎపిసిఎన్ఎఫ్ నిరూపించిందని తెలిపారు.

# హెల్త్ టూరిజం హబ్‌గా ఎపి

• ఇంటి దగ్గరకే వైద్య సేవలు అందించేలా 'సంజీవని' • కార్పొరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణకు ప్రత్యేక సెల్ • లలితా పివిఎస్ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సిఎం చంద్రబాబు



**గుంటూరు, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** హెల్తీ సిటిజన్స్ వెల్తీ నేషన్ నిర్మించగలరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ సాధనలో ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చామని సిఎం తెలిపారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుంటూరులోని లలితా పివిఎస్ హాస్పిటల్‌ను ప్రారంభించి, పరిశీలించారు. 600 పడకలతో అత్యాధునిక టెక్నాలజీతో నిర్మించిన లలితా ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. మొత్తంగా 32 విభాగాలకు సంబంధించి ఒకేచోట వైద్య సేవలు అందించేలా ఆస్పత్రిని నిర్మించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లలితా ఆస్పత్రి ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన సేవలు అందాలని సీఎం ఆకాంక్షించారు. ఆస్పత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సహా పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ ఆరోగ్యానికి మించిన ఆస్తి ఉండదని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నవారే నిజమైన ధనవంతులని అన్నారు. వేల కోట్ల రూపాయలున్నా, భవంతులు ఉన్నా, ఆరోగ్యం లేకపోతే ఉపయోగం లేదని తెలిపారు. ప్రభుత్వం త్వరలో సంజీవని ప్రాజెక్టును రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనుందని ఇప్పటికే పైలెట్ ప్రాజెక్టును చిత్తూరు జిల్లాలో అమలు చేస్తున్నామని అన్నారు అత్యుత్తమ వైద్య విధానాలను ప్రజల ఇళ్ల దగ్గరకే అందుబాటులోకి తెచ్చేలా సంజీవని పని చేస్తుందని అన్నారు. ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానాన్ని అమలు చేస్తున్నామని.. 42 రకాల వైద్య పరీక్షలు ఇంటి దగ్గరే చేస్తామని తెలిపారు. త్వరలో యూనివర్సిల్ హెల్త్ పాలసీ తీసుకొస్తున్నామని.. ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల విలువైన వైద్యం ఉచితంగా అందిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందిస్తాం**

ప్రభుత్వం ఎన్ని వైద్య సేవలు అందించినా, ఆసుపత్రులు కట్టినా ప్రజలు సరైన ఆహార నియమాలు పాటించాలని, అప్పుడే అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావని సిఎం చంద్రబాబు తెలిపారు. ఫుడ్ మెడిసిన్, కిచెన్ ఫార్మసీ. మనం తినే ఆహారమే మనల్ని రక్షిస్తుందని అన్నారు. హైదరాబాద్‌లో మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు నాడు హెల్త్ టూరిజాన్ని ప్రమోట్ చేశామని ఏపీని అదేస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. బెస్ట్ హాస్పటల్స్ ను రాష్ట్రానికి రప్పిస్తున్నామని, టెక్నాలజీతో వైద్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. హైదరాబాద్ తరహాలో వివిధ ప్రాంతాలకు చెందిన వారు మెరుగైన చికిత్స కోసం అమరావతికి వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో యోగా శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలని అన్నారు. లలితా హాస్పటల్స్ ఇక్కడ ఆస్పత్రిని ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో కాకుండా అమరావతిలో ఆస్పత్రిని నెలకొల్పిన యజమాన్యాన్ని అభినందిస్తున్నానని అన్నారు. దశాబ్దాలుగా వైద్య రంగంలో లలితా గ్రూప్ ఉందని గుంటూరులో ఇలాంటి అత్యాధునిక ఆసుపత్రిని ప్రారంభించుకోవడం సంతోషకరమని అన్నారు. బ్రాండ్ ఎస్టాబ్లిష్ చేస్తే దానికి తిరుగుండదు అనడానికి లలితా ఆసుపత్రి ఒక నిదర్శనమని, ప్రజల్లో నమ్మకం, విశ్వసనీయత కలగాలి. అప్పుడే ఏ వ్యవస్థకైనా మనుగడ ఏర్పడుతుందని అన్నారు. ఏడు ఎకరాల్లో 600 పడకలతో లలితా ఆసుపత్రి ఏర్పాటైంది. 32 విభాగాలకు సేవలందించే ఏకైక సెంటర్. కార్డియాలజీ, న్యూరాలజీ, జాయింట్ రీప్లేస్మెంట్ వంటి సేవలను ఇక్కడ అందిస్తారు. ల్యాండ్ మార్క్ సంస్థగా లలితా ఆసుపత్రి మారుతుందని ముఖ్యమంత్రి అన్నారు.

**పేదల ఆరోగ్యం విషయంలో రాజీ లేదు**

లలిత హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ సేవా నిరతితో, మానవతాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. హృదయ సంబంధిత వ్యాధులతో ఏటా 32 శాతం మంది మరణిస్తున్న నేపథ్యంలో, ఆయా వ్యాధులను గుర్తించే ఖరీదైన ఆధునిక పరికరాలను లలిత హాస్పిటల్స్ లో ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో వినూత్న విధానాలతో పేద ప్రజల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నదని అన్నారు. దీర్ఘకాలిక వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల ఆహారపు అలవాట్లు మార్చేందుకు, ఒత్తిడి లేని ఆధునిక సమాజ నిర్మాణానికి కృషి చేస్తుందన్నారు. సంజీవిని పథకం ద్వారా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజలకు ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. రోజు రోజుకి క్యాన్సర్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా క్యాన్సర్ పరీక్షలను సైతం ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గుండెజబ్బులతో బాధపడే రోగులకు 45 వేల రూపాయలు ఖరీదు చేసే ఇంజక్షన్ ను ఇప్పటి వరకు దాదాపు ఐదు వేల మందికి పైగా ఉచితంగా అందించామన్నారు.

# ఇకపై 150ఎంఎల్, 200 ఎంఎల్ మద్యం సీసాలు



**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ తీసుకున్న సరికొత్త నిర్ణయం ఇప్పుడు మద్యం ప్రియుల మధ్య హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్రంలో ఇకపై సరికొత్త పరిమాణాల్లో 150ఎంఎల్, 200 ఎంఎల్ మద్యం సీసాలు కూడా మార్కెట్లోకి అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు ఉన్న నిబంధనల ప్రకారం కాకుండా, వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఈ కొత్త సైజుల్లో మద్యం సీసాలను తయారు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ పలు ప్రముఖ లిక్కర్ తయారీ కంపెనీలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. కంపెనీల అభ్యర్థనను సానుకూలంగా పరిశీలించిన ఎక్సైజ్ శాఖ, పాత నిబంధనలను సవరిస్తూ తాజాగా అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నూతన ఉత్తర్వులలో భాగంగా, కొత్త పరిమాణాల్లో వచ్చే మద్యం బాటిళ్లకు సంబంధించి ఒక కేసులో (బాక్స్) కచ్చితంగా ఎన్ని సీసాలు ఉండాలి అనే ప్యాకింగ్ నిబంధనలను కూడా ఎక్సైజ్ శాఖ స్పష్టంగా ఖరారు చేసింది. అయితే, కొత్త సైజుల్లో మద్యం వస్తున్నప్పటికీ ధరల విషయంలో ఎలాంటి అదనపు మార్పులు ఉండబోవని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్లో అమల్లో ఉన్న ధరల విధానమే ఈ కొత్త పరిమాణంలోని సీసాలకు కూడా వర్తించనుంది. కాగా, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 90 ఎంఎల్ 180 ఎంఎల్ 375 ఎంఎల్ 750ఎంఎల్ లీటర్ బాటిల్స్ విక్రయాలు సాగుతున్నాయి. వీటికి తోడుగా త్వరలోనే ఈ జాబితాలోకి 150 ఎంఎల్, ఎంఎల్ 200 ఎంఎల్ సీసాలు కూడా అధికారికంగా చేరనున్నాయి.

## సాగర్ కాలువల పనులకు రూ.42.19 కోట్లు

**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ప్రభుత్వం నాగార్జున సాగర్ కాలువల పరిధిలో 2026-27 సంవత్సరానికి చేపట్టనున్న 578 ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులకు రూ.42.19 కోట్లు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిధులతో సాగర్ కాలువల పరిధిలో కాలువల బలోపేతం, డీసిల్టింగ్, నీటి నియంత్రణ వ్యవస్థల మెరుగుదల, గేట్లు, షట్టర్ల మరమ్మతులు, బ్యాంకుల పటిష్టీకరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా సాగర్ కాలువల ద్వారా సాగునీటి సరఫరా మరింత సమర్థవంతంగా జరిగి రైతులకు ప్రయోజనం కలగనుంది.

## హాస్టళ్లను, గురుకులాలను సిద్ధం చేయండి

**రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశం**



**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** నూతన విద్యా సంవత్సరం ప్రచ్చే నెల 12 నుంచి పారంభం కానున్న నేపథ్యంలో బీసీ హాస్టళ్లను, గురుకులాల భవనాలను సిద్ధం చేయాలని, విద్యార్థుల సంఖ్య పెంచేలా అడ్మిషన్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆదేశించారు. బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదని స్పష్టంచేశారు. హాస్టళ్లు, తరగతి, విశ్రాంతి గదులను పరిశుభ్రం చేయాలని, పరిశుద్ధమైన నీరందించేలా చూడాలన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖాధికారులతో మంత్రి సవిత బుధవారం సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో అడ్మిషన్ల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆర్వో ప్లాంట్లు, కిటికీలు, ద్వారాలకు దోమ తెరల ఏర్పాటు గురించి ఆరా తీశారు. బీసీ బిడ్డలు విద్యకు దూరంగా కాకూడదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో విద్యతో పాటు ఆరోగ్య, ఆహార భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. సన్నబియ్యంతో భోజనం, తల్లికి వందనం, విద్యా మిత్ర కిట్లు అందజేయడంతో పాటు సకాలంలో డైట్, కాస్మోటిక్ ఛార్జీల చెల్లింపు, పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీటి కల్పనకు ప్రాధాన్యమివ్వడం వల్ల గతంలో ఎన్నడూ లేనంతగా టెన్త్, ఇంటర్ లో బీసీ హాస్టళ్లు, గురుకులాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే బోధనపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని దిశా నిర్దేశం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. బీసీ హాస్టళ్లలోనూ అడ్మిషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా బీసీ బిడ్డలెవరూ బడి బయట ఉండకూడదన్నారు. ఈ నెల అయిదో తేదీన గురుకుల పాఠశాల ప్రిన్సిపాళ్లు, హాస్టళ్ల వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూవోలు, డీబీసీడబ్ల్యూవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. ఆ కాన్ఫరెన్స్ లో హాస్టళ్లు, గురుకులాల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని మంత్రి సవిత సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి మాధవీలత ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## సూర్యప్రభపై సారంగపాణిగా కల్యాణ వేంకటేశ్వరుడు

**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి జిల్లా నారాయణవనంలో పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం ఉదయం స్వామి సారంగపాణి అలంకారంలో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దివ్య దర్శనమిచ్చి అనుగ్రహించారు. సూర్యకిరణాల తేజస్సును తలపించే ఈ వాహనసేవలో స్వామివారి అపూర్వ రాజసం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. కర్పూరహారతులతో మార్మోగిన నారాయణవనం స్వామివారి విహార మార్గమంతా భక్తులు కర్పూర హారతులు సమర్పిస్తూ గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలను మార్మోగించారు. భక్తజన బృందాల కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాలు ఉత్సవాలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు స్వామివారు చంద్రప్రభ వాహనంపై విహరించి భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్‌రాయులు, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## త్వరలో తిరుమలకు మరిన్ని ఇవి బస్సులు



**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమలను పూర్తిస్థాయిలో పర్యావరణ హితంగా మార్చేందుకు, కాలుష్యనియంత్రణలో భాగంగా విద్యుత్‌తో నడిచే బస్సులను తీసుకువచ్చేందుకు ఆర్టీసి అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే ప్రభుత్వం కూడా తిరుమల ఘాట్‌లో పూర్తిగా విద్యుత్ బస్సులనే నడపాలని కూడా సూచించింది. ప్రస్తుతం 50 విద్యుత్ బస్సులు తిరుమల- తిరుపతి, తిరుపతి- తిరుమల మధ్య నడుస్తున్నాయి. ఈ బస్సుల వల్ల నిర్వహణ వ్యయం కూడా బాగా తగ్గడమేగాక ఘాట్‌లో పూర్తిగా కాలుష్యరహితంగా దోహదపడుతోంది. ఇప్పుడు త్వరలోనే ప్రధానమంత్రి ఇ బస్ సేవ పథకం క్రింద రాష్ట్రానికి విద్యుత్ బస్సులు రానున్నాయి. జులైలో అందుబాటులోకి సరికొత్త పర్యావరణ అనుకూల బస్సులు రాబోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఈబస్ సేవ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 750 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరయ్యాయి. వీటిలో తొలి విడతగా 300 బస్సులు ఈ ఏడాది జులై నెలలోనే రోడ్డెక్కడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో మరో 50 బస్సులు తిరుమలకు రానున్నాయనేది సమాచారం. దీనివల్ల పూర్తిగా ఘాట్‌లో పెట్రోల్, డీజిల్‌తో నడిచే వాహనాలకు చాలావరకు నియంత్రించవచ్చునేది టిటిడి, రవాణా, ఆర్టీసి, పోలీస్ వర్గాలు ఆలోచన. పర్యావరణ హిత ఎలక్ట్రిక్ బస్సులు రానున్న బ్రహ్మోత్సవాలకు ప్రయాణికులకు అందుబాటులోకి రానున్నాయి. తిరుమల ఘాట్ రోడ్డులో కాలుష్యాన్ని తగ్గించేందుకు ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సుల స్థానంలో 300 ప్రత్యేక ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించారు. దీనికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ వేగంగా జరుగుతోందనేది ఆర్టీసి వర్గాల సమాచారం.

# లడ్డూల విక్రయాలు మేలో రికార్డు

• రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూల తయారీ



**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనం తరువాత భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వీకరించే లడ్డూ ప్రసాదం విక్రయాలు ఈ ఏడాది మే నెలలో రికార్డు స్థాయికి చేరుకున్నాయి. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో టిటిడి లడ్డూ ఉత్పత్తిని కూడా విస్తృతంగా పెంచి, ఎలాంటి కొరత లేకుండా ప్రసాదాలను అందిస్తోంది. ఈ ఏడాది మే నెలలో మొత్తం 1,21,35,528 లడ్డూలు విక్రయాలు జరిగాయి. గత రెండేళ్లతో పోలిస్తే ఈ ఏడాది లడ్డూల విక్రయాలు గణనీయంగా పెరిగాయి. 2024 మే నెలలో 1.01 కోట్ల లడ్డూలు విక్రయమవ్వగా, 2025లో 1.10 కోట్లకు పెరిగాయి. ప్రస్తుతం 2026లో 1.21 కోట్లకు పైగా విక్రయాలు నమోదవడం విశేషం. శ్రీవారి ప్రసాదాల తయారీలో నాణ్యతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్న టిటిడి రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలను తయారు చేస్తోంది. సాధారణ రోజుల్లో 4 లక్షల నుండి 4.5 లక్షల వరకు లడ్డూలు తయారవుతుండగా, ప్రత్యేక సందర్భాల్లో ఉత్పత్తిని మరింత పెంచుతోంది.

**24 గంటలూ నిరంతరాయంగా సేవలు:** శ్రీవారి పోటులో రెండు షిఫ్టుల్లో సుమారు 700 మంది శ్రీవైష్ణవ బ్రాహ్మణులు భక్తి శ్రద్ధలతో 24 గంటలూ సేవలందిస్తూ లడ్డూ ప్రసాదాల తయారీలో పాల్గొంటున్నారు. తిరుమలలోని లడ్డూ కాంప్లెక్స్‌లో 56 కౌంటర్ల ద్వారా మూడు షిఫ్టుల్లో 24 గంటలూ లడ్డూల విక్రయం, పంపిణీ జరుగుతోంది. అదనపు లడ్డూల కొనుగోలు కోసం డిజిటల్ చెల్లింపులతో పనిచేసే కియోస్క్ యంత్రాలను కూడా ఏర్పాటు చేశారు. దర్శనం పొందిన ప్రతి భక్తునికి ఒక లడ్డూను ఉచితంగా అందజేస్తున్నారు. ఇటీవలి కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచి మరింత మెరుగుపడటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# క్యూకాంప్లెక్స్‌లో బాత్‌రూమ్‌ల కంపు




**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** "కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందట" అనే చందంగా తిరుమల క్షేత్రంలో పారిశుద్ధ్యం నిర్వహణ రోజురోజుకూ అధ్వాన్నంగా తయారవుతోందని భక్తులు ఆవేదన వెలిబుస్తున్నారు. కొండపై పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని, రెట్టింపుగా పరిశుభ్రత చేస్తున్నామని ఓ వైపు ప్రకటనలు గుప్పిస్తున్న టిటిడి అధికారులు నిర్వహణలో అందుకు భిన్నంగా అధ్వాన్నంగా మారినా పర్యవేక్షణ లేకపోవడంతో మరింత దిగజారిందని చెబుతున్నారు. తిరుమల అంతటా కేవలం రోడ్లపై చెత్తలేకుండా ఊడ్చటం వరకే పరిమితమైన కార్మికులు తిరుమలలోని ప్రధాన ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్వహణ, వాష్‌రూమ్‌ల తీరు కంపుకొడుతోందని భక్తులు వాపోతున్నారు.

పరిశుభ్రతలో కొన్ని ఏజెన్సీల కార్మికులు ఏదో మొక్కుబడిగా శుభ్రం చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దీనికి తార్కాణంగా బుధవారం వేకువజామున చిత్తూరుకు చెందిన కొందరు భక్తులు ఆన్‌లైన్ లక్కీడిప్‌లో సుప్రభాతసేవ టిక్కెట్ రావడంతో దర్శనానికి వెళ్లారు. సుమారు 2గంటల ప్రాంతంలో వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లో వెళ్ళిన తరువాత మూత్రవిసర్జనకు వెళ్లారు. అక్కడ వాష్‌రూమ్‌లు కంపుకొడుతూ అధ్వాన్నంగా ఉన్నాయని తెలిపారు. తిరుమలలో తెల్లవారుజామున 1.30 గంటల నుండి పలు రకాల సేవా దర్శనాలకు భక్తులను వైకుంఠమ్ 1 క్యూకాంప్లెక్స్‌లో అనుమతిస్తారు. అయితే అప్పటికే బాత్‌రూమ్‌లు దుర్వాసనతోబాటు అపరిశుభ్రంగా ఉండటంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆలయం వెలుపల మీడియాకు తెలిపారు. వైకుంఠమ్ 1, 2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లలోని కంపార్టుమెంట్లలో వాష్‌రూమ్‌లు, మరుగుదొడ్ల అధ్వాన్నంగా నిర్వహణ మారిందనడానికి ఇదో నిదర్శనం. ఇక తిరుమలలో చాలావరకు పిఎసిలు, పలు చోట్ల మరుగుదోడ్లు, వాష్‌రూమ్‌ల నిర్వహణ కూడా అధ్వాన్నంగా మారింది.

ఈ పరిశుభ్రతపై పర్యవేక్షణ కొరవడటంతో కార్మికులు ఏదో మొక్కుబడిగా విధులు నిర్వహించి వెళ్ళిపోతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. రోజువారీగా 80వేల మంది వరకు భక్తులకు దర్శనం చేయిస్తున్నారు. వేకువజామున 1.30గంటల నుండి ఉదయం విఐపి బ్రేక్ దర్శనాల భక్తులు వైకుంఠమ్ 1క్యూకాంప్లెక్స్ నుండే ఆలయంలోనికి వెళ్ళడం పరిపాటి. అలాంటిది పారిశుద్ధ్యం అధ్వాన్నంగా తయారైనా పట్టించుకునే వారేలేకపోవడం మాత్రం విచారకరం. చెత్తతొలగింపే గాక ప్రధానంగా వాష్‌రూమ్‌లు, మరుగుదొడ్ల నిర్వహణ అద్వాన్నంగా మారిందని ఇప్పటికే భక్తుల నుండి కూడా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. తిరుమల తిరుపతి దేవస్థానమ్ అధికారులు పారిశుద్ధ్యం నిర్వహణలో ఆచరణలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సాధారణ రోజుల్లోనే గాక వారాంతం, ప్రత్యేక పర్వదినాలు వంటి రద్దీరోజుల్లో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలోనికి చేరుకున్న భక్తుల సౌకర్యాలు, కష్టాలు వినేనాధుడే లేకపోవడం మరీ విశేషం.

ఎంతమంది విఐపిలు వచ్చారు, వారందరికీ ఏమేరకు సంతోషకరంగా దర్శనాలు చేయించామని భావిస్తున్న అధికారులు కనీస సౌకర్యాలపై పర్యవేక్షణ లేకపోవడం ఇందుకు ప్రధాన వైఫల్యమేనని భక్తులు వాపోతున్నారు. ఏదేని సమస్యలున్నా చెబుదామనుకుంటే పట్టించుకునే వారే దొరకరు. ఇదీ గత కొంతకాలంగా తిరుమలలో సామాన్య భక్తులు ఎదుర్కొంటున్న వెంకన్న దర్శన కష్టాలు. పైకి మాత్రం అధికారులు అంతా బాగానే ఉందని ప్రకటనలు చేస్తున్నా ప్రత్యక్షంగా భక్తులు పడుతున్న ఇబ్బందులు మాత్రం వర్ణనాతీతంగా మారాయి. తిరుమలలో వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62 కంపార్టుమెంట్లు ఉన్నాయి. ఒక్కో కంపార్టుమెంట్ సామర్థ్యం 400మంది భక్తులు నిరీక్షిస్తుంటారు. సరాసరి రోజుకు సాధారణ రోజుల్లో 80వేల మంది నుండి 90వేల మంది వరకు భక్తులకు స్వామివారి దర్శనం చేయిస్తున్నారు. ఇంతమంది భక్తులు గంటల తరబడి నిరీక్షించే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లలో పరిస్థితి అధ్వాన్నంగా మారడం అధికారుల పనితీరును వెక్కిరిస్తోంది. గంటల తరబడి వేచిఉండే భక్తులను కలసి సమస్యలు తెలుసుకునేందుకు వీలుగా సీనియర్ అధికారులతో కమిటీ ఉన్నా విఐపిల సేవలో తరించడానికి సరిపోతోంది.

## అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహించాం



**సచివాలయం, జూన్ 3 ప్రభాతవార్త:** డిఎస్సీ 2025ను ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా నిర్వహించిందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం కనీసం ఒక్క డిఎస్సీని కూడా నిర్వహించ లేకపోయిందని ఎన్నికలకు 60రోజుల ముందు డిఎస్సీ నోటిఫికేషన్ కేవలం 6100పోస్టులతో వేశారని ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో మెగా డిఎస్సీ నిర్వహించాలని తెలిపారు. 8సంవత్సరలా నిరీక్షణ అనంతరం కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తే ఇప్పుడు దాదాపు 8, 9నెలల తర్వాత రాద్దాంతం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి ఎన్నో డిఎస్సీలు సమర్థవంతంగా నిర్వహించారని ఆయా డిఎస్సీల ద్వారా ఇప్పటివరకు దాదాపు 2లక్షల మంది ఉపాధ్యాయులుగా సేవలు అందిస్తున్నారని హోంమంత్రి గుర్తుచేశారు. వాస్తవంగా రాష్ట్రంలో సుమారు 3.11లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉంటే వారిలో 60శాతం మంది ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి చంద్రబాబు హాయాంలోనే ఉద్యోగాలు సాధించారన్నది తేటతెల్లం అవుతుందన్నారు. అంతెందుకు తాను సైతం 2001లో డిఎస్సీ ద్వారానే ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించానని 12 సంవత్సరాల సర్వీసు తర్వాత రాజీనామా చేసి రాజకీయాల్లోకి రావడం జరిగిందన్నారు. అందుకనే నా అనుభవంతో చెబుతున్నాను డిఎస్సీ నోటిఫికేషన్, ఎంపిక ప్రక్రియ, పోస్టింగ్స్ ఎలా జరుగుతాయో నాకు తెలుసని స్పష్టం చేశారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా నిష్పక్షపాతంగా పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ నిర్వహించిందని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు.

వార్త

దుఃఖం అనేది శిక్ష కాదు, సంతోషం అనేది వరమూ కాదు. రెండూ ఫలితాలే. అవి మన చర్యలననుసరించి మాత్రమే.

- ఆర్.జి ఇంగర్సాల్

# శాంతికి మార్గమేది?

నా కోడి కుంపటి లేకుంటే తెల్లవారదులే అనుకుంటుండేది వెనుకటికో ఓ ముసలవ్వ. ఇప్పుడు శ్వేతాధినేత ట్రంప్ కూడా అదే ధోరణిలో మాట్లాడుతున్నాడు. ఇజ్రాయెల్ మిత్రత్వ కారణంగా ఇరాన్‌తో పోరుకు తలబడిన ఆయన ఇప్పుడు తలగోక్కుంటున్నాడు. ఇజ్రాయెల్ ప్రధాని నెతనాహ్యును వదిలిపెట్టనూ లేడు,తాజా యుద్ధం మీద ఎలాంటి నిర్ణయం తేల్చనూ లేడు. అలా అని సమర్థించే పరిస్థితీ లేదూ. అయినా ఊబిలో పడ్డ దున్న మాదిరి పెనుగులాడుతున్నాడు. పరిస్థితుల్లో ట్రంప్ మరింత వాచాలత ప్రదర్శిస్తున్నారు. జరిగిందేదో జరిగిపోయిందిలే అని ఊరుకునే మనస్తత్వంలోనూ లేడాయన. ఇరాన్‌తో సంధి చేసుకుంటే తనకు అవమానమని భావిస్తూ ఎప్పటికప్పుడు వగచడం తప్ప ఏం చేయలేని పరిస్థితిఆయనది.. నిర్యుద్ధ ప్రకటన జరిగే చర్చలను ముందుకు సాగకుండా ఉండటంతో ట్రంప్‌కు నెతన్యాహు నుంచి ఒత్తిడిలుండటమేనని ఇరాన్ భావన. అందుకే ఇక చర్చల్లేవ్! చర్చించు కోటాల్లేవ్! అనే మాటలు యధాలాపంగా వినపడుతున్నాయి. ఇరాన్ ఎప్పుడూ ఒక మాట మీదనే ఉంది. కానీ ట్రంప్ మాత్రమే జరుగుతున్న భీకర యుద్ధానికి, కాల్పుల విరమణ అమలులో ఉన్నట్లేనని రెండు విరుద్ధ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మధ్యలో ఏ విషయమూ తెలనివ్వడం లేదు. ఎవరిది చిత్తచాంచల్యమో, భ్రాంతో ఇప్పుడిప్పుడే తేల్చలేని పరిస్థితి ఉంది. ఒకపక్క తీవ్ర స్థాయిలో శతఘ్నులు పేలుతున్నా ఇంకా కాల్పుల విరమణ అమల్లోనే ఉందంటూ సర్దుబాటు సమర్థింపులు జరుగుతున్నాయి. అణు కార్యక్రమం, హార్మూజ్ జలసంధి వంటి అంశాలపై ఎడతెగని చర్చలు జరుగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. మరోపక్క ఇజ్రాయెల్ లెబనాన్‌పై చేస్తున్న భారీ దాడుల విషయంలో ట్రంప్ ప్రతిపాదనలేమీ ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు వినడం లేదు. వారిద్దరి మధ్య కొంత 'మిత్రబేధం' ఏర్పడిందా! అని అనిపిస్తోంది. ఇజ్రాయెల్ మంకుపట్టు వీడకపోవడంతో అమెరికా ఆగ్రహం చెందింది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో చర్చించిన అంశాలన్నిటినీ బహిర్గతం చేయడంలో కూడా అమెరికా అత్యుత్సాహం చూపిస్తోంది. అవి కూడా నిర్దిష్టంగా లేవు. రష్యా చమురును కొనుగోలు చేస్తూ వచ్చిన భారత్‌పై ఆంక్షలు పెట్టిన అమెరికా ఇప్పుడు స్వరం మార్చింది. రష్యా చమురు ప్రపంచ దేశాలకు అందుబాటులోకి వస్తేనే పశ్చిమాసియా చమురు సంక్షోభానికి కొంతైనా పరిష్కారం చూపినవారమవుతామని ఇటీవల భారత్‌లో పర్యటించి వెళ్లిన అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మార్కో రుబియో వ్యాఖ్యానిస్తున్నారు. ఇవన్నీ గమనిస్తున్న ఇరాన్ ఎలాంటి పరిస్థితుల్లోనూ అమెరికా, ఇజ్రాయెల్‌తో చర్చలే ఉండవన్న రీతిలో అమెరికాను హెచ్చరిస్తోంది. అసలు యుద్ధం జరుగుతోందా, కాల్పుల విరమణ ఉన్నట్లా? లేదా! యుద్ధం మిధ్యేనా ఇలాంటి సంగతులన్నీ ఆయా దేశ ప్రజల ఊహాగానాల్లోని అంశాలుగా ఉండిపోయాయి. లెబనాన్‌లోని హిజ్‌బొల్లా లక్ష్యాలపై దాడులు కొనసాగిస్తున్న ఇజ్రాయెల్ బీరుట్ మీద కూడా దాడులకు తెగబడటం ఇరాన్ వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలోనే కాల్పుల విరమణ ఒప్పందంపై ఇరాన్ పాకిస్థాన్‌తో చర్చలు మానేసింది. ఈ అంశాలను ఇరాన్ వార్తా సంస్థలు ధృవీకరించాయి. అమెరికాతో కాల్పుల విరమణ అంశంలో లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగు తున్న పోరుకు ఏ మాత్రం సంబంధం లేదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. ఎటువంటి రాజీ అయినా ఇజ్రాయెల్‌తో సంబంధమున్న అంశాలకూ వర్తిస్తుందని, ఇజ్రాయెల్ దాడులు కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనేనని ఇరాన్ మండిపడుతోంది. లెబనాన్ దక్షిణ ప్రాంతంపై ఇజ్రాయెల్ జరిపిన దాడులో 8 మంది చనిపోయారు. ఇరాన్,అమెరికాల మధ్య చర్చలతో తమ ప్రమేయమేమీ లేదన్నట్లు వ్యవహరిస్తున్న ఇజ్రాయెల్ తన యుద్ధతంత్రాన్ని ఆపే పరిస్థితిలో లేదు. ఇదే సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కి ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు మీద చిర్రెత్తుకొచ్చి మాట్లాడారు. తాను లేకుంటే నెతన్యాహు జైల్లో ఉండేవాడవని అన్యాపదేశంగా ట్రంప్ అనేసారు. ఏదీ తెగదు, నెతాన్యాహ్యు తెగనివ్వడు అనే ధోరణిలో మాట్లాడారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్‌కలిసి రావడం లేదంటూ ట్రంప్ అభ్యంతరకర భాషలో నేరుగా ఫోన్‌లోనే విరుచుకుపడ్డారు. నిజానికి అమెరికా ఇరాన్‌ల మధ్య శాంతి ఒప్పందమేమీ కుదరలేదు. వారిద్దరి మధ్య చర్చలంటే ఒకరు వేలికేస్తే మరొకరు కాలికేస్తారు. అలాగే కాలికేసేది ఒకరైతే వేలికేసేది మరొకరు. అంతే తప్ప చర్చలు సజావుగా సాగనివ్వరు. ఒప్పందాన్ని ఓ కొలిక్కి రానీయరు. అన్న చందంగా సాగుతోంది. వీళ్ల చర్చలు స్థిరమైన శాంతి ఒప్పందానికి భరోసా ఇవ్వలేకపోతున్నాయి. మధ్యలో ఇజ్రాయిల్ చీకాకులు కొన్ని. వీటన్నిటితో ట్రంప్ సతమత మవుతున్నట్లు కనపడుతోంది. పరస్పర అవిశ్వాసం, చర్చల పురోగతి ప్రధాన అడ్డంకిగా మారింది. ఒకవైపు దౌత్యం, మరోవైపు సైనిక చర్చలు, ఒప్పందాల ఉల్లంఘనలతో చర్చలకు మార్గం సుగమమయ్యే పరిస్థితి కనపడుట లేదు. పరిస్థితులను సంక్లిష్టం చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధ మంటే ప్రపంచ దేశాలన్నిటినీ చమురు సంక్షోభంలో ముంచిన ఓ సైనిక ప్రక్రియలాగే కనపడుతోంది. యుద్ధం ముగిసినా ప్రపంచ జనాభా నెత్తిన ధరల పిడుగు ప్రభా వం నుంచి తప్పించలేరు. బిడ్డ చచ్చినా పురిటికంపు పోదన్న రీతిలో జనం యావత్తూ ఆర్థిక సమస్యలతో మునిగిపోయారన్నది జగద్విదితం. ఒకవేళ దీర్ఘకాలిక శాంతి ఒప్పందం కుదిరినా అంతర్జాతీయ చమురు మార్కెట్లు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రభావం నుంచి ఏ దేశమూ తప్పించుకోలేదు. అమెరికా ఆది నుంచీ చెప్పున్నట్లు ఈ యుద్ధం ఇరాన్ 'అణు కార్యక్రమం ఆపాలనే' అని అయితే ఈ పాటికే 'శాంతి రేఖలు' విలసిల్లేవి.

ప్రవర్తన అనేది తెల్లకాగితం లాంటిది. ఒక్కసారి దాని మీద మరక పడితే, మళ్లీ తెలుపు కావడం కష్టం.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.



కోల్టన్

## ప్రజావాక్కు



### రీల్స్‌కు బానిస కావొద్దు

నేడు చిన్నాపెద్దా అనేతేడా లేకుండా చాలామంది రీల్స్‌కు బానిసలుగా మారుతున్నారు. చేతిలో ఫోన్ ఉంటే చాలు, గంటల తరబడి రీల్స్ చూస్తూ కాలం గడిపేస్తున్నారు. కొద్దిసేపు చూడాలని ప్రారంభించిన రీల్స్ గంటల తరబడి సమయాన్ని వృథా చేస్తాయి. దీనివల్ల చదువు, పని, కుటుంబానికి కేటాయించాల్సి న సమయం తగ్గిపోతుంది. అంతేకాకుండా ఏకాగ్రత తగ్గి, సృజనాత్మక ఆలోచనలు కూడా మందగిస్తాయి. సమయం అమూల్యమైనది. కాలాన్ని వృథా చేసే రీల్స్ కంటే, భవిష్యత్తును నిర్మించే పనులకు ప్రాధాన్యం ఇవ్వడం మంచిది. రీల్స్‌కు బానిస కాకండి, మీ లక్ష్యాలకు మాత్రమే బానిసలుగా మారండి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### ఆర్థిక వ్యవస్థకు పునాది

పర్యాటక రంగంకేవలం వినోదసాధనం మాత్రమే కాదు, అది ఆర్థికవ్యవస్థకు ఊపిరిపోసే శక్తివంతమైన యంత్రం. భారతదేశం పర్వతాలు,అరణ్యాలు, తీరప్రాంతాలు, చారిత్రక కట్టడాల వంటి అపారమైన వైవిధ్యాన్ని కలిగి ఉన్నప్పటికీ,మౌలిక సదుపాయాల లోపం, కనెక్టివిటీ సమస్యలవల్ల పర్యాటక రంగం తన పూర్తిసామర్థ్యాన్ని అందుకోలేకపోతోంది. కేవలం హోటళ్లు నిర్మించడమే కాకుండా, మెరుగైన రవాణా, పారిశుద్ధం,భద్రత డిజిటల్ మార్కెటింగ్ సదుపాయాలను కల్పించినప్పుడే అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించగలం. ముఖ్యంగా పర్యావరణ సున్నిత ప్రాంతాల్లో స్థిరమైన టూరిజం నమూనాలను అనుసరించడం అనివార్యం. అభివృద్ధి పేరుతో ప్రకృతిని దెబ్బతీస్తే అది దీర్ఘకాలిక నష్టానికి దారితీస్తుంది.

- కె.రామారావు, నల్గొండజిల్లా

### గ్రామీణ రోడ్లను బాగు చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లోరోడ్లు ప్రమాదకరంగా మారాయి. చాలా గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారి, కంకరతేలి ప్రమాదాలు జరిగే విధంగా తయారయ్యాయి. అదే విధంగా రోడ్ల వెంట కంపచెట్లు పెరిగి వాహనదారులు గాయపడేవిధంగా ఉంటున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు ప్రమాదకరంగా దెబ్బతిన్నరోడ్లను పరిశీలించి తాత్కాలిక మరమ్మత్తులు చేప ట్టాలి. కనీసం గుంతలలో మట్టినైనా నింపి వాహన దారులు ప్రమాదాలకు గురికాకుండా తగుచర్యలు తీసుకోవాలి. గ్రామాల్లోనే కాకుండా నగరాల్లో కూడా రోడ్లను బాగు చేయాలి.

-టి. యోగేందర్, నల్గొండ

### పెరుగుతున్న డిజిటల్ మోసాలు

డిజిటల్ యుగంలోసాంకేతికత జీవితం సులభతరం చేస్తున్న కొద్దీ, అదే సాంకేతికతను ఆయుధంగా మలచుకుని మోసాలకు పాల్పడేశక్తులు కూడా పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతున్న సైబర్ నేరాలలో కృత్రిమ మేధ ఆధారిత నకిలీ రూపకల్పన మోసాలు ముఖ్యమైనవి. మనిషి ముఖం,స్వరం, మాటతీరు, భావప్రకటనలను అసలైనట్లే అనుకరించి నకిలీ దృశ్యాలు, ధ్వనులు సృష్టించడం ఇప్పుడు నేరగాళ్లకు సులభమైంది. వినోదం, పరిశోధన కోసం ఉపయోగించాల్సి న ఈ సాంకేతికత, ప్రజల నమ్మకాన్ని దోచుకునే సాధనంగా మారడం ఆందోళనకరం. మాట్లాడని మాటలను మాట్లాడినట్లుగా, చేయని పనులను చేసినట్లుగా చూపించే నకిలీ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖులు, నాయకులు, ఉన్నతాధికారుల స్వరాలను అనుకరించి అత్యవసర పరిస్థితి పేరిట డబ్బులు కోరడం వంటి మోసాలు సాధారణమవుతున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పేదలకు వరం

నేడు ఉరుకుల పరుగులజీవితంలో ఉదయం నుండి సాయంత్రం వరకు కుటుంబ భవిష్యత్ జీవితం దృష్ట్యా సరిగ్గా ఆహారం తీసుకోకుండా, ఉద్యోగానికి ఆలస్యం అవుతుందనే కారణాలతోగడిపే ఉద్యోగులకు చిరువ్యాపారులకు ఇందిరమ్మ క్యాంటీన్, అన్నపూర్ణ సెంటర్స్ సదరు పేదవాడి ఆకలి తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇవి నగరంలోనే కాకుండా గ్రామాలకు వ్యాప్తి చెందితే ప్రజలకు మరింత మేలు చేసినవాళ్లవుతారు.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### బిసిల అభ్యున్నతికి కృషి చేయాలి

బిసి కుటుంబాలు చాలా వరకు దిగువ స్థాయి ఆదాయంలోనే ఉంటారు. వృత్తులు బాగా పడిపోయిన తర్వాత కుటుంబ ఆదాయం బాగా తగ్గినది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు కొన్ని పథకాలు పెడుతున్న కూడా బిసిలు నిరుద్యోగులుగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏ మాత్రం రిజర్వేషన్ ఇచ్చినాఅది సమంజసమే. పోటీ పరీక్షల ఎంపికలో వీరికి పరీక్ష ఫీజురాయితీ, హాజరు అయ్యేందుకు ఉచిత ట్రైన్ రిజర్వేషన్ ఇవ్వడం న్యాయమైన కోరిక. ప్రస్తుతం ప్రభుత్వం నడుపుతున్న కోచింగ్ కేంద్రాలలో కూడా నామమాత్రపు ఫీజు ఉంటే ఎంతో మంది పోటీలో తప్పక నెగ్గుతారు.

- బి.మేఘనాదం, విశాఖపట్నం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బాల్యానికి స్వేచ్ఛతోనే చదువులకు పండుగ!

*ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పిం చేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికిసంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.*



రామ కిష్టయ్య సంగన భట్ల

ఇష్టం లేని పనిని వివిధ కారణాల వల్ల బలవంతంగా చేయిస్తూ శ్రమ దోపిడీకి గురి చేయడమే బానిసత్వం. పిల్లలతో బలవంతంగా పని చేయించుకోవడం, బలవంతపు పెళ్ళిళ్లు, ఇళ్ళల్లో వెట్టిచాకిరి, వ్యవసాయ కూలీలు, పిల్లలను అమ్మడం, ఇటుక బట్టీలు, బలవంతపు పడుపు వృత్తి, పిల్లల అక్రమ రవాణా లాంటి వివిధ రూపాలలో బానిసత్వం కనిపిస్తున్నది. భయపెట్టీ, హింసించి, మోసగించి, బెదరించి, వివిధ రకాలుగా శ్రమ దోపిడీ జరగడం అనునిత్యం జరుగుతున్నదే. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి జరిగితే తప్ప పరిష్కారం లేదని విజ్ఞుల భావన. ప్రభుత్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విధి లేక బాలకార్మికులుగానే ఉండిపోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారమయం చేసుకుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడిపడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించుకుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజమానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంక్షేమంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగంలోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరిపోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం.



కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించుకునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించకపోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించుకోవడం అపరాధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించరాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియమించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది. 1959 నవంబర్ 20న బాలల హక్కుల ప్రకటనను ఐరాస సర్వసభ్య సభ రూపొందించిన సందర్భంగా బాలల దినోత్సవాన్ని ప్రపంచ మంతటా జరుపుకోవాలని నిర్ణయించారు. 1989లో పిల్లల హక్కులపై నవంబర్ 14న ఓ బిల్లును ఐరాస ఆమోదించింది. ఈ బిల్లును ఆమోదిస్తూ 191 దేశాలు సంతకాలు పెట్టాయి కూడా. బాలల హక్కుల సంబంధిత కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలిపోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య నేటికీ ఫలించని కలగానే మిగిలిపోతున్నది. ప్రపంచ బాలకార్మికుల్లో మూడవ వంతు మంది మన దేశంలోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాలలోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదుకాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడిబయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆతర్వాత ఏటా ఆ కార్యక్రమాన్ని అమలు చేస్తూనే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాలకార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథమిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి. బాలకార్మికులకు వసతి సైతం కల్పిం చేలా ప్రత్యేక పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికిసంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాదనపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి. ●

# ఎల్‌నినో పట్ల రైతులకు అవగాహన అవసరం!

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

తరతరాలుగా, భారత వ్యవసాయం రుతుపవనాలపై ఆధారపడి కొనసాగుతున్నది. వర్షాలు సకాలంలో కురిసి, రుతుపవనాలు సమానంగా విస్తరించినపుడు మాత్రమే పంటలు బాగా పండుతాయి. పర్యావరణ భూగోళంపై ఈ ఏడాది అతి బలమైన ఎల్‌నినో ఏర్పడవచ్చనే చేదు విషయాన్ని నివేదిక బహిర్గతం చేసింది. పసిఫిక్ మహా సముద్రంలో జలాలు సాధారణం కన్నా అధికంగా వేడెక్కడాన్ని 'ఎల్‌నినో' అని అంటారు. సాధారణం కన్న 2.5 డిగ్రీల ఎక్కువగా సముద్ర నీటి ఉష్ణోగ్రతలు పెరగడాన్ని సూపర్ ఎల్‌నినో అని పిలుస్తున్నారు. ఎల్‌నినో వల్ల జూన్ 2026 నుంచి వాతావరణ ప్రతికూల మార్పులు జరగవచ్చుని, ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి అసాధారణ రుతుపవనాల గమనం జరుగుతుందని నివేదిక రూపంలో స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో గాలుల దిశ మారిపోయి ప్రతికూల వాతావరణ మార్పులకు ఆజ్యం పోయవచ్చని అంచనా వేశారు. మే మాసంలో ఏర్పడే ఎల్‌నినో ఆగష్టు నాటికి బలపడి సూపర్ ఎల్‌నినో ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో ప్రతికూల మార్పులు, సముద్ర తుఫాన్లు, కరవు కాటకాలు లాంటి దుష్ప్రభావాలు జరుగుతాయని గమనించాలి. ఎల్‌నినో ప్రభావం వల్లవర్షాభావం, సకాలంలో వర్షాలు పడకపోవడం, సుదీర్ఘ పొడిగాలులు వీయడం, వరి,పత్తి, వేరుశనగ లాంటి వర్షాధార పంటల దిగుబడులు భారీగా పడిపోవడం, తెగుళ్ల బెడద (రసం పీల్చే పేనుబంక, తెల్లదోమ, బూడిద తెగులు) పెరగడం, నీటి కొరత వల్ల చెరువులు,బావులు, చిత్తడి నేలలు ఎండిపోవడం లాంటి దుష్ప్రభావాలు జరిగే అవకాశం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఎల్‌నినో ప్రభావానికితట్టుకునే



విధంగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తక్కువ నీటితో పండే గోరుచిక్కుడు, మినుములు, కందులు, చిరుధాన్యాలు లాంటి పంటలను ఎంచుకోవాలి. నేలలో తేమను సంరక్షించుకోవడానికి ఆకులతో కప్పడం(మల్చింగ్) లాంటి విధానం పాటించాలి. నేల సారానికి అనుగుణంగా ఎరువులు, సేంద్రియ పదార్థాలు వాడడం మంచిది. సస్య రక్షణలో భాగంగా తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలతో సకాలంలో పురుగుమందులు పిచికారీ చేయాలి. సూక్ష్మసేద్యం ద్వారా ఉద్యాన రైతులకు కొంత మేర ఉపశమనం లభించవచ్చు. ఎల్‌నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం, యుద్ధాలతో యూరియా లాంటి ఎరువుల కొరత ఏర్పడనుందని గమనించాలి. రానున్నరోజుల్లో ఎల్‌నినో ప్రభావం పట్ల అవగామన పెంచుకొని రైతులు తగు పంటలపై దృష్టిని కేంద్రీకరించాలి. పంటల అవశేషాలను కాల్చడంతో భూసారం దెబ్బతినడం, దిగుబడులు తగ్గడం, ఎరువులు వేసినా తగిన ప్రయోజనం లభించకపోవడం లాంటి తీవ్ర దుష్ప్రభావాలు కలుగుతాయని తెలుసుకోవాలి. ఇప్పటికే సూరన్న సుర్రుమంటున్నాడు. అకాల వర్షాలు అన్నదాత రోదనలకు ఆజ్యం పోస్తున్నాయి. చేతికి వచ్చిన పంట నేలపై వాలిపోయింది. పండ్లతోటల్లో కాయలు రాలుతున్నాయి. ఆరుగాలం కష్టపడిన రైతన్న కంట కన్నీటి వరదలు పారుతున్నాయి. అతివృష్టి, అనావృష్టి, అకాల వర్ష వడగళ్లతో హలధారి విలవిల్లాడుతున్నాడు. పుండు మీద కారం చల్లినట్లు రానున్న రోజుల్లో సూపర్ ఎల్‌నినో బలపడితే కరవు కరాళ నృత్యం చేయవచ్చు. ఆహార అభద్రత రాజ్యమేలవచ్చు. ఇలాంటి వాతావరణ ప్రతికూల మార్పులకు కారణాలను తెలుసుకొని, అరికట్టే ప్రయత్నాలు చేయనియెడల విశ్వమానవాళి సంక్షోభ సంకెళ్ల లో బంధించబడి హాహాకారాలతో ఆఖరి శ్వాస తీసుకోవచ్చు. ఈ పరిస్థితులను ఆలకించరు చేసుకొని రాబోయే కరవుల ను ఎదుర్కొనే చర్యలను నేటి నుండే మొదలు పెడదాం, రేపటి ఆరోగ్యకర వాతావరణానికి నేటి నుంచే హారతి పడదాం. ●

# ఫలించని సంస్కరణలతో పేదలు భూమికి దూరం!

బొల్లిముంతసాంబశివరావు

తెలంగాణ రాష్ట్రంలో 25లక్షల గ్రామీణ కుటుంబాలకు సాగు భూమి లేదని, వీరిలో దళిత కుటుంబాలు ఎక్కువని,వీరంతా కూలిపనులు చేసుకొంటున్నారని ధరణి కమిటీ రిపోర్టులో పేర్కొంది. ఈకుటుంబాలకు ప్రస్తుత ప్రభుత్వం భూములు పంపిణీ చేయటమే కాకుండా ఏటా 12వేల ఆర్థిక సహాయం అందించే ఆలోచన చేస్తున్నది. భూమికి, గ్రామీణ ప్రజలకు విడదీయరాని బంధం ఉంది. రైతుకు సమాజంలో హోదాని, గౌరవాన్ని ఇచ్చేది సేద్యపు భూమే. అంతటిప్రాధాన్యత ఉన్న భూమి కొద్దిమంది వ్యక్తుల వద్ద ఎక్కువగా పోగుపడి ఉంది. అత్యధిక మందిపేదలు భూమి కిదూరమయ్యారు. నేడు తెలంగాణ రాష్ట్రంలో 65లక్షల మంది రైతులున్నారు. సేద్యపు భూమి కోటి52లక్షలుఉంది. 73శాతం మంది రైతులు 2.5ఎకరాలకన్నా తక్కువ భూమి కలిగి ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వ అధికార లెక్కల ప్రకారం లక్షలోపు జనాభా కలిగిఉన్న వారి వద్ద 14.97లక్షల ఎకరాల భూమి ఉంది. మూడు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులు 42.22 లక్షల మంది ఉంటే, వారి వద్ద 60.60 లక్షల ఎకరాల భూమి ఉంది. మూడు నుంచి ఐదుఎకరాల లోపు ఉన్న రైతులు 10.08 లక్షల మంది ఉండగా, వారి వద్ద 40లక్షల ఎకరాల భూమి ఉంది. ఐదునుంచి 10 ఎకరాలున్న వారు 4.65 లక్షల మంది రైతులుండగా, వారు 30.94 లక్షల ఎకరాలు కలిగి ఉన్నారు. 20ఎకరాల భూమి ఉన్న రైతులు 84.606 మంది ఉండగా, వారి వద్ద11.09 లక్షల ఎకరాల భూమిఉంది. 20ఎకరాలపైన ఉన్న భూకామందులు 14.46 వేల మంది ఉంటే వారి వద్ద 3.87 లక్షల ఎకరాల భూమి ఉంది. ఈగణాంకాలను గమనిస్తే భూస్వాముల, ధనిక, రైతుల వద్ద భూకేంద్రీకరణ ఎక్కువగా ఉందని, చిన్న, సన్నకారు రైతులు తక్కువ భూమి కలిగి ఉన్నారని, అసలు సెంటు భూమి లేని పేదలు 25 లక్షలమంది ఉన్నారని వెల్లడౌతుంది. దేశంలో బ్రిటిష్ వలస పాలన కాలంలోనే భూమికోసం అనేక పోరాటాలుజరిగాయి. 10లక్షల ఎకరాల భూములు స్వాధీనం చేసుకుని పంపిణీ చేసుకున్నారు. వేలాది గ్రామాల్లో ప్రజాపాలన ఏర్పడింది. ఈపోరాటంలో 4 వేలమంది కమ్యూనిస్టు పార్టీ వారు ప్రాణాలు కోల్పోయారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, ప్రజల ప్రధాన సమస్య అయిన భూమి సమస్యను ముందుకు తెచ్చింది. భూపోరాటాలకు భయపడిన నెహ్రూ ప్రభుత్వం 1947 నవంబర్ 28న జమీందారీ విధానం రద్దు బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టింది. 1948లో వ్యవసాయ సంస్కరణలపై కుమారప్ప కమిటీని వేసింది. ఈ కమిటీ 1949లో తన నివేదిక అందచేసింది. అందులో కొన్ని సూచనలు చేసింది. ఈ కమిటీ సూచనల మేరకు 1949లోహైద్రాబాద్ జాగీర్దార్ల రద్దుచట్టాన్నిచేసింది. 1950లో సంస్థానాలను రద్దుచేసి ఒక్కో సంస్థానానికి 18కోట్లు భరణంగా ఇచ్చింది. వీటికింద లక్షలాది ఎకరాల భూములున్నాయి. ఈ భూములు పేదలకు దక్కలేదు. రైతులపేరుతో దలారులుగా ఉన్నవారు భూములు పొంది భూస్వాములుగా మారారు. కుమారప్ప కమిటీ సూచనలకు అనుగుణంగా వ్యవసాయం చేయని భూయజమానుల దోపిడీ నుండి కౌలుదారులకు రక్షణ కల్పించటం పేరుతో 1950లో తెలంగాణ కౌలుదారీ చట్టం చేశారు. వివిధ చారిటబుల్



మతసంబంధమైన ఈనాం భూములకు (వీటికింద లక్షల ఎకరాల భూమి ఉంది) తప్ప ఈచట్టం అన్నిరకాల భూములకు వర్తిస్తుంది.1933 నుంచి 1943 మధ్యకాలంలో వరుసగా ఆరుసంవత్సరాలు కౌలుకు చేస్తున్న వారిని రక్షిత కౌలుదారులుగా చట్టం గుర్తించింది. రక్షి త కౌలుదారునికి సేద్య అవసరాల కోసం భూమిని బ్యాంకుల తనకా పెట్టే హక్కు కల్పించబడింది. నిబంధన ప్రకారం కౌలుచెల్లించినంత కాలం కౌలుదారుగా కొనసాగుతాడు. కౌలుచెల్లించకపోతే కౌలు ఒప్పందం రద్దు అవుతుంది. భూయజమాని సొంత సేద్యం చేసుకునేందుకు చట్టంలో హక్కు కల్పించారు. ఈ హక్కుతో సొంత సేద్యం పేరుతో భూకామందులు కౌలుదారులను భూముల నుండి తొలగించారు. ఆచరణలో కౌలుదారీ చట్టం అలంకారప్రాయంగా మారింది. ఎటువంటి హక్కులు లేకుండా కౌలుదారులు అధిక కౌలుతో నేడు కౌలుసేద్యం చేస్తున్నారు. భూకేంద్రీకరణను, ఆర్థిక, సాంఘిక, అసమానతలను తగ్గించటానికని భూకమతాలపై గరిష్ట పరిమితి విధించారు. దీన్ని అమలు చేయటానికి హైద్రాబాద్ వ్యవసాయ సంస్కరణల కమిటీ నియమించబడింది. ఈకమిటీ భూకమతాల గరిష్టపరిమితికి కొన్ని సూచనలు చేసింది. వ్యవసాయదారులకు నెలకు రూ.150 వచ్చే విధంగా వివిధ ప్రాంతాల్లోని భూములను ఆర్థిక కమతంగా గుర్తించాలి. రెండు ఎకరాల మాగాణి లేదా 15 ఎకరాల మెట్ట భూమిని బేసిక్ ఆధారంగా కమతం గరిష్ఠ పరిమితిని నిర్ణయించాలి. గరిష్ఠ పరిమాణం ఆర్థిక కమతానికి 5రెట్లు ఉండాలని సూచించింది. కమిటీ సూచనల ప్రకారం మధ్య వర్తుల తొలగింపు చట్టం, జమీందార్ల, జాగీర్దార్లను తొలగించటం వరకే పరిమితమైంది. దున్నేవానికే భూమి అన్న నినాదం వదిలివేయబడింది. తెలంగాణ రైతాంగ పోరాటం తర్వాత నక్సల్బరీ గిరిజన రైతాంగ పోరాటం, శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం మరలా భూసమస్యను ఎజెండాలోకి తెచ్చాయి. వ్యవసాయ కూలీల్లో, పేదరైతుల్లో భూమి సాధించుకోవాలనే పట్టుదల రోజురోజుకి పెరిగింది. ఈవాస్తవాన్ని గ్రహించిన ఆనాటి ఇందిరాప్రభుత్వం, భూపోరాటాలను దారిమళ్లించేందుకు పూనుకుంది. 1970లోముఖ్య మంత్రుల సమావేశంలో మనరాజకీయ వ్యవస్థ రక్షించబడాలంటే భూసంస్కరణల చట్టం చేయక తప్పదని ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ చెప్పింది. భూపరిమితికి ఐదుగురు సభ్యుల కుటుంబాన్ని యూనిట్ తీసుకోవాలి. సంవత్సరానికి రెండు పంటలు పండే భూమి 10 నుంచి 18ఎకరాలు, మెట్టభూమి27ఎకరాలు గరిష్ట పరిమితిగా, కాఫీ, తేయాకు, రబ్బరు,కోకో మొద్కలెన తోటలు పండించే తోటలకు చట్టం నుంచి మినహాయింపు ఇచ్చి, నూతన సవరణలతో భూసంస్కరణ చట్టాలను డిసెంబర్ 31,1972 నాటికి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించాలని ఆదేశించింది. కేంద్రం ప్రభుత్వ సూచనల మేరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1972మేలో భూపరిమితి కుదిస్తూ ఆర్డినెనిన్ విడుదల చేసింది. దానిలో కుటుంబానికి 10 ఎకరాల మాగాణి, 25 ఎకరాల మెట్టభూమిని భూపరిమితిగా విధించి 1973 జనవరిలో శాసనసభ ఆమోదంపొంది భూసంస్కరణల చట్టంగా మారినా 1975 జనవరిలోగాని ఆచరణలోకి రాలేదు. ఈ చట్టం ద్వారా మొదట 18 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందని ప్రకటించి దాన్ని కదిస్తూ చివరికి 7.8 లక్షల ఎకరాలుగా తేల్చి అందులో 6.47 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని 5.82లక్షల ఎకరాలను 4 లక్షల,79 వేలమందికి పంపిణీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో కూడా చట్టానికి ముందే పేదలు సాగుచేసుకుంటున్న భూములు ,సేద్యానికి ఉపయోగపడని భూములే ఎక్కువగా ఉన్నాయి. చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని భూస్వాములు చట్టపరిధిలోకి రాకుండా కాపాడుకున్నారు. జాతీయ స్థాయిలో ఒకేసీలింగ్విధానం రూపొందించిన తర్వాత 67 లక్షలుగా, మిగులు భూమిగా ప్రకటించగా, ప్రభుత్వ విధానాలు, పాలసీలపైపరిశోధన, క్రమశిక్షణ నిమిత్తం ఏర్పాటైనలఅకాడమి దేశంమొత్తంలో మిగులు భూమి 5 కోట్ల 20 లక్షల ఎకరాలు ఉంటుందని అంచనా వేసింది. భూ సంస్కరణల చట్టం అమలు జరగకపోవటం వల్ల భూకామందుల వద్ద లక్షలాది ఎకరాల మిగులు భూమి ఉంది. ●

# రూ.10 వేల కోట్లతో ఇంధన ధరల స్థిరీకరణ నిధి

**- విమానయాన సంస్థలకు ఆర్థిక ప్యాకేజీ - కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఆమోదం - ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో కాలుష్య నివారణకు రూ.9,585 కోట్ల కొత్త పథకం - రూ.8300 కోట్లతో రామేశ్వరం- పరదీప్ కోస్టల్ హైవే ప్రాజెక్టుకు ఆమోదం - తెలంగాణలో రూ.7,597.16 కోట్లతో 190 కి.మీ. హైవే ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్ :కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**



**న్యూఢిల్లీ, జూన్ 3:** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ విపణిలో పెరుగుతున్న ఇంధన ధరలతో భారత్‌పై ఆ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఉపశమన చర్యలకు శ్రీకారం చుట్టింది. రూ.10 వేల కోట్లతో 'ఇంధన ధరల స్థిరీకరణ నిధి' ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిర్వహించిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ నిధి ఏర్పాటుకు విమానయాన రంగానికి ఒక ప్రధాన ఉపశమన చర్యగా అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కొనసాగుతున్న పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఇంధన ధరల వల్ల ప్రభావితమైన షెడ్యూల్డ్ భారతీయ విమానయాన సంస్థల కోసం ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్) ధరలను స్థిరీకరించడంలో సహాయపడటానికి బడ్జెట్ మద్దతు ప్యాకేజీని ఆమోదించినట్లు వివరించారు. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ద్వారా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీలు) వడ్డీ లేని అడ్వాన్సుల రూపంలో ఈ సహాయం అందించబడుతుంది. ఈ నిధి, దేశీయ, అంతర్జాతీయ విమాన కనెక్టివిటీకి అంతరాయం కలగకుండా చూస్తూనే, అపూర్వమైన ఇంధన ధరల అస్థిరత నుండి విమానయాన సంస్థలను కాపాడటాన్ని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. దీంతోపాటు దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య నివారణ చర్యల్లో భాగంగా పాత బస్సులు, ట్రక్కుల స్థానంలో కొత్తవి తీసుకు రావడానికి రూ.9,585 కోట్లతో ప్రతిపాదించిన కొత్త పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. రెండేళ్లలో ఈ పథకం కింద పూర్తిగా బి-6 లేదా ఐవి వాహనాలను తీసుకు రావడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అలాగే, తమిళనాడులోని రామేశ్వరం నుంచి ఒడిశాలోని పరదీప్ వరకు 160.18 కిలోమీటర్ల కోస్టల్ హైవే ప్రాజెక్టును రూ.8300.79 కోట్లతో రెండు దశల్లో చేపట్టాలనే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ అనుమతిచ్చింది. పూర్తిగా హైబ్రిడ్ అన్యుటి మోడల్ (హెచ్ఎఎం)లో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇదిలా ఉండగా, తెలంగాణలో ఎన్‌హెచ్-63లో ఆర్మూర్ - జగిత్యాల - మంచిర్యాల సెక్షన్, ఎన్‌హెచ్-563లో జగిత్యాల - కరీంనగర్ మొత్తం 190 కి.మీ. నాలుగు వరుసలతో హైబ్రిడ్ అన్యుటి మోడల్(హెచ్ఎఎం)లో రూ.7,597.16 కోట్లతో విస్తరణ పనులకు ఎన్‌హెచ్ఐఎ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మధ్యప్రదేశ్‌లో ఎన్‌హెచ్ 347బిలో హివార్‌ఖేడి - రోష్ని -ఆషాపూర్- రుధీ మధ్య 125.01 కి.మీ, దేశ్‌గావ్ -జుల్వానియా మధ్య 108.65 కి.మీ మేర నాలుగు వరుసల రహదారి విస్తరణ కోసం రూ.4,415.60 కోట్ల ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలాగే బీహార్‌లో రూ.3, 936.05 కోట్లతో ఎన్‌హెచ్-31, ఎన్‌హెచ్-231 రహదారి విస్తరణ పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు వివరించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌లను నిషేధించవచ్చు


**తమిళనాడు, కర్ణాటక చట్టాలను సమర్థించిన సుప్రీంకోర్టు**

**న్యూఢిల్లీ, జూన్ 3:** ఆటలపై ఆన్‌లైన్ బెట్టింగ్, పందెం కాయడాన్ని నిషేధించే తమిళనాడు, కర్ణాటక చట్టాల రాజ్యాంగబద్ధతను సర్వోన్నత న్యాయస్థానం సమర్థించింది. ఆట నైపుణ్యానికి సంబంధించినది అయినప్పటికీ, బెట్టింగ్‌పై చట్టాలు చేసేందుకు రాష్ట్ర శాసనసభలకు అధికారం ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లోని రెండవ జాబితాలోని 34వ అంశం ప్రకారం, "బెట్టింగ్, జూదం"పై చట్టాలు చేసేందుకు రాష్ట్రాలకు అధికారం ఉందని, దీని కింద నైపుణ్యంతో కూడిన ఆటలపై బెట్టింగ్‌ను నియంత్రించే, నిషేధించే అధికారం రాష్ట్రాలకు ఉందని జస్టిస్ జె.బి. పర్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నైపుణ్యపు ఆటలకు లభించే రాజ్యాంగ రక్షణ, అటువంటి ఆటలపై నిర్వహించే పందెం కాయడానికి లేదా బెట్టింగ్‌కు వర్తించదని కోర్టు స్పష్టం చేసింది. నైపుణ్యంతో కూడిన ఆటలు 'జూదం' అనే పదం పరిధిలోకి రాకపోవచ్చు అనేది నిజమే అయినప్పటికీ, నైపుణ్యంతో కూడిన ఆటలపై 'పందెం' వేయడం కూడా రాష్ట్ర శాసనసభ చట్టసభ పరిధిలోకి రాదని చెప్పడం సరికాదు" అని కోర్టు పేర్కొంది. పందెం, జూదంతో కూడిన వ్యాపారం చేయడానికి ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలకు ఆర్టికల్ 19(1)(జి) కింద ప్రాథమిక హక్కు లేదని కూడా కోర్టు స్పష్టం చేసింది. ఆన్‌లైన్ రమ్మీ, పోకర్ వంటి యాప్‌లలో డబ్బులు పందెంగా పెట్టడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. అటువంటి ఆటలు ఆడడానికి నైపుణ్యం అవసరమైనా వాటిపై డబ్బులు పందేలు కాస్తే అది 'జూదం' కిందకే వస్తుందని పేర్కొన్నది. ఆన్‌లైన్ వ్యసనాలవల్ల యువత అప్పుల పాలై, ఆత్మహత్యలు చేసుకుంటున్న సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని ఈ తీర్పు వెలువరిస్తున్నట్లు తెలిపింది. సమాజ హితం, శాంతిభద్రతల దృష్ట్యా ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లపై నిషేధం విధించడాన్ని సమర్థిస్తున్నట్లు తెలిపింది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల నిషేధానికి మార్గం సుగమమైంది.

# ముఖ్యమంత్రిగా డికె పదవీ ప్రమాణం

**ఆయనతోపాటే 13 మంది సీనియర్ ఎమ్మెల్యేలు కేబినెట్‌లోకి**

**యతీంద్ర, యుటిఖాదర్‌లకు కూడా ఛాన్స్**



**బెంగళూరు, జూన్ 3:** కర్ణాటకలో నెలకొన్న కాంగ్రెస్ సంక్షోభానికి తెరపడింది. ముఖ్యమంత్రిగా 64 ఏళ్ల దొడ్డలహళ్లి కెంపెగౌడ శివకుమార్ 18వ ముఖ్యమంత్రిగా బుధవారం లోక్‌భవన్‌లోజరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారంచేసారు. రాజ్యాంగం పుస్తకాన్ని చేతబట్టి ఆయన ప్రమాణ పత్రాన్ని చదివారు. అంతకుముందు వేదికపైనుంచే ఆయన ఆహూతులందరికీ సాష్టాంగప్రణామం చేయడం కాంగ్రెస్‌నేతలను ఆకర్షించింది. ఎనిమిదిసార్లు ఎమ్మెల్యే అయిన శివకుమార్ ముఖ్యమంత్రిగాను, డిప్యూటి సిఎంగా జికె పరమేశ్వరలు ప్రమాణస్వీకారంచేసారు. మరో 13 మంది సీనియర్ ఎమ్మెల్యేలు కేబినెట్ మంత్రులగా ప్రమాణంచేసారు. లోక్‌భవన్‌లోని గ్లాస్ హౌస్‌లో గవర్నర్ తావర్‌చంద్ గెహ్లోత్ వీరితో ప్రమాణంచేయించారు. సీఎంగా శివకుమార్ వీరగంగాధర అజ్జయ్యపేరును పఠించి ప్రమాణంచేసారు. అంతకుముందు అజ్జయ్యకు పూలతో నివాళి అర్పించారు. మంత్రులుగా సిద్ధరామయ్య తనయుడు యత్రీంద్ర, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గే,కేహెచ్ మునియప్ప, కె.జె.జార్జ్, ఎంబీ పాటిల్, సతీశ్ జర్కిహోళి, రామలింగారెడ్డి, కృష్ణబైరె గౌడ, మాజీ స్పీకర్ యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్‌తో గవర్నర్ ప్రమాణం చేయించారు. సాధారణంగా సీఎం ప్రమాణ స్వీకార వేదిక ద్వారాలు, కార్యాలయంలోని ఆసనాలన్నీ జ్యోతిషశాస్త్ర ప్రకారమే మార్చడ విశేషం. ఏఐసీసీ నుంచి విశిష్ట అతిథులు, రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ప్రత్యేక అతిథులుగా పలు రంగాల ప్రముఖులను గౌరవ అతిథులుగా ఆహ్వానించారు. మొత్తం 1100 మందికి లోక్‌భవన్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమానికి 3 వేల మంది పోలీసులతో భద్రత కల్పించారు. 2023 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి, అధికారం చేపట్టింది. ఆ సమయంలోనే సీఎం పదవి కోసం డీకే తీవ్రంగా ప్రయత్నించారు. సీనియర్ నేత సిద్ధరామయ్యకు అధిష్ఠానం అవకాశం ఇచ్చింది. రెండున్నరేళ్ల తర్వాత అవకాశం కల్పిస్తామని అప్పట్లో హైకమాండ్ మాట ఇచ్చినట్టు ప్రచారం జరిగింది. గతేడాది నవంబరుతో సగం కాలం పూర్తికాగా నాయకత్వ మార్పుపై తీవ్ర చర్చ జరిగింది. ఆ సంక్షోభాన్ని నివారించిన కాంగ్రెస్ సిద్ధరామయ్యను ఒప్పించి రాజీనామా చేయించారు.

# మమతా బెనర్జీకి షాక్.. 58 మంది ఎమ్మెల్యేల తిరుగుబాటు..

**కోల్‌కత్తా,జూన్ 3:** అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన మమతా బెనర్జీ ఆధ్వర్యంలోని టీఎంసీకి షాక్ తగిలింది. 58 మంది ఎమ్మెల్యేలు పార్టీపై తిరుగుబాటు చేశారు. వారంతా కలిసి ఏకంగా అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ సమర్పించారు. పార్టీ నుంచి సస్పెండ్ అయిన రితబ్రతా బెనర్జీని తమ పార్టీ తరఫున అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని స్పీకర్‌ను కోరారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్‌కు విజ్ఞప్తి చేశారు. బుధవారం వీరంతా ప్రత్యేక బస్సుల్లో బెంగాల్ అసెంబ్లీకి చేరుకున్నారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలకు రితబ్రతా బెనర్జీ నాయకత్వం వహిస్తున్నారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం టీఎంసీలో 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. వీరిలో 58 మంది ఎమ్మెల్యేలు ప్రతిపక్ష నేతగా రితబ్రత పేరు సూచిస్తూ మద్దతు నిలిచారు. ఆయన చెప్పినట్లు పార్టీపై 60 మంది ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తే మమత పార్టీలో 20 మంది ఎమ్మెల్యేలు మాత్రమే మిగులుతారు. ఈ అంశంపై ఇప్పటివరకు మమతా బెనర్జీకానీ, టీఎంసీ అగ్రనాయకత్వం కానీ స్పందించలేదు. మరోవైపు టీఎంసీ అగ్రనేత అభిషేక్ కల్యాణ్ బెనర్జీ తాజాగా ఎక్స్‌లో స్పందించారు. తన పార్టీ తరఫున అసెంబ్లీలో హోదాలకు సంబంధించి కీలక ప్రతిపాదనల్ని స్పీకర్‌కు పంపించారు. శోభన్‌దేవ్ ఛట్టోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా గుర్తించాలని కోరారు. కానీ, ఇప్పుడు అత్యధిక శాతం ఎమ్మెల్యేలు రితబ్రతకు మద్దతు పలకడంతో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. రితబ్రతనే ప్రతిపక్ష నేతగా గుర్తిస్తే మమత ఆధ్వర్యంలోని టీఎంసీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదు. ఇటీవలే రితబ్రతతోపాటు సందీపన్ సాహాను కూడా టీఎంసీ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. పార్టీ అగ్రనాయకత్వం తమ సంతకాలను ఫోర్జరీ చేసిందని వీరు ఫిర్యాదు చేయడంతో టీఎంసీ వీరిని సస్పెండ్ చేసింది.

## పార్టీలోని అన్ని కమిటీలను రద్దుచేసిన టిఎంసి అధినేత్రి మమతా బెనర్జీ



**కోల్‌కత్తా,జూన్ 3:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మాజీ సీఎం మమతా బెనర్జీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పార్టీ ఆవిర్భావం తర్వాత టీఎంసీకి ఇటువంటి గడ్డు పరిస్థితి ఎదురుకావడం ఇదే మొదటిసారి. అంతర్గత సంక్షోభం, భారీ తిరుగుబాటు నేపథ్యంలో అధినేత్రి మమతా బెనర్జీ బుధవారం కీలక నిర్ణయం తీసుకున్నారు. టీఎంసీ రాష్ట్ర కమిటీతో పాటు అనుబంధ సంఘాలన్నింటినీ తక్షణమే రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, పశ్చిమ బెంగాల్‌లోని తృణమూల్ కాంగ్రెస్ అన్ని కమిటీలు, అలాగే దాని అనుబంధ సంస్థలన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని నిర్ణయించడం జరిగిందని తన అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో టీఎంసీ పోస్ట్ పెట్టింది. టీఎంసీ నుంచి ఎన్నికైన కనీసం 58 మంది ఎమ్మెల్యేలు అధినేత్రి నిర్ణయానికి వ్యతిరేకంగా రీతబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా ఎన్నుకున్న గంటలోపే ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడారనే ఆరోపణలపై టీఎంసీ ఎమ్మెల్యేలు రీతబ్రత బెనర్జీ, సాందీపన్ సాహాలను మమతా బెనర్జీ సోమవారం పార్టీ నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. పార్టీ నుంచి సస్పెండ్ గురయ్యేంత వరకు తృణమూల్ ట్రేడ్ యూనియన్ విభాగానికి రీతబ్రత నాయకత్వం వహించారు. పదిహేనేళ్ల పాటు బెంగాల్‌ను పాలించి టీఎంసీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత శరవేగంగా కుప్పకూలుతోంది. ఆ పార్టీ నాయకులలో చాలామంది కీలక సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. మరోవైపు, జిల్లా పరిషత్‌లు, మున్సిపల్ కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలలోని ఎన్నికైన ప్రజాప్రతినిధులలో చాలామంది సామూహికంగా రాజీనామా చేయడం లేదా పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులలో అరెస్టు అయ్యారు. ఆత్మపరిశీలన చేసుకుని, సంస్థను కొత్తగా పునర్నిర్మిస్తామని తృణమూల్ తెలిపింది. పార్టీ ప్రతి స్థాయిలో సమగ్రమైన ఆత్మపరిశీలన, పనితీరు సమీక్ష, సంస్థాగత మదింపు ప్రక్రియను చేపడుతుంది ఈ ప్రక్రియ ఫలితాల ఆధారంగా సంస్థాగతంగా అన్ని విభాగాలను పునర్నిర్మించి, తగిన సమయంలో ప్రకటన చేస్తామన్నారు.

# దేశంలో భారీ కుట్రలకు తెరలేపిన దావూద్ గ్యాంగ్

**ముంబయి, జూన్ 3:** దేశంలో లక్ష్యనిర్దేశిత ప్రాంతాల్లో దాడులకోసం దేశీయంగా యువతను రిక్రూట్ చేసుకుంటున్నట్లు దావూద్ గ్యాంగ్ గుట్టును పోలీసులు ఛేదించారు. ఢిల్లీ స్పెషల్ పోలీసులు, మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ సమాచారం బయటకు వచ్చింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్ర సంస్థ ఐఎస్ఐ, అంతర్జాతీయ గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం గ్యాగ్ కలిసి భారత వ్యతిరేక కుట్రలకు తెరలేపాయి. దేశంలోని యువతను డబ్బు ఆశ చూపి గ్యాంగ్‌లో చేర్చుకుంటున్నట్లు వెల్లడైంది. ఇటీవల ఢిల్లీ పోలీసులు, మహారాష్ట్ర ఏటీఎస్ కలిసి ముంబై సమీపంలోని భయందర్ ప్రాంతంలో 26 ఏళ్ల హుజైఫా ఫారూక్ అహ్మద్ హష్మి అనే వ్యక్తిని అరెస్టు చేశాయి. అతడిని విచారించగా సంచలన విషయాలు బయటపడ్డాయి. ఈ విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ, ముంబైకి చెందిన దావూద్ గ్యాంగ్ కలిసి దేశంలోని కొందరు యువతను తమ గ్యాంగ్‌లో చేర్చుకుంటున్నాయి. వారికి డబ్బును ఆశగా చూపుతున్నాయి. అనంతరం అండర్‌వరల్డ్ సిండికేట్‌లో చేర్చుకుని రకరకాల నేరాల్లో భాగస్వాములుగా చేస్తున్నాయి. వీరంతా కలిసి ఢిల్లీలోని ఒక కీలక నేతను లక్ష్యంగా ఎంచుకున్నారు. అయితే, ఆ నేత ఎవరు అనేది ఇంకా వెల్లడించలేదు. హష్మికి, పాకిస్తాన్‌కు చెందిన యవార్ ఖాన్‌తో సంబంధాలున్నాయి. హష్మికి యవార్ ఖాన్ ఒక కాంటాక్ట్ ఇచ్చాడు. యవార్ హష్మితోపాటు కుర్లాకు చెందిన సాజిద్, ముంబ్రాకు చెందిన తౌఖిర్‌లను గ్యాంగ్‌గా ఏర్పాటు చేసి, ఒక ఢిల్లీ నేతను టార్గెట్‌గా ఇచ్చారు.

# ఫలించిన వ్యూహం..

## విపక్షనేతగా రెబెల్ నేత రితబ్రత బెనర్జీ

**ఆమోదించిన స్పీకర్ రతీంద్రనాథ్ బోస్**

**చీఫ్‌విప్, విప్ , డిప్యూటీల నియామకానికీ ఓకే!**



**కోల్‌కత్తా,జూన్ 3:** పశ్చిమబెంగాల్ టిఎంసిలో రోజురోజుకూ తిరుగుబాటు పెరుగుతోంది. తాజాగా 58 ఎమ్మెల్యేలు రాష్ట్ర స్పీకర్ రతీంద్రనాద్‌బోస్‌కు లేఖ ఇచ్చారు. వీటిని వెంటనే స్పీకర్ ఆమోదించడంతో టిఎంసి రెబెల్ ఎమ్మెల్యేల గ్రూప్ మరింత దూకుడు పెంచింది. రితబ్రత బెనర్జీ ఆధ్వర్యంలో 58 మంది ఎమ్మెల్యేలు తాము శాసనసభా పక్ష నేతగా రితబ్రత బెనర్జీనే ఎన్నుకున్నట్లు లేఖ ఇవ్వడంతో ఆగ్రూపు నేతగా రితబ్రత ఎన్నికయ్యారు. స్పీకర్‌ను కలిసిన అనంతరం రెబెల్‌నేత మాట్లాడుతూ తమకు 58 మంది ఎమ్మెల్యేలు మద్దతు ఉందని, మేమంతా సమిష్టిగా స్పీకర్‌ను కలిసి లేఖ ఇచ్చామని వెల్లడించారు. అలాగే శాసనసభలో విపక్షనేతగా బందోపాధ్యాయ్‌ను ఎన్నుకున్నట్లు కూడా తెలిపారు. అంతకుముందు పార్టీ ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు, ఎంపి అభిషేక్ బెనర్జీ స్పీకర్‌కు లేఖరాస్తూ శోభన్‌దేవ్ ఛటోపాధ్యాయ్‌ను శాసనసభలో విపక్ష నేతగా ఎన్నుకున్నట్లు లేఖ ఇచ్చారు. అయితేఈ ప్రతిపాదనను స్పీకర్ ఆమోదించలేదు. అనేకమంది టిఎంసి ఎమ్మెల్యేల సంతకాలను ఫోర్జరీచేసారన్న ఆరోపణలు, ఫిర్యాదులు స్పీకర్‌కు రావడంతో అభిషేక్ లేఖను తిరస్కరించారు. ఈపరిణామాలిలా ఉంటే కోల్‌కత్తామేయర్ టిఎంసి సీనియర్ నాయకుడు ఫిర్హాద్ హాకీమ్‌కూడా తన పదవికి రాజీనామాచేసారు. అంతకుముందే మమతాను తాను రాజీనామాచేస్తానని కోరినట్లు వినికిడి. బిజెపి ప్రభుత్వంలో బాధ్యతలునిర్వహించడం కష్టమేనని తాను తప్పుకుంటానని చెప్పినట్లు సమాచారం. పదేపదే విజ్ఞప్తులుచేయడంతో మమతా బెనర్జీ కూడా పదవినుంచి దిగిపోయేందుకు సుముఖత వ్యక్తంచేసారని ఎమ్మెల్యే కునాల్‌ఘోష్ తెలిపారు. ఇదిలా ఉంటే రితబ్రత బెనర్జీ పార్టీ ఛీఫ్ విప్‌గా జావేద్ అహ్మద్‌కాన్, సాదీపన్ సాహా, సబినా యాస్మిన్,షియులి సాహాలు డిప్యూటీలుగా నియమించినట్లుప్రకటించారు. లేఖలను ఇప్పటికే స్పీకర్‌కు అందచేసామని రితబ్రత వివరించారు.

# నేనే సుస్మితపై ఆధారపడేవాడిని!

## సేన్ గోల్డ్ డిగ్గర్ అన్న వ్యాఖ్యలకు లలిత్‌మోడీ కౌంటర్

**లండన్, జూన్ 3:** మాజీ విశ్వసుందరి సుస్మితా సేన్‌తో తన గత బంధం గురించి ప్రముఖ వ్యాపారవేత్త లలిత్ మోదీ చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. సుస్మితను గోల్డ్ డిగ్గర్ (డబ్బు కోసం ఆశపడే వ్యక్తి) అని విమర్శించిన వారికి గట్టి సమాధానం ఇస్తూ, అసలు తానే ఆమెపై ఆధారపడిన ప్రియుడిలా ఉండేవాడినని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ ఇంటర్వ్యూ వైరల్ అయిన తర్వాత సుస్మితా సేన్ చేసిన మొదటి సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు మరింత చర్చనీయాంశంగా మారింది. ఇటీవల హ్యూమన్స్ ఆఫ్ బాంబేకి ఇచ్చిన ఇంటర్వ్యూలో లలిత్ మోదీ మాట్లాడుతూ సుస్మిత చాలా అందమైన, బాగా సంపాదించుకున్న మహిళ. ఈ గ్రహం మీద నేను చూసిన ఎవరికన్నా ఆమె దగ్గరే ఎక్కువ వజ్రాలున్నాయి. అవన్నీ ఆమె స్వయంగా సంపాదించుకున్నవే. ఒకానొక సమయంలో నేను ఆమెతో బయటకు వెళ్లినప్పుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం రాలేదు. అన్నీ ఆమెనే చూసుకునేది. నేను ఆమెపై ఆధారపడిన ప్రియుడిలా ఉండేవాడిని. ఆమె అద్భుతమైన మహిళ అని వివరించారు.

# కువైట్ ఎయిర్‌పోర్టుపై ఇరాన్ భీకర దాడి

**కువైట్ సిటీ, జూన్ 3:** గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడికి పాల్పడింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఎయిర్‌పోర్ట్‌లోని ఒక ప్యాసింజర్ టెర్మినల్ తీవ్రంగా దెబ్బతింది. ఎయిర్‌పోర్ట్‌లోని టీ1 ప్యాసింజర్ భవనంపై ఇరాన్‌కు చెందిన డ్రోన్లు దాడి చేశాయి. విమానాశ్రయ భవనానికి భారీగా నష్టం వాటిల్లినట్లు కువైట్ ప్రభుత్వం వెల్లడించింది. దాడి నేపథ్యంలో అధికారులు విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, అన్ని విమాన సర్వీసులను నిలిపివేశారు. ఈ దాడిని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ సౌద్ అబ్దుల్‌అజీజ్ అల్‌ఒతైబీ మాట్లాడుతూ, ఇది ఇరాన్ చేసిన నేరపూరిత దురాక్రమణ. శత్రు డ్రోన్లు నేరుగా ప్రయాణికుల భవనాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడి వల్ల భవనానికి తీవ్ర నష్టం కలగడంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నామని తెలిపారు. పరిస్థితిని భద్రతా దళాలు నిశితంగా గమనిస్తున్నాయని, ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవడానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల్లో తమ సైనికులకు ఎలాంటి నష్టం జరగలేదని ఇరాన్ స్పష్టం చేసింది. దాడి సమయంలో కువైట్, బహ్రెయిన్ దళాలు కూడా తమ రక్షణ వ్యవస్థలను యాక్టివేట్ చేశాయి. ఫిబ్రవరిలో మొదలైన ఘర్షణల తర్వాత, ఇటీవలే కువైట్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి. తాజా దాడితో గల్ఫ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. కువైట్ అధికారులు సైనిక బలగాలను హై అలర్ట్‌లో ఉంచారు.

# లక్ష డాలర్ల ఫీజు నిర్ణయించినా హెచ్1బి వీసాలకోసం 2.86 లక్షల దరఖాస్తులు

**హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్**



**వాషింగ్టన్, జూన్ 3:** హెచ్1బి వీసాలపై ఆంక్షలు పెంచేందుకు డొనాల్డ్‌ట్రంప్‌ప్రభుత్వం ఫీజును లక్ష డాలర్లకు పెంచినప్పటికీ దరఖాస్తులు మాత్రం వెల్లువలా వస్తూనే ఉన్నాయి. హెచ్1బి వీసాలకోసం దరఖాస్తులు రెండులక్షలకుపైగా వచ్చినట్లు డిపార్టుమెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి మార్క్‌వేన్ ముల్లిన్ వెల్లడించారు. సెనేట్ అప్రాప్రియేషన్స్ సబ్‌కమిటీ ముందు వివరణ ఇచ్చిన మార్క్‌వేన్ ముల్లిన్ హెచ్1బి వీసాకోసం దరఖాస్తులు 2.86 లక్షలవరకూ అందినట్లు తెలిపారు. వీటిలో రెండులక్షల దరఖాస్తులకు అభ్యర్థులు లక్ష డాలర్ల ఫీజును కూడా చెల్లించారు. దీనితో మేం వేగంగా ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సెనేటర్ సుసాన్ కొల్లిన్స్ వేసిన ప్రశ్నలకు మార్క్‌వేన్ ముల్లిన్ సుదీర్ఘ వివరణ ఇచ్చారు. దరఖాస్తుదారులు 15రోజుల్లోనే తమ దరఖాస్తులను క్లియర్‌చేసేందుకు వీలుగా మొత్తం ఫీజు చెల్లించారని చెప్పారు. సాధారణ దరఖాస్తులు సుమారుగా 7.5 నెలలకాలం పడుతుందని కూడా డిహెచ్ఎస్ కార్యదర్శి వివరించారు. గ్రామీణ హెల్త్‌కేర్ ప్రొవైడర్లకు భారం పెరుగుతోందని, ప్రిస్క్ ఐల్ అనే ఉత్తరమైన్ ప్రాంతంలో ఇటీవలే విదేశీ సర్జన్‌కోసం నిర్దేశిత ఫీజు మొత్తం చెల్లించిందని చెప్పారు. ఇప్పటివరకూ సేవలు అందని ప్రాంతాల్లో నియామకాలకు స్కిల్డ్ వర్కర్లు అవసరం అవుతారని, దేశీయ ట్యాలెంట్ పూల్స్‌నుంచే వారిని ఎంపికచేసుకోవాలనిసూచించారు. ఈ ఫీజునుంచి వైద్య వృత్తినిపుణులను మినహాయిస్తారా అన్న ప్రశ్నపై ముల్లిన్ స్పందిస్తూ వైద్యనిపుణులు అందుబాటులో లేనట్లు నిర్ధారణ అయితేనే సాధ్యం అవుతుందని చెప్పారు. కొన్ని ప్రత్యేక కేసుల్లో మినహాయింపులు ఇచ్చే అంశంపై నిపుణులు కొరత తీవ్రంగా ఉన్నపుడు మాత్రమే వీలవుతుందని ముల్లిన్ చెప్పారు. ఐటిరంగంలో ఒక కంప్యూటర్ నిపుణుడిని ఇతర దేశంనుంచి కాలిఫోర్నియా, సిలికాన్ వ్యాలీల్లో నియమించుకున్నంత సులువుగా ఒక వైద్యనిపుణుడిని మాత్రం గ్రామీణ ఆసుపత్రుల్లో నియమించుకోవడం అంత సులువుకాదన్నారు. అలాస్కా రిపబ్లికన్ సెనేటర్ లీసా మరెకోవ్‌స్కీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక జిల్లాల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని సభ దృష్టికి తెచ్చారు. గతంలో కూడా హెచ్1బి వీసా టీచర్లకు సమస్య ఎదురవుతోందని డిహెచ్ఎస్ దృష్టికి తెచ్చినట్లు గుర్తుచేసారు.

# సంక్షిప్తంగా..

## అద్దెలు పెంచవద్దని ఎమిరేట్స్ భవన యజమానులకు ఆదేశాలు



**అబూదాబి, జూన్ 3:** ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అబుదాబి ప్రభుత్వం అక్కడి నివాసితులకు ఊరటనిచ్చే నిర్ణయం తీసుకుంది. ఇళ్లు, దుకాణాలు, పారిశ్రామిక భవనాల అద్దెలను ప్రస్తుతానికి పెంచొద్దని ఆదేశాలు జారీ చేసింది. అబుదాబి రియల్ ఎస్టేట్ సెంటర్ తీసుకున్న ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని అధికారికంగా ప్రకటించింది. కొత్త నిబంధనల ప్రకారం ప్రస్తుతం అద్దెకు ఉంటున్న వారి కాంట్రాక్టులను పునరుద్ధరించుకునే సమయంలో అద్దెను అస్సలు పెంచకూడదు. ఒకవేళ పాత వాళ్లు ఖాళీ చేసి వెళ్లినా ఆ స్థానంలోకి వచ్చే కొత్త వాళ్లకు కూడా పాత అద్దెనే వర్తింపజేయాలి. గతంలో ఏడాదికి గరిష్ఠంగా ఐదు శాతం వరకు పెంచుకునేందుకు యజమానులకు ఉన్న అవకాశాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా రద్దు చేసింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నివసించే ప్రవాస భారతీయులకు ఈ నిర్ణయం పెద్ద ఊరటను ఇచ్చింది.

## శ్రీలంక మాజీ అధ్యక్షుడు గోటబయపై విదేశీ టూర్ల బ్యాన్!



**కొలంబో, జూన్ 3:** శ్రీలంక మాజీ అధ్యక్షుడు గోటబయ రాజపక్షపై శ్రీలంకకోర్టు విదేశీ టూర్‌లపై నిషేధం విధించింది. 2019లో జరిగిన ఈస్టర్ సన్‌డే బాంబింగ్స్‌అరాచకానికి సంబంధించి దర్యాప్తు వేగం అవుతున్నందున ఆనాటి అధ్యక్షుడిపై విదేశీ టూర్లు చేయడానికి ఆంక్షలు విధించింది. రాజపక్ష హయాంలోని ఇంటెలిజెన్స్ చీఫ్ సురేష్ సల్లాయ్‌ను ఫిబ్రవరినుంచే అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడులకు వ్యూహరచన చేసింది ఆతడేనన్న అభియోగాలున్నాయి. ఆనాటి దాడుల్లో 279 మంది చనిపోయిన సంగతి తెలిసిందే. అయితే ఈ ఆరోపణలను ఐజిచీఫ్ ఖండించారు. కొలంబో ఫోర్ట్ మేజిస్ట్రేట్ ఇందుకు సంబంధించి రాజపక్షతోపాటు మరో ఇద్దరు మిలిటరీ ఇంటెలిజెన్స్ అధికారులు దేశం వీడి వెళ్లకుండాచూడాలని ఇమ్మిగ్రేషన్ అధికారులకు కూడా ఆదేశాలిచ్చారు.

## అనుమతుల్లేకుండా జపాన్‌లో పాకిస్థానీల అక్రమ మసీదునిర్మాణం

**టోక్యో, జూన్ 3:** ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండా జపాన్‌లోని పాకిస్తానీయులు మసీదు నిర్మించడం ఇపుడు పెద్ద వివాదం అయింది. రాజధాని టోక్యో సమీపంలోని కావాగోయ్‌లో నిర్మించిన ఈ మసీదును జపాన్‌లోని పాకిస్థాన్ రాయబారి అబ్దుల్ హమీద్ ప్రారంభించారు. జపాన్ సిటీ ప్లానింగ్ యాక్ట్ ప్రకారం సరైన అనుమతులు పొందకుండానే మసీదును నిర్మించారని అధికారుల తనిఖీల్లో తేలింది. దీంతో ఈ మసీదు కూల్చివేత ముప్పును ఎదుర్కొంటోంది. కావాగోయ్ సిటీలో ఈ మసీదును నిర్మించిన ప్రాంతంలో ఏదైనా నిర్మాణం చేపట్టాలంటే ముందుగానే అనుమతులు పొందాలి, లేకపోతే అక్కడ నిర్మాణాలు చేపట్టడంపై నిషేధం ఉంది. ముందస్తు అనుమతులు తీసుకోకుండా మసీదు నిర్మాణాన్ని చేపట్టారని కవాగోయ్ సిటీ అధికారులు తెలిపారు. దీంతో ఈ భవనాన్ని కూల్చివేయాలని కోరుతూ వచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

## ఖాన్‌సార్ కోచింగ్ సెంటర్‌పై ఆగంతకుల దాడి!



**పాట్నా,జూన్ 3:** దేశవ్యాప్తంగా ఎంతో ఆదరణ పొందిన ప్రముఖ అధ్యాపకుడు ఖాన్ సర్ కోచింగ్ సెంటర్‌పై మంగళవారం రాత్రి కొందరు దుండగులు దాడికి తెగబడ్డారు. పాట్నాలోని సంస్థలోకి అక్రమంగా చొరబడిన కొందరు వ్యక్తులు అక్కడ ఉన్న గార్డుపై తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. విపరీతంగా గొడవ చేస్తూ లోపల ఉన్న వస్తువులను, ఆస్తులను ధ్వంసం చేశారు. గాయపడిన సెక్యూరిటీ గార్డు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి జరిగిన విషయం తెలియగానే ఖాన్ సర్ రాత్రి 11:30 గంటల సమయంలో కోచింగ్ సెంటర్‌కు చేరుకున్నారు. కొందరు సంఘ విద్రోహ శక్తులు లోపలికి వచ్చి గార్డును కొట్టారని, ఆఫీస్ వస్తువులు ధ్వంసం చేశారని చెప్పారు. మొదట అక్కడ కాల్పులు జరిగాయని ప్రచారం జరిగినప్పటికీ పోలీసులు దాన్ని ఖండించారు. కేవలం తోపులాట, వస్తువుల ధ్వంసం మాత్రమే జరిగాయని స్పష్టం చేశారు.

## 'రాష్ట్ర అభివృద్ధిపై జగన్ విషం చిమ్ముతున్నారు'



**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపి రాజధాని అమరావతి, రాష్ట్ర అభివృద్ధిపై వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి విషం చిమ్ముతున్నారని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. జగన్ వైఖరి వల్ల రాష్ట్రానికి పరిశ్రమలు వచ్చే పరిస్థితి లేదని, ఆయన రాష్ట్రాన్ని ఎప్పటికీ అభివృద్ధి చేయనివ్వరని విమర్శించారు. రాజధాని విషయంలో స్థిరత్వం లేకపోవడమే వైసిపి సిద్ధాంతమని మంత్రి సవిత దుయ్యబట్టారు. ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా వదిలేశారని మండిపడ్డారు. "ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన జగన్, ఇప్పుడు మాపనిన్ అంటూ మాట మాట్లాడుతున్నారు. నలుగురు కుటుంబ సభ్యులున్న జగన్ కోసం నాలుగు ప్యాలెస్‌లు నిర్మించుకోవచ్చు కానీ, రాష్ట్రంలోని 5 కోట్ల జనాభా కోసం అంతర్జాతీయ స్థాయి రాజధాని నిర్మించకూడదా?" అని మంత్రి నిలదీశారు. "రాజధానిపై రోజుకో మాట, పూటకో ప్రకటన చేయడం జగన్‌కు అలవాటుగా మారింది. గతంలో అసెంబ్లీ సాక్షిగా అమరావతిని రాష్ట్ర రాజధానిగా స్వాగతిస్తున్నామని జగన్ స్వయంగా చెప్పలేదా?" అని మంత్రి సవిత ప్రశ్నించారు. "మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పుకొనే జగన్.. అధికారంలోకి రాగానే మూడు రాజధానుల డ్రామా తెరపైకి తెచ్చి రాష్ట్రాన్ని విధ్వంసం పాల్పేశారు" అని మంత్రి సవిత మండిపడ్డారు.

# ఏవియేషన్‌లో మహిళలకు ఉపాధి అవకాశాలు

● ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమంలో ఉపాధి పొందిన యువతులతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు



**శ్రీకాకుళం, జూన్ 3 ప్రభాతవార్త:** విమానయాన రంగంలో కూడా మహిళలకు విశేషమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, సరైన రీతిలో శిక్షణ తీసుకుంటే మంచి వేతనాలతో ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయని పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమంలో శిక్షణ తీసుకుని ఉపాధిని పొందిన అయిదుగురు యువతులు తమ నియామక పత్రాలను రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసిన రామ్మోహన్ నాయుడు.. పౌర విమానయాన రంగంలో మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయనే అంశానికి ఈ అయిదుగురు యువతులను బ్రాండ్ అంబాసిడర్లుగా పని చెయ్యాలని పిలుపునిచ్చారు. మహిళలకు ఏవియేషన్‌లో ఉపాధి విప్లవాన్ని అందుబాటులో ఉంచే విధంగా ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమాన్ని రూపొందించారు. రామ్మోహన్ నాయుడు సరిగ్గా ఏడాది క్రితం శ్రీకాకుళం నగరంలోని ఉమెన్స్ కళాశాలలో ఏవియేషన్ అంశంపై వ్యాసరచన కార్యక్రమాన్ని నిర్వహించి అందులో మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన యువతులకు ఏవియేషన్ రంగంలోని పలు విభాగాల్లో శిక్షణను హైదరాబాద్‌లో ఇప్పించారు. ఏవియేషన్ రంగంలోని టికెటింగ్, కస్టమ్స్, కార్గో, క్యాబిన్ క్రూ, ఇతర విభాగాల్లో పూర్తి స్థాయి శిక్షణను అందించారు. ఈ శిక్షణను అయ్యే ఖర్చును కూడా ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తూ పూర్తి స్థాయిలో వారిని ఉద్యోగాలను సిద్ధం చేశారు. ఏవియేషన్‌లోని పలు విభాగాల్లో పూర్తి స్థాయి తర్ఫీదు అనంతరం ఉద్యోగాలను సంపాదించిన ఆ అయిదుగురు యువతులు మంగళవారం నాడు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన స్వగృహంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపిక సమయం నుండి శిక్షణ, ఉద్యోగం పొందే వరకు ఎదురైన అనుభవాలను వారిని అడిగి తెలుసుకున్నారు. శ్రీకాకుళం ప్రతిభను చాటారంటూ మెచ్చుకుంటూనే భవిష్యత్‌లో ఉమెన్ ఇన్ ఏవియేషన్ కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్లుగా ఉండాలని కోరారు. మహిళలు ఏవియేషన్ విభాగంలో అనేక ఉపాధి అవకాశాలు సిద్ధంగా ఉన్నాయని, ఆ దిశగా అందరు అవగాహన తెచ్చుకుని తమ లక్ష్యాలను నిర్దేశించుకోవాలని రామ్మోహన్ నాయుడు కోరారు. కాగా ఉద్యోగాలు పొందిన అయిదుగురు యువతులు త్వరలోనే హైదరాబాద్ కేంద్రంగా తమ విధులను నిర్వర్తించనున్నారు.

## పేర్ని నోరు అదుపులో ఉంచుకో

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్

● దమ్ముంటే గన్నవరంలో పోటీచేయాలని సవాల్



**గన్నవరం(కృష్ణా), జూన్ 3 ప్రభాతవార్త:** గత కొంతకాలంగా అవాకులు చవాకులు పేలుతున్న మాజీమంత్రి పేర్ని నాని తన నోటిని అదుపులో ఉంచుకోవాలని, మంచితనాన్ని చేతగాని తనంగా భావిస్తే తగిన శాస్తి జరుగుతుందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ హెచ్చరించారు. బుధవారం పెనమలూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ గన్నవరం, గుడివాడ ఎమ్మెల్యేలు దివాళా తీసారంటూ పేర్ని నాని వ్యాఖ్యలు చేయటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. తాను వందల కోట్ల పన్నులు చెల్లించేస్థాయిలో ఉన్నానని మైనేటా వెబ్‌సైట్‌లో తన ఆస్తుల వివరాలు పరిశీలించుకోవచ్చున్నారు. 2014 ఎన్నికల సమయంలో ఎన్నికల్లో పోటీచేసేందుకు డబ్బులు లేవన్న పేర్నికి ఇప్పుడు ఇంత సంపద ఎలా వచ్చిందని సూటిగా ప్రశ్నించారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా దోచుకుని కోట్లు కూడబెట్టావని ఆరోపించారు. గుడివాడ, గన్నవరం అభ్యర్థులను మారుస్తున్నారంటూ చంద్రబాబు నీకు చెప్పాడా అని ప్రశ్నించారు. నోటికి వచ్చినట్లు వాగటం సరికాదని హితవు పలికారు. నీలాగా ప్రజల సొమ్ముతో, అక్రమ సంపాదనతో ఎన్నికల్లో పోటీచేయలేదని కష్టార్జితం ఖర్చుచేసి ఎన్నికల్లో పోటీచేస్తే ప్రజలు ఆదరించి అక్కున చేర్చుకున్నారని యార్లగడ్డ వివరించారు. రాజకీయాల నుండి రిటైర్ అయిపోయానని ప్రకటించిన నాని ఇప్పుడు రాజకీయాలు ఎందుకు మాట్లాడుతున్నాడని నిలదీశారు. వచ్చే ఎన్నికల్లో గన్నవరం నుండి తానే టిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తానని, దమ్ముంటే తనపై పోటీకి సిద్ధం కావాలని పేర్నికి సవాల్ విసిరారు. బ్రిటీష్ హాయాంలో అభివృద్ధి చెందిన బందరును నువ్వు మంత్రిగా ఉన్నప్పుడు ఏం అభివృద్ధి చేసావని ప్రశ్నించారు. మీవల్లే జగన్‌కు 11సీట్లకు పరిమితమయ్యారని, ఇలాగే వాగుతుంటే ఈసారి అవి కూడా రావని యార్లగడ్డ వెంకట్రావ్ ఎద్దేవా చేసారు.

## బయోడీగ్రేడబుల్ ఉత్పత్తులను వినియోగించాలి

● స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్




చాంబర్‌ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో కొమ్మారెడ్డి పట్టాభిరామ్

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణకు బయోడీగ్రేడబుల్ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించాలని స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు విజ్ఞప్తి చేసారు. విజయవాడ బందరురోడ్‌లోని ఛాంబర్‌ఆఫ్ కామర్స్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ప్రోత్సహించటం, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలను బలోపేతం చేయటం, ప్రజలో ్ల అవగాహన పెంచటం, హరిత ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్‌ఎంఇలకు అవకాశాల సృష్టించటం వంటి అంశాలపై చర్చలు జరిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ఛాంబర్‌ఆఫ్ కామర్స్‌లోని 40వేల మంది వ్యాపారులు ప్రతిరోజూ ఏదోక రూపంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ బయోడిగ్రేడబుల్ ఉత్పత్తులను వినియోగించాలని పట్టాభి ఈసందర్భంగా సూచించారు. బయోడీగ్రేడబుల్ ఉత్పత్తుల తయారీదారులకు ముడిసరుకును స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా సరఫరా చేస్తామని, ఉత్పత్తుల మార్కెటింగ్ బాద్యతను మెప్మా, సెర్ప్ ద్వారా డ్వాక్రా గ్రూప్‌లు, మహిళా సంఘాలకు అప్పగిస్తామన్నారు. తద్వారా మహిళలు ఆర్థికంగా బలపడే అవకాశం కలుగుతుందన్నారు. స్వయం అనే బ్రాండ్‌పేరుతో ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించనున్నట్లు ఆయన వివరించారు. ఛాంబర్ అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ స్వయం ప్రాజెక్టుతోపాటు స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ చేపట్టే ఇతర కార్యక్రమాలకు ఛాంబర్ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ప్రధాన కార్యదర్శి రావూరి సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ బి.రాజశేఖర్, మెప్మా యండి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు విద్యుత్ సమస్యలను రానివ్వొద్దు

● సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్‌పిడిసిఎల్ పరిధిలో పరిశ్రమలకు విద్యుత్ సమస్యలను రానివ్వకూడదని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి అధికారులు, సిబ్బందికి సూచించారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఎస్‌పిడిసిఎల్ సంస్థ పరిధిలో శివశంకర్ లోతేటి బుధవారం వినియోగదారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ పరిధిలోని 9 జిల్లాల పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులు తమ విద్యుత్ సమస్యల పరిష్కారానికై ప్రతినెలా మొదటి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమస్యలను పరిష్కరించుకునేందుకు ఎపి ఎస్‌పిడిసిఎల్ అవకాశం కల్పిస్తోంది. ఎపి ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి 10 మంది పారిశ్రామిక వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలపై చర్చిస్తూ, పరిశ్రమలకు నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఎండి శివశంకర్ లోతేటి మాట్లాడుతూ పారిశ్రామిక విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేయడం ద్వారా పారిశ్రామిక రంగం అభివృద్ధికి ఎస్‌పిడిసిఎల్ కృషి చేస్తోందని తెలిపారు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. పారిశ్రామిక విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సంస్థ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు. చిత్తూరు సమీపంలోని గంగ్రాజుపల్లి పారిశ్రామికవాడ నుంచి అల్లూరయ్య మాట్లాడుతూ తమకు దగ్గరలో సబ్‌స్టేషన్ లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలియజేయగా ఈ అంశంపై సిఎండి స్పందిస్తూ గంగ్రాజుపల్లె పారిశ్రామికవాడకు ప్రత్యేకంగా సబ్‌స్టేషన్‌ను మంజూరు చేశామని, నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమవుతాయని వివరించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్/ఫైనాన్స్ (ఎఫ్‌ఎసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు యం.ఉమాపతి, ఎం.మురళి కుమార్, కె.సంపత్‌కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, జగదీష్, పిఆర్‌ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎస్ఐఆర్ నిర్వహించండి

● జిల్లా కలెక్టర్లకు సిఎస్, ఎస్ఇసి దిశానిర్దేశం

**తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** బుధవారం అమరావతి సచివాలయం నుండి ఓటరు జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్ 2026) కార్యక్రమం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించగా తిరుపతి జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ మాట్లాడుతూ, ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు మరియు అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించాలని సూచించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తిరుపతి జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్ఐఆర్ 2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను గడువులోగా పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితా వివరాల ను కచ్చితంగా డూప్లికేట్ నమోదు గుర్తింపు, చిరునామా మార్పులు, చేర్పులు మరణించిన, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను బిఎల్‌ఒలు ఇంటింటికి వెళ్లి సర్వే కార్యక్రమాన్ని పగడ్బందీగా నిర్వహిస్తున్నారని తెలిపారు. బూత్ స్థాయి అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన చేపట్టి ఓటరు జాబితాల నాణ్యతను మరింత మెరుగుపరిచే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

## కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేస్తా



**బుచ్చి (నెల్లూరు), జూన్ 3, ప్రభాతవార్త:** దాతల సహాకారంతో కూరగాయాల మార్కెట్‌ను ఏర్పాటు చేసుకున్నాం. చిన్నచిన్న సమస్యలు ఉంటాయి వాటిని పరిష్కరించుకుందాం అని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూరగాయాల మార్కెట్ వ్యాపారస్తులకు నచ్చచెప్పారు. బుధవారం కూరగాయాల మార్కెట్‌ను పరిశీలించిన సందర్భంగా ఆమె వ్యాపారస్తులను సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అమ్మ ఒక్కరూం కూడా కిటికిలు లేవు.. అసలు గాలి ఆడడం లేదు.. కొద్ది మందికి మాత్రమే వ్యాపారాలు జరుగుతున్నాయి మిగిలిన వారికి జరగడం లేదు.. గతంలో మార్కెట్‌లోకి రాకముందే బాగున్నింది అని ఎమ్మెల్యే ముందు కూరగాయాలు అమ్ముకునే మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ, టౌన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, కమీషనర్ చిన్నబాబు, జొన్నవాడ దేవస్థానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, సీనియర్ నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, నీటి సంఘం అద్యక్షులు బత్తల హరికృష్ణా, కౌన్సిలర్ బెల్లం మల్లారెడ్డి, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్వీ ప్రాచ్య కళాశాలలో ప్రవేశాల సందడి

● సంస్కృతం, తెలుగు, హిందీ, టూరిజం కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న వేంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. భారతీయ సంస్కృతి, సాహిత్యం, భాషా వైభవాన్ని అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఇది ఒక సువర్ణావకాశమని కళాశాల యాజమాన్యం తెలిపింది. బి.ఏ. (ఓ.ఎల్.) డిగ్రీ కోర్సులో తెలుగు, సంస్కృతం, హిందీ, టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ విభాగాలలో ఆన్‌లైన్ ద్వారా ప్రవేశాలు పొందవచ్చు. అలాగే ప్రీడిగ్రీ (ఇంటర్ మీడియట్‌కు సమానం) కోర్సులో సంస్కృతం, తెలుగు, హిందీ విభాగాలలో కూడా అడ్మిషన్లు జరగనున్నాయి. ప్రవేశం పొందిన విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా ఉచిత హాస్టల్ సదుపాయం కల్పించబడుతుంది. అదనంగా ఉచిత భోజన వసతి కూడా అందుబాటులో ఉంటుంది.

**అర్హతలు:** రెండేళ్ల ప్రీడిగ్రీ కోర్సులకు 18 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన విద్యార్థులు అర్హులు. మూడేళ్ల డిగ్రీ కోర్సులకు 21 సంవత్సరాల లోపు వయస్సు కలిగి, ప్రీ డిగ్రీ, ఇంటర్‌మీడియట్ లేదా తత్సమాన విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్ 17, 2026 నుండి సంబంధిత విద్యార్హతల ధ్రువపత్రాలతో కళాశాలలో నేరుగా ప్రవేశాలు పొందవచ్చు. కె.టి. రోడ్డులోని ఎస్వీ ప్రాచ్య కళాశాల కార్యాలయంలో 25 రూపాయలు చెల్లించి దరఖాస్తు ఫారాలు పొందవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తులను జూలై 31, 2026 లోపు సమర్పించాలి. మరిన్ని వివరాలకు 98486 42346, 62818 94208 నంబర్లలో సంప్రదించవచ్చని వేంకటేశ్వర ప్రాచ్య కళాశాల అధికారులు తెలిపారు.

# ప్రజలతో మమేకమై ముందుకు సాగాలి

● కూటమినేతలతో కలసి క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలి: బిజెపి చీఫ్ మాధవ్



**తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంతో పాటు బిజెపి నాయకులు ప్రజలతో మమేకమై ముందుకు సాగాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ సూచించారు. అన్నమయ్య జిల్లా పర్యటన నిమిత్తం బుధవారం మధ్యాహ్నం తిరుపతికి విచ్చేసిన ఆయనకు తిరుపతిలో ఘన స్వాగతం లభించింది. మదనపల్లి నుండి తిరుపతి బైరగిపట్టేడలోని బిజెపి కార్యాలయంకి విచ్చేశారు. ఆయనకు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మాధవ్ వారితో మాట్లాడుతూ 12యేళ్ల మోడీ సుపరిపాలన ప్రతి ఇంటికి చేరేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. మౌలిక వసతుల అభివృద్ధి నుంచి సామాజిక సంక్షేమం వరకు అన్ని రంగాల్లో దేశం పురోగతి సాధిస్తోందని మాధవ్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులకు స్వాగతం పలికిన వారిలో బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, బిజెపి నార్త్ మండల అధ్యక్షుడు లోక ప్రభాకర్ నాయుడు, బిజెపి సెంట్రల్ మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వరప్రసాద్, బిజెపి నాయకులు పురుషోత్తం నాయుడు, నరేష్ కుమార్ రెడ్డి, బాబు, మల్లారపు రవి, ప్రసాద్, వేదవతి రాయల్, తేజోవతి, డాక్టర్ శ్రీధర్ ముని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకుడు కోమటిగుంట్ల శివని పరామర్శించిన మేకపాటి శాంతికుమారి

**నెల్లూరు, జూన్ 3 ప్రభాతవార్త-వైద్యం:** ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు మండలంలో ఉన్న పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకుడు కోమటిగుంట్ల శివని నెల్లూరు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్ పర్సన్ మేకపాటి శాంతి కుమారి బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె కోమటిగుంట్ల శివకు చికిత్స నిమిత్తం రెండు లక్షల రూపాయల ఆర్థిక సాయంను చెక్కు అందజేశారు. ఉదయగిరి నియోజకవర్గం, వరికుంటపాడు మండలం, పెద్దిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోమటిగుంట్ల శివ కందుకూరులో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతూ ఆంధ్ర విద్యార్థి సంఘం ఒంగోలు జిల్లా అధ్యక్షులుగా పని చేస్తున్నారు. శనివారం జరిగిన కత్తి దాడిలో తీవ్ర గాయాలకు గురై ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు.

ఈ విషయం తెలుసుకున్న ఆమె శివని పరామర్శించి, వారి కుటుంబానికి ధైర్యం చెప్పి 2 లక్షలు రూపాయలు చెక్కు అందజేసి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లవరపు అశోక్ రెడ్డి, ఒంగోలు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, విద్యార్థి నాయకులు మోహన్, నాయబ్, బాలు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదంలో బయటపడ్డ అక్రమ గంజాయి రవాణా

● బ్రేక్ డౌన్ అయిన వాహనాన్ని ఢీకొన్న బైకర్ మృతి

**ఒంగోలు (క్రైమ్), జూన్ 3 ప్రభాతవార్త:** ప్రకాశం జిల్లా ఒంగోలు సమీపంలోని దాసరాజుపల్లి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం గంజాయి అక్రమ రవాణా గుట్టును రట్టుచేసింది. ప్రమాద ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఏకంగా ఐదు క్వింటాళ్ల గంజాయి లభించడం కలకలం రేపింది. విశాఖపట్నం నుంచి తమిళనాడుకు తరలిస్తున్న గంజాయిని లారీలో తవుడు బస్తాల కింద అత్యంత రహస్యంగా దాచిపెట్టి రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం, గంజాయి తరలిస్తున్న లారీ సాంకేతిక లోపంతో హైవేపై నిలిచిపోయింది. అదే మార్గంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న లోకేష్ అనే యువకుడు నిలిచివున్న లారీని ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని పరిశీలించే సమయంలో అనుమానాస్పద పరిస్థితులు కనిపించాయి. లారీలో ఉన్న తవుడు బస్తాలను తనిఖీ చేయగా వాటి కింద భారీ మొత్తంలో గంజాయి ప్యాకెట్లు దాచిపెట్టినట్లు బయటపడింది. దీంతో పోలీసులు వెంటనే గంజాయిని స్వాధీనం చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. ప్రమాదం కారణంగా అక్రమ సరుకు బయటపడుతుందనే భయంతో లారీ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారైనట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మరో కీలక విషయం కూడా వెలుగులోకి వచ్చింది. గత వారం రోజులుగా తమిళనాడు పోలీసులు ఈ లారీ కదలికలను జిపిఎస్ ద్వారా గమనిస్తున్నట్లు తెలిసింది. గంజాయి రవాణాపై ముందస్తు సమాచారం ఉండటంతో వాహనాన్ని ట్రాక్ చేస్తున్న సమయంలోనే ప్రమాదం జరగడంతో అక్రమ రవాణా గుట్టు బయటపడింది. ఒంగోలు పోలీసులు, తమిళనాడు పోలీసులు సంయుక్తంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గంజాయి సరఫరా ముఠా, నిర్వాహకులు, రవాణా మార్గాలు, ఈ వ్యవహారంలో పాల్గొన్న ఇతర వ్యక్తుల వివరాలను గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. స్వాధీనం చేసుకున్న ఐదు క్వింటాళ్ల గంజాయి విలువ లక్షల రూపాయలు ఉంటుందని అంచనా వేస్తున్నారు. పరారీలో ఉన్న లారీ డ్రైవర్ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. ఘటనపై పూర్తి వివరాలు దర్యాప్తు అనంతరం వెల్లడికానున్నాయి. ఈ ఘటన స్థలాన్ని ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు ఒంగోలు తాలూకా సిఐ టి విజయ్ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పోగొట్టుకున్న బ్యాగ్‌ను అప్పగించిన పోలీసులు



**తిరుమల, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటక రాష్టం హుబ్లీకి చెందిన సునీల్ కుమార్ కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం శ్రీవారి దర్శనం నిమిత్తం తిరుమలకు విచ్చేశారు. దర్శనానికి వెళ్తున్న క్రమంలో పిఎసి–3 సమీపంలో తమ బ్యాగును అనుకోకుండా మరిచి పోయారు. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జి.వి. రావు ఆ బ్యాగును గుర్తించి పరిశీలించగా, అందులో కుటుంబ సభ్యుల వివరాలతో పాటు సుమారు 30 గ్రాముల విలువైన సుమారు రూ.4.50 లక్షలు చేసే బంగారు తాళిబొట్టు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బ్యాగులో లభించిన వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులను గుర్తించి, వారిని సంప్రదించి బ్యాగును సురక్షితంగా వారికి అప్పగించారు. తమ విలువైన వస్తువులు తిరిగి లభించినందుకు సునీల్ కుమార్ వారి కుటుంబ సభ్యులు ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ జి.వి.రావుకి, అలాగే తిరుమల ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఢిల్లీలో అగ్ని ప్రమాదంపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీలో ఓ రెస్టారెంట్ జరిగిన ఘోర అగ్ని ప్రమాద ఘటనపై వైసిపి అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఏకంగా 21 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాదం కారణంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అగ్నిప్రమాద బాధితుల్లో విదేశీయులు ఉన్నట్లు వస్తున్న వార్తలు మరింత కలచివేస్తున్నాయని జగన్ తెలిపారు.

## పేదలపక్షాన నిలబడితే అరెస్టులా!

● వైసిపి నేతల నిరసనను అడ్డుకున్న పోలీసులు



**తిరుపతి, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** యేళ్ళుతరబడి అలిపిరి వద్ద పలు రకాలుగా తోపుడుబండ్లు పెట్టుకుని వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న పేదవారిని తొలగించి అరకు కాఫీ దుకాణానికి అనుమతించడం పట్ల వైసిపి తీవ్ర వ్యతిరేకత తెలిపింది. పేదలపక్షాన నిలబడి వారికి న్యాయం చేయడానికి వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో బుధవారం అలిపిరి వద్దకు చేరుకున్నారు. తిరుపతి సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, నాయకులు పసుపులేటి సురేష్, వాసు యాదవ్, దినేశ్‌రాయల్, ఉదయ్‌వంశీ, సాయి రాకేశ్, ఇమ్రాన్, దినేశ్, అనిల్, రాజేశ్, అజయ్, మహి, మహిళలు అలిపిరి వద్ద ధర్నాకు దిగారు. పేదవారిని అక్కడ నుండి తొలగించి వారి కడుపులు కొట్టారని ఆరోపించారు. పేదవారి స్థలాలను నిర్వీర్యంచేసి ఆ చోట అరకుకాఫీ పెట్టాలని చూడటం ఓ కూటమిపార్టీ టిడిపి శాప్స్ చైర్మన్ రవినాయుడుకు వత్తాసు పలకడమేనని ఆరోపించారు. కూటమి నేతల అప్రజాస్వామ్యం చర్యలు పై భూమన అభినయ్ రెడ్డి నేతృత్వంలో అలిపిరి జూపార్క్ రోడ్ వ్యాపారులకు మద్దతుగా క్షేత్ర స్థాయిలో నిరసనకు దిగారు. అయితే తిరుపతిలో పోలీస్ యాక్టు 30 అమలులో ఉన్నందున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలను అడ్డుకునేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. అక్కడ ఎలాంటి నిరసనలు చేయరాదని వైసిపి నేత అభినయ్‌రెడ్డి, రవిచంద్రారెడ్డి, సురేశ్ తదితరులకు నోటీసులు ఇచ్చారు. అప్పటికీ అక్కడ పరిస్థితి చేయితప్పడంతో పోలీసులు బలవంతంగా వైసిపి నేతలను అరెస్ట్ చేశారు. వారందరినీ అలిపిరి పోలీస్ స్టేషన్ కు,ఎస్వీయూ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఎస్వీ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ నుంచి భూమన అభినయ్ రెడ్డికి 41 ఏ నోటీసులు ఇచ్చి పంపించారు. అలిపిరి జూపార్క్ రోడ్‌లో తొలగించిన చిరు వ్యాపారులకు అదే ప్రాంతంలో కొనసాగించాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు.



జిల్లాస్థాయి శిక్షణా కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఎన్‌టిఆర్ కలెక్టర్ లక్ష్మీశా

## చిన్నారుల వికాసానికి 'నవచేతన'

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త:** ఆరేళ్ళలోపు చిన్నారుల ఎదుగుదలను పరిశీలించేందుకు నవచేతన కార్యక్రమం చేపడుతున్నట్లు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా తెలిపారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో నవచేతన కార్యక్రమంపై మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఉదయం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారుల్లో ఎదుగుదల ఆలస్యాలను, వైకల్యాలను ప్రారంభదశలోనే గుర్తించి వారికి తక్షణ సహాయక సేవలు అందించేందుకు ప్రభుత్వం నవచేతన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారిత మొబైల్, డిజిటల్ టూల్స్ ద్వారా పిల్లల ఎదుగుదల స్థాయిని అంచనా వేస్తారని చెప్పారు. చిన్నారులు మానసిక, శారీరక, భాషా, సామాజిక, స్వయం సహాయక నైపుణ్యాలను పరిశీలించి సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. పిల్లల ప్రవర్తన, మాట, కదలికలను పరిశీలించి డేటాను యాప్‌లో నమోదు చేస్తారన్నారు. తల్లిదండ్రులకు అవగాహ కల్పిస్తూ అవసరమైన పిల్లలను వైద్య, ఇతర నిపుణుల వద్దకు రిఫర్ చేస్తారని కలెక్టర్ వివరించారు. పిల్లల జీవితంలో మొదటి వెయ్యిరోజులే కీలకమని, మొదటి మూడేళ్ళలో మెదడు 80శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎదుగుదల సమస్యలను ప్రారంభంలోనే గుర్తించటం వల్ల సత్వరమే సరైన చికిత్స అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయశాఖల అధికారులు, సిబ్బంది కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ అధికారి రుక్సానా సుల్తానా బేగం, డియంహెచ్‌ఓ డాక్టర్ జె.ఇందుమతి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శరత్, ఆర్‌బిఎస్‌కెపిఒ డాక్టర్ జి.మాధవీనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### ఒడిశా టు బెంగళూరు వయా చిత్తూరు

## అక్రమంగా గంజాయి రవాణా

- రూ.16.88 లక్షల విలువైన గంజాయి స్వాధీనం
- ఇద్దరు అంతర్‌రాష్ట్ర నిందితులు అరెస్టు



**చిత్తూరు, జూన్ 3 ప్రభాతవార్త:** ఒడిశా రాష్ట్రం నుండి కర్నాటక రాష్ట్ర రాజధాని బెంగళూరుకు జోరుగా గంజాయి అక్రమ రవాణా సాగుతోంది. ఒడిశా రాష్ట్రం నుండి గంజాయి స్మగ్లర్లు విశాఖ, విజయవాడ మీదుగా తిరుపతి అక్కడి నుండి చిత్తూరు మీదుగా బెంగళూరుకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్యకు గంజాయి అక్రమ రవాణాపై పక్కా సమాచారం అందడంతో మంగళవారం ఇన్స్‌పెక్టర్ వి.శ్రీధర్‌నాయుడు పర్యవేక్షణలో ఎస్ఐ ఈశ్వరయ్య, డిప్యూటీ తహసిల్దారు జయంతి, పోలీసు సిబ్బంది వరిగిపల్లి జంక్షన్ నుండి బ్యాన్స్ హోటల్ మధ్య వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక కారులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అరల్లో చాకచక్యంగా పెద్ద ఎత్తున దాచిపెట్టిన 39.6 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఒడిశా రాష్ట్రం మాల్కన్‌గిరి జిల్లా, ఒర్కల్ మండలం, తర్లకోట బానూర్ గ్రామంకు చెందిన దీక్షిత్ సుక్రిత్(22), ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నందనూర్ తాలుకా బదేల్ గ్రామంకు చెందిన మురళీధర్ బురడీ(33)లను ఎస్ఐ ఈశ్వరయ్య అరెస్టు చేశారు. డిఎస్పీ వెంకట నారాయణ మాట్లాడుతూ నిందితులు ఒడిశా రాష్ట్రం నుండి గంజాయిని అక్రమంగా ఆంధ్రప్రదేశ్ మీదుగా కర్నాటక రాష్ట్రంకు తరలించి అక్కడ ఒక కేజీ గంజాయి రూ.30 వేలకు విక్రయిస్తారని తెలిపారు. ఈ అక్రమ రవాణా ముఠాలో మరికొంతమంది ప్రమేయం వుందని తేలడంతో వారిని గుర్తించి అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాల వ్యాపారంపై పోలీసులకు ఎలాంటి రాజీ వుండదని, ఇలాంటి నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ హెచ్చరించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల సమాచారం ఎవ్వైనా వుంటే నిర్భయంగా పోలీసులకు అందించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సమావేశంలో వెస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్ నాయుడు, యాదమరి ఎస్ఐ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి పోలీసుల వినూత్న ప్రయోగం

- ఎన్‌డిపిఎస్ కిట్లతో గంజాయి రాయుళ్ళకు పరీక్షలు



**సూళ్లూరుపేట, జూన్ 3 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పోలీసు శాఖ ఎస్పీ ఎల్ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో కీలక పురోగతి సాధించింది. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో సూళ్లూరుపేట సీఐ ఎం. మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గంజాయి సేవించిన ఆరుగురు వ్యక్తులు పోలీసులకు పట్టుకొన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్న నేపథ్యంలో అధునాతన (ఎన్‌డిపిఎస్) కిట్లను ఉపయోగించి అనుమాని తులకు శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో మూత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల్లో ఆరుగురు వ్యక్తులు గంజాయి సేవించినట్లు పాజిటివ్‌గా తేలడంతో వారిని వెంటనే అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పట్టుబడిన వ్యక్తులను విచారిస్తున్న అధికారులు, వారికి గంజాయి ఎక్కడి నుంచి అందుతోంది, ఎవరు సరఫరా చేస్తున్నారు, వారి వెనుక ఏదైనా ముఠా పనిచేస్తుందా అనే కోణాల్లో లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు పోలీస్‌శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ ప్రాంతాలతో పాటు పరిశ్రమల పరిసరాల్లో కూడా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్సై అజయ్ కుమార్, తడ ఎస్ఐ కొండప నాయుడు సూళ్లూరుపేట రూరల్ ఎస్సై సుబ్రమణ్య రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదంలో గాయపడ్డ ఉద్యోగి మృతి

**కోవూరు (నెల్లూరు), జూన్ 3, ప్రభాతవార్త:** కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని అమరాన్ బ్యాటరీ సమీపంలో మంగళవారం రాత్రి నెల్లూరు నుంచి కోవూరుకు స్కూటీలో వస్తున్న సోమశిల ప్రాజెక్టు ఆఫీస్‌లో స్టెనోగా పనిచేస్తున్న తిరుమలశెట్టి మల్లికార్జున రావు అడ్డుగా కుక్క రావడంతో రోడ్డుపై పడి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముత్యాలరావు తెలిపారు.

# అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- అన్ని బిల్లులు ఆన్‌లైన్‌లో ఉంచాలి
- పురపాలక శాఖ మంత్రి నారాయణ



**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి పొంగులేటి నారాయణ అధికారులను కోరారు. విజయవాడలోని మురళీఫార్చ్యూన్ హోటల్‌లో బుధవారం మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా ప్రాజెక్టుల అమలులో అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరిస్తూ, కేటాయించిన పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాధాన్యమిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇంజనీరింగ్ పనుల్లో ఎదురవుతున్న భూ, సాంకేతిక, ఏజెన్సీ సమస్యల పరిష్కారం కోసమే ఈ వర్క్‌షప్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న ఇంజనీర్లతో ప్రతి 15రోజులకు జోన్‌ల వారీగా సమీక్ష సమావేశాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 2019లో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఏఐఐబి) ద్వారా రూ.5,350 కోట్లు నిధులు మంజూరు కాగా గత ప్రభుత్వం వాటిని వినియోగించుకోలేదని మంత్రి తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పోరేషన్ ద్వారా మంజూరైన రూ.3 వేల కోట్లతోపాటు ఇతర ప్రాజెక్టులను గత ప్రభుత్వం ఉపయోగించుకోలేదన్నారు. స్వచ్ఛాంధ్ర, గ్రీన్ కార్పోరేషన్ కార్యక్రమాలకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. మురుగునీటి శుద్ధి ప్రక్రియలో పూర్తిపారదర్శకత పాటించాలని, ప్రతి రూపాయి ఖర్చును ఆన్‌లైన్‌లో ఉంచాలని ఆదేశించారు. మురుగునీటిని శుద్ధిచేసేందుకు ఎస్‌టిపి ప్లాంట్ల ఏర్పాటును వేగవంతం చేయాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ల ఏర్పాటుకు నెల్లూరు, విజయవాడలో నిధులు మంజూరయినట్లు చెప్పారు. రాష్ట్రంలో కొత్తగా 70 అన్నాక్యాంటిన్‌లు ఏర్పాటు చేసామని, మరో 5క్యాంటిన్‌లను పదిరోజుల్లో ప్రారంభం కానున్నట్లు మంత్రి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 153లక్షల టన్నుల వ్యర్థాల్లో 128టన్నుల వ్యర్థాలను తొలగించామని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి తమకు అప్పగించిన పనులను పూర్తి చేయాలని నారాయణ ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎపియుడిఐఎఫ్‌సి చైర్మన్ పిలా గోవింద సత్యనారాయణ, యండి. డాక్టర్ పి.సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎపి కేబినెట్ భేటీ

- అమరావతి అభివృద్ధి, కీలక విధాన, నిర్ణయాలపై ఫోకస్

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం నేడు సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరగనుంది. ఈ సమావేశంలో రాజధాని అమరావతి అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన, పలు విధానపరమైన నిర్ణయాలు భూ కేటాయింపులు తదితర కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అమరావతిలో హైకోర్టు భవనాల పరిసరాల్లో రూ.547 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల కల్పనకు కేబినెట్ ఆమోదం తెలపనున్నాట్లు సమాచారం. అలాగే ఏపీసీఆర్డీఏ బిల్డింగ్ ట్రైబ్యునల్ ఏర్పాటు ప్రతిపాదనకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉంది. రాజధాని ప్రాంత అభివృద్ధిలో భాగంగా తొమ్మిది జిల్లాల పరిధిలో అమరావతి ఎకనామిక్ రీజియన్‌కు సంబంధించి ఆర్ఎఫ్పీ ప్రక్రియకు ఆమోదం లభించే అవకాశం ఉంది. సీఆర్డీఏకు సొంత అగ్నిమాపక విభాగాన్ని ఏర్పాటు చేయడంపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో పిపిపి విధానంలో డిజైన్- బిల్డ్- ఆపరేట్- ట్రాన్స్‌ఫర్ మోడల్ ద్వారా అమరావతిలో జాయింట్ అబ్జర్వేషన్ వీల్ నిర్మాణానికి కేబినెట్ ఆమోదం తెలపనుంది. ఈ ప్రాజెక్టు రాజధాని ప్రాంతానికి ప్రత్యేక ఆకర్షణగా మారే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎల్పీఎస్ లేఅవుట్లలో వీధిపోట్లు ఉన్న ప్రాంతాల్లో ఏటీఎంలు, కియస్కులు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం, సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను పిపిపి లేదా జాయింట్ వెంచర్ విధానంలో ఏర్పాటు చేయడం వంటి అంశాలు కూడా సమావేశంలో చర్యకు రానున్నాయి. నేగోషియబుల్ సెటిల్మెంట్ పాలకీ కింద అనువుగా లేని ప్లాట్లకు గ్రామకంఠంతో ఐదు సెంట్ల వరకు భూమి కేటాయింపుకు ఆమోదం తెలిపే అవకాశముంది. అలాగే రాజధాని ప్రాంతాలో డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టిమ్ ఏర్పాటుకు సంబంధించిన టాబ్రీడ్ ఒప్పందాన్ని రద్దు చేసి, కొత్తగా టెండర్లు పిలిచే అంశంపై కూడా కేబినెట్ నిర్ణయం తీసుకోనుంది. ఎల్పీఎస్ లేఅవుట్లలో 485 మంది రైతుల అలాట్‌మెంట్ కోడ్‌లు మారిన నేపథ్యంలో వారికి రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు కల్పించే ప్రతిపాదనపై కూడా చర్చించి ఆమోదం తెలుపనున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా పలు సంస్థలకు భూ కేటాయింపుల అంశం కూడా మంత్రివర్గ సమావేశంలో ప్రాధాన్యం పొందనుంది. సామాజిక సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా తల్లికి వందనం పతకానికి నిధులు విడుదలపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ పతకం అమలుకు అవసరమైన ఆర్థిక వనరులపై మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఇక రాజకీయ పరంగా కూడా సమావేశం ప్రాధాన్యం సంతరించకుంది. కూటమి ప్రభుత్వం పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించే అవకాశం ఉంది. అలాగే రెండేళ్ల కూటమి పాలనలో చేపట్టిన కార్యక్రమాలు, రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై కూడా పరీక్ష నిర్వహించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# మహిళల, బాలల అక్రమ రవాణాను అడ్డుకుంటాం

- మంత్రులు అనిత, సంధ్యారాణి

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** మహిళల బాలల అక్రమ రవాణాను తీవ్ర స్థాయిలో అడ్డుకుంటామని హోం మంత్రి వంగలపూడి అనిత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పష్టం చేశారు. స్త్రీలు పిల్లల జోలికి వచ్చిన వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయ 3వ బ్లాక్, 1వ అంతస్తు కాన్ఫరెన్స్ హాల్‌లో కీలక సమావేశంలో మంత్రివర్యులు గుమ్మిడి సంధ్యారాణి, హోంమంత్రి వంగలపూడి అనిత సంయుక్తంగా నిర్వహించారు. మహిళలు చిన్నారుల భద్రత మరియు రక్షణకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో బాలల రక్షణ వ్యవస్థల బలోపేతంపై అధికారులతో చర్చించారు. రాష్ట్రంలో బాలల అక్రమ రవాణా, తప్పిపోయిన పిల్లలు, విడిపిచెట్టిబడిన పిల్లలు, యాచకులుగా జీవిస్తున్న చిన్నారులు మరియు ఇతర ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న పిలలల గుర్తింపు, రక్షణ, పునరావాస చర్యలపై ప్రత్యేక దృష్టి సారించారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, హోంశాఖల సమన్వయంతో వన్ స్టాప్ సెంటర్లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని బాధిత మహిళలు, చిన్నారులకు వేగవంతమైన సహాయ సేవలు అందిస్తున్నాయని మంత్రులు తెలిపారు. మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ చేపడుతున్న కార్యక్రమాలను హోమ్ శాఖతో కలిసి సామాన్యం చేసుకోవాలని సమీక్ష చేపట్టారు. శాఖల మధ్య సమన్వయాన్ని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయిలో సేవల అమలు వేగవంతం చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల భద్రత, సంక్షేమం ప్రభుత్వం ప్రధాన ప్రాధాన్యత అని మంత్రులు స్పష్టం చేశారు.

### కొవ్వూరు, నిడదవోలు, మండపేట ఆసుపత్రుల్లో

# రూ.5.63 కోట్లతో అదనపు సౌకర్యాలు

- ఆమోదించిన వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** గోదావరి పుష్కరాల్లో భారీ స్థాయిల్లో పాల్గొనే ప్రజల వైద్యావసరాల నిమిత్తం స్తానికంగా ఉన్న 3 సెకండరీ ఆసుపత్రులను అభివృద్ధి చేయ డానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దిశగా కొవ్వూరూ లోని ప్రాంతీయ ఆసుపత్రి నిడదవోలు మరియు మండపేట లోని కమ్యూనిటీ మెల్త్ సెంటర్లలో అదనపు నిర్మాణాలు, సౌకర్యాల కోసం రూ.5.63 కోట్ల వ్యయంతో ప్రణాళికను వైద్యారోగ్య శాఖ మంత్రికి సత్యకుమార్ యాదవ్ బుధవారం నాడు ఆమోదించారు. పుష్కరాల్లో పవిత్ర స్నానాలు చేసేందుకు భారీగా రానున్న ప్రజల అవసరాల మేరకు ఈ మేడు ఆసుపత్రులను తగు రీతిని అభివృద్ధి చేయాలని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ చేసిన విన్నపంపై ఉన్నతాధికారులతో చర్చించిన మంత్రి సత్యకుమార్ వివిధ ప్రతిపాదనలు సమ్మతి తెలిపారు. మండపేట సీహెచ్‌సీ అభివృద్ధి కోసం రూ.3.75 కోట్లతో పలు పనులు చేపట్టనున్నారు. ప్రస్తుతం 30 పడకలతో నడుస్తున్న ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసే పనిలో భాగా రానున్న పుష్కరాల సందర్భంగా అవసరమైన చర్యల్ని చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే వి.జోగేశ్వరరావు సూచించారు. ఇందులో భాగంగా ఆసుపత్రి భవన రెండవ ఫ్లోర్లనిర్మాణ పనుల్ని పూర్తి చేయడంతో పాటు అనుబంధ నిర్మాణాలు, సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. నిడదవోలు, సీహెచ్‌సీకి సంబంధించి రూ. 1 కో టి ఖర్చుతో అదనపు ఓపి కన్సల్టేషన్ గదులు, 8 టాయిలెట్లు, 270 మీటర్ల మేరకు ప్రహరీ గోడ నిర్మాణం సీసీ రోడ్ల నిర్మాణం, జనరేటర్, బోర్‌వెల్ ఏర్పాటు వైద్య పరికరాలు మరియు ఫర్నీచర్ కొనుగోలు నీరు, విద్యుత్ సరఫరాలకు సంబంధించి పనులు చేపడతారు. కొవ్వూరు ప్రభాత్వాసుపత్రిలో రూ.88 లక్షల ఖర్చుతో దెబ్బతిన్న ఫ్లోరింగ్ మార్పిడి పనులు, డ్రైనేజి వ్యవస్థ అభివృద్ధి పైకప్పు మరమ్మతులు ఆసుపత్రి భవనానికి రంగులు వేయడం కొత్త ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్ ఏర్పాటు బాత్రూరూంలకు మరమ్మతులు, కొత్తవాటి నిర్మాణం, ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు చేపడతారు.

## గురజాడ గురుతులు... సజీవ స్మృతులు

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** పవన్ కల్యాణ్ చొరవతో అభ్యుదయ కవి నివాస గృహ పునరుద్ధరణ. ఆడిటోరియం నిర్మాణానికి రూ1.20 కోట్లతో ప్రతిపాదనలు చేసారు. గురజాడ రచనల డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభించారు. విశాఖ సేనతో డీసీఎం పవన్ కల్యాణ్ సభలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న ఉప ముఖ్యమంత్రి. ఈ మేరకు జనసేన కార్యాలయ వర్గాలు సమాచార ప్రకటన విడుదల చేసాయి. ప్రముఖ సంఘ సంస్కర్త, అభ్యుదయ కవితా పితామహుడిగా పేరుగాంచినగురజాడ అప్పారావు జ్ఞాపకాలను భావితరాలకు అందిస్తా నని ఇచ్చిన హామీని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిలబెట్టుకున్నారు. పురావస్తు శాఖ సహకారంతో 150 ఏళ్ల క్రితం ఆయన నివాసం ఉన్న ఇంటి పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఆ నివాసానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో సాంస్కృతిక శాఖ సహకారంతో రూ.1.20 కోట్లతో ఆడిటోరియం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. దీంతోపాటు గురజాడ అప్పారావు రచనల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా పురావస్తు శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. గురజాడ అప్పారావు నివాస గృహం శిథిలావస్థకు చేరిన విషయాన్ని వార్తా పత్రికల ద్వారా తెలుసుకుని, విశాఖపట్నంలో నిర్వహించిన సేనతో సేనాని సభలో ఆ ఇంటి పునరుద్ధరణతో పాటు ఆడిటోరిజం నిర్మాణం, రచనల డిజిటలైజేషన్‌కు హామీ ఇచ్చారు. విజయనగరం కోట జంక్షన్ సమీపంలోని ఈ నివాస గృహంలోనే గురజాడ అప్పారావు కన్యాశుల్కం రచన చేశారు.

### 3వ విడత భూసర్వే కింద 721 గ్రామాలకు రూ.72,10,000 నిధులు

విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్తప్రతినిధి: ఏపీలో 3వ విడత భూసర్వే కింద 721 గ్రామాలకు రూ.72,10,000 నిధులు (గ్రామానికి రూ.10,000 చొప్పున) విడుదల చేస్తూ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులు వెంటనే వినియోగానికి వస్తాయి. ఏపీలో రెవెన్యూశాఖ భూసర్వేను నిర్వహిస్తుంది.

# దళితులపై అణిచివేతకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తాం

- రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె.ఎస్.జవహర్



**శ్రీ సత్యసాయి జిల్లా, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీ సత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ సమావేశపు హాల్ నందు బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులముల కమిషన్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వారితో పాటు మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్. రాజు, ఐఎఎస్ అధికారి ఎస్. చిన్న రాముడు, కమిషన్ సభ్యులు భిక్షం మేకల, రామాంజనమ్మ, ఇతర కమిషన్ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉదయం 10.00 గంటల నుండి పిజిఆర్ఎస్ హాల్ నందు ప్రజల నుండి నేరుగా సమస్యలపై అర్జీలను స్వీకరించే కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుండి వచ్చిన దళితులు, వివిధ వర్గాల ప్రజల నుండి దాదాపు 170 వినతులు/అర్జీలను కమిషన్ చైర్మన్, సభ్యులు స్వయంగా స్వీకరించి, బాధితుల సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 02.00 గంటల నుండి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కమిషన్ చైర్మన్ కే.ఎస్. జవహర్ మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడా దళితుల మీద ఎటువంటి దాడులు, అణచివేతలు జరగకుండా అత్యంత కఠినంగా వ్యవహరిస్తామన్నారు. దళితుల రక్షణకు, హక్కులకు భంగం కలగకుండా చట్టాలను పకడ్బందీగా అమలు పరుస్తామని స్పష్టం చేశారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చూడాలని, ఎస్సీ సబ్ ప్లాన్, ఇతర సంక్షేమ పథకాలు అర్హులకు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో జిల్లా షెడ్యూల్డ్ కులముల సంక్షేమ, సాధికారత అధికారి సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రెడ్డి బాలాజీతో పాటు, జిల్లా, మండల స్థాయికి చెందిన వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిఎస్సీ బాధితులకు అండగా ఉంటాం




**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** డీఎస్సీ నియామక ప్రక్రియల్లో తమకు అన్యాయం జరిగిందంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన అభ్యర్థులకు ఆయన పూర్తి మద్దతు ప్రకటించారు. న్యాయపరంగా పోరాటం చేసే అభ్యర్థులకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అవసరమైన న్యాయ సహాయాన్ని అందించడమే కాకుండా లీగల్ ఖర్చులన్నింటినీ పార్టీ భరిస్తుందని హామీ ఇచ్చారు. అభ్యర్థులతో సమావేశమైన జగన్ మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనపై ఇప్పటికే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశామని గుర్తు చేశారు.

ప్రస్తుతం అన్యాయం జరిగిందని ఆరోపణలు వస్తున్న ప్రతి కేసుపై భవిష్యత్తులో రీ-ఎంక్వైరీ నిర్వహిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపడతామని చెప్పారు. స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై జగన్ ప్రశ్నలు లేవనెత్తారు. పరీక్షలు నిర్వహించకుండా కేవలం సర్టిఫికెట్ల ఆధారంగా ఉద్యోగాలు ఇవ్వడానికి జీవో జారీ చేశారని, నియామకాలు పూర్తయ్యాక అదే జీవోను మార్చి కొత్త జీవో తీసుకువచ్చారని విమర్శించారు. మొదట తీసుకొచ్చిన జీవో ఎవరికోసం, ఎవరికి ప్రయోజనం చేకూర్చడానికి అన్నది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కొందరికి మేలు చేసేలా వ్యవస్థను ఉపయోగించుకుని, పని పూర్తయిన తర్వాత జీవోను ఉపసంహరించుకున్నారని ఆరోపించారు.

క్రీడా కోటా పోస్టుల భర్తీలో పారదర్శక కనిపించడం లేదని జగన్ వ్యాఖ్యానించారు. మొదటి ర్యాంకులు సాధించి అబ్యర్థులకు కూడా ఉద్యోగాలు రాకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. వెరిఫికేషన్ హాజరు కాలేదనే కారణాలు చెబుతున్నప్పటికీ, అదే అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడం వెనుక కారణాలను ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ పరీక్షల నుంచి నియామకాల వరకు అనేక అంశాలు వివాదాస్పదంగా మారాయని జగన్ అన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ ఆరోపణలు నుంచి ఎంపికల వరకు అనేక అంశాలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. అభ్యర్థుల గ్రీవెన్స్‌లకు కూడా సరైన సమాధానాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వం చెబుతున్న వివరాల్లో స్పష్టత, పారదర్శకత లోపించాయని విమర్శించారు. ఇదిలా ఉండగా మీడియాతో మాట్లాడిన డీఎస్సీ అభ్యర్థులు కూడా నియామక ప్రక్రియలో భారీ అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

స్పోర్ట్స్ కోటాలో టెట్, బీఈడీ వంటి అర్హతలు లేకపోయిన కొందరికి ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. 1:1 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలిచినప్పటికీ తమకు ఉద్యోగాలు ఇవ్వలేదని వాపోయారు. అలాగే కొందరు పేర్లు ఎంపికై వారి జాబితలోనూ తిరస్కరించిన వారి జాబితాలోనూ లేకపోవడం అనుమానాలకు తావిస్తోందని తెలిపారు జగన్. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే పోస్టులను స్పోర్ట్స్ కోటా అభ్యర్థులకు కేటాయించామని సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. నేషనల్ గేమ్స్‌లో స్వర్ణ పతకం సాధించిన అభ్యర్థులను కూడా పక్కన పెట్టారని పేర్కొన్నారు. జరిగిన పరిణామాలు, అనుమానాలు, అవకతవకలపై పూర్తి వివరాలను జగన్ దృష్టికి తీసుకెళ్లామని అభ్యర్థులు తెలిపారు. తమ సమస్యలను ఆయన ఓపికగా విన్నారని అసరమైన న్యాయ సహాయం అందిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. భవిష్యత్తులో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జగన్ భరోసా ఇచ్చారని వెల్లడించారు.

### పిడుగురాళ్ల మెడికల్ కాలేజీ కోసం

## అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీ

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** పిడుగురాళ్ల ప్రభుత్వ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన వాక్-ఇన్ రిక్రూట్‌మెంట్ విజయవంతమైంది. డీఎంఈ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో నోటిపై చేసిన 8 పోస్టులన్నీ భర్తీ అయ్యాయి. అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మైక్రో బయాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, డీవీఎల్ విభాగాల్లోని అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల కోసం 79 మంది హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియ అనంతరం ఖాళీలను భర్తీ చేశామని బోర్డు సెక్రటరీ తెలిపారు.

### మద్యం రవాణా వ్యవస్థనూ అక్రమ ఆదాయాలకు వాడినట్లు ఇడి గుర్తింపు

**విజయవాడ, జూన్ 3 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసు రోజుకో మలుపు తిరుగుతుంది, ఈ కేసులో మరో కీలక ఆర్థిక అంశాన్ని ఈడీ గుర్తించింది. మద్యం రవాణా వ్యవస్థనూ అక్రమ ఆదాయాలకు వాడినట్లు ఈడీ గుర్తించింది. పాలసీ అమల్లో వ్యక్తులు, సంస్థలు కలిసి సిండికేట్‌గా పనిచేసినట్లు ఆరోపణలు వచ్చాయి. డిస్టిలరీల నుంచి 20 శాతం వరకు కిక్‌బ్యాక్స్ వసూలు చేసినట్లు గతంలో ఈడీ గుర్తించగా, ఇప్పటివరకు రూ.1,048 కోట్ల కిక్‌బ్యాక్ ట్రైల్‌ను ఈడీ గుర్తించింది. మద్యం రవాణా కాంట్రాక్టులూ సిండికేట్ నియంత్రణలో ఉన్నాయని గుర్తించడం గమనార్హం. ట్రాన్స్‌పోర్ట్ ద్వారా కూడా అక్రమ లాభాలు ఆర్జించినట్లు బయటపడిందని ఈడీ పేర్కొంది. లాజిస్టిక్స్, అధిక బిల్లులు, షెల్ కంపెనీలతో నిధుల మళ్లింపునూ పరిశీలిస్తోంది. రియల్‌ఎస్టేట్, బంగారం, షెల్ కంపెనీలు, ఫ్రంట్ ఎంటిటీలతో మనీలాండరింగ్ చేశారన్నారు. ఇప్పటికే సుమారు రూ.441 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది.

# నార్వే చెస్‌లో ప్రజ్ఞానంద గెలుపు

## దివ్య, గుకేష్ ఓటమి



**న్యూఢిల్లీ:** నార్వే చెస్ 2026 యొక్క ఎనిమిదవ రౌండ్‌లో భారత్ గ్రాండ్ మాస్టర్ ప్రజ్ఞానంద రమేష్‌బాబు మరోసారి మాగ్నస్ కార్ల్‌సెన్‌ను ఓడించి, టైటిల్ రేసుకు మరో ముఖ్యమైన ఫలితాన్ని సాధించాడు. గత వారం తెల్ల పావులతో కార్ల్‌సెన్‌ను ఓడించిన ఈ 20 ఏళ్ల ఆటగాడు, 8వ రౌండ్‌లో నల్ల పావులతో తన విజయాన్ని పునరావృతం చేసి, అదే టోర్నమెంట్‌లో ప్రపంచ నంబర్ 1 ఆటగాడిపై తన రెండవ క్లాసికల్ విజయాన్ని నమోదు చేశాడు. అలాగే ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ దొమ్మరాజుపై అలీరెజా ఫిరౌజ్జా విజయాన్ని సాధించాడు. తెల్ల పావులతో ఆడుతూ, ఉత్కంఠభరితమైన ఎండ్‌గేమ్‌లో ఫిరౌజ్జా కీలకమైన విజయాన్ని దక్కించుకున్నాడు. ఇక నార్వే చెస్ మహిళల 8వ రౌండ్‌లో రెండు నిర్ణయాత్మక క్లాసికల్ గేమ్‌లు, ఒక ఆర్మాగెడాన్ టైబ్రేకర్ జరిగాయి, ఇందులో బిబిసారా అసౌబాయేవా తన ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. దివ్య దేశ్‌ముఖ్‌పై అసౌబాయేవా ఒక ముఖ్యమైన క్లాసికల్ విజయాన్ని సాధించింది. నల్ల పావులతో ఆడుతూ, ఆమె ఒత్తిడిని తట్టుకుని, దివ్యకు సమయం తక్కువగా ఉన్నప్పుడు ఆధిక్యాన్ని సంపాదించి, చివరికి పూర్తి పాయింట్‌ను కైవసం చేసుకుంది. అన్నా ముజిచుక్ మరియు హంపీ కోనేరుల ఆట క్లాసికల్ డ్రాగా ముగిసింది. ఆర్మాగెడాన్ టైబ్రేక్ కూడా హోరాహోరీగా సాగింది, కానీ చివరకు హంపీ కోనేరు నల్ల పావులతో గెలిచి, అదనపు పాయింట్లను సంపాదించారు.

# సెమీస్‌కు భారత్ హాకీ మహిళా జట్టు

## 25-0 తో సింగపూర్ చిత్తు



**న్యూఢిల్లీ:** హాకీ అండర్18 ఆసియా కప్‌లోని పూల్ ఎ చివరి గేమ్‌లో భారత మహిళల జట్టు సింగపూర్‌ను 25-0 తేడాతో చిత్తుగా ఓడించి సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో నౌషీన్ నాజ్ ఏడు గోల్స్ (8, 13, 17, 18, 40, 52, 58) చేసి అగ్రస్థానంలో నిలిచింది. గీతాశ్రీ నమ్మి ఐదు గోల్స్ (13, 28, 47, 48, 60) సాధించగా, కెప్టెన్ స్వీటీ కుజుర్ నాలుగు గోల్స్ (2, 24, 38, 45) జోడించింది. ప్రియాంక మింజ్ హ్యాట్రిక్ (22, 37, 53), దియా (27), నాన్సీ సరోహా (36), శ్రుతి కుమారి (40), పుష్పా మాంఝీ (47), రష్మీన్ కౌర్ (47), సందీప్ కుమారి (47) సందీప్ కుమారి 5 గోల్స్ చేశారు. ఆట ఆరంభంలోనే భారత్ దూకుడును ప్రదర్శించింది. రెండవ నిమిషంలో కెప్టెన్ స్వీటీ గోల్ చేసింది. ఆ తర్వాత ఎనిమిదవ నిమిషంలో నౌషీన్ ఆధిక్యాన్ని పెంచగా, గీతాశ్రీ, నౌషీన్ ఇద్దరూ (13) స్కోరును సమం చేసి, భారత్ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. రెండవ క్వార్టర్‌లో నౌషీన్ 2 గోల్స్ చేయడంతో భారత తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఆ తర్వాత ప్రియాంక, స్వీటీ భారత్ ఆధిక్యాన్ని పెంచడంలో సహాయపడ్డారు. మూడో క్వార్టర్ ఆరంభంలోనే దియా, గీతాశ్రీ గోల్స్ చేయగా, నాన్సీ, ప్రియాంక, స్వీటీ, నౌషీన్, శృతి గోల్స్ సాధించడంతో భారత్ సింగపూర్ రక్షణ శ్రేణిని ఛిన్నాభిన్నం చేసింది. ఆఖరి క్వార్టర్‌లో కూడా భారత్ అదే తీవ్రతను కొనసాగించి, అదనంగా 10 గోల్స్ సాధించింది. స్వీటీ తన 4 గోల్స్, గీతాశ్రీ మరో 3 గోల్స్‌తో మొత్తం 5 గోల్స్ సాధించింది. అలాగే, నౌషీన్ 7 గోల్స్‌తో అద్భుతమైన ప్రదర్శనచేసింది. పుష్ప, రష్మీన్, సందీప, ప్రియాంక కూడా గోల్స్ సాధించారు.

# బరిలో సిరాజ్, తిలక్ వర్మ

## 7న టిజి 20 ప్లేయర్ల వేలం

### 21నుంచి ఉప్పల్ వేదికగా మ్యాచ్‌లు

**హైదరాబాద్, జూన్ 3,ప్రభాతవార్త:** తెలంగాణ క్రికెట్ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరలేస్తూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ ప్లేయర్ల వేలానికి సర్వం సిద్ధమైంది. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఫ్రాంచైజీ ఆధారిత పద్ధతిలో జరగనున్న ఈ లీగ్ ప్రారంభ ఎడిషన్ వేలం పాటను ఆదివారం రామోజీఫిల్మ్ సిటీలోని ప్రిన్సెస్ కన్వెన్షన్ సెంటర్లోనిర్వహించనున్నారు. ఈ లీగ్‌లో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు తలపడనుండగా.. 21 రోజుల పాటు ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో మొత్తం 32 మ్యాచ్‌లు జరగనున్నాయి. 1,300 మంది ఆటగాళ్లు.. వేలంలో స్టార్లు హెచ్‌సీఏలో రిజిస్టర్ అయిన 1,300 మందికి పైగా క్రికెటర్లు ఈ వేలంలో అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. భారత క్రికెట్ జట్టు స్టార్ ఆటగాళ్లు మహ్మద్ సిరాజ్, తిలక్ వర్మల ఈ వేలంలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. వీరితో పాటు రోహిత్ రాయుడు, రాహుల్ బుద్ధి, సి.వి. మిలింద్, తన్మయ్ అగర్వాల్ వంటి సీనియర్ దేశవాళీ ప్లేయర్లు ఫ్రాంచైజీల హాట్ కేక్‌లుగా మారే అవకాశం ఉంది. అండర్-19ప్రపంచ కప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఆరోన్ జార్జ్, ఇటీవల వినూ మన్కడ్ ట్రోఫీ గెలిచిన హైదరాబాద్ యువ జట్టు సభ్యులు కూడా వేలం పూల్‌లో ఉన్నారు. బరిలో మొత్తం 8 ఫ్రాంచైజీ జట్లు పాల్గొననుండగా.. 1.హైదరాబాద్ ఈఛాంపియన్స్ 2.ప్రణవ రంగారెడ్డి రైజర్స్ 3.వరంగల్ వారియర్స్ 4.మెదక్ ఫాల్కన్స్ 5.అనురాగ్ నల్గొండ నైట్స్ 6.కరీంనగర్ డైమండ్స్ 7.పాలమూరు స్ట్రైకర్స్ 8.అన్విత ఖమ్మం ఏసెస్ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో.. ప్రతి ఫ్రాంచైజీ తమ 20 మంది సభ్యుల జట్టులో కనీసం నలుగురు జిల్లా ఆటగాళ్లను చేర్చుకోవాలి. అలాగే తుది జట్టులో కనీసం ఇద్దరు జిల్లా ప్లేయర్లు ఆడటం తప్పనిసరి. టీమిండియా మాజీ ఆటగాడు, హెచ్‌సీఏ క్రికెట్ ఆపరేషన్స్ కమిటీ చైర్మన్ అంబటి రాయుడు నేతృత్వంలోని బృందం నిర్వహించిన ఓపెన్ ట్రయల్స్ ద్వారా ఈ యువ ప్రతిభను వేలం వరకు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించింది. ఈ మెగా లీగ్ మ్యాచ్‌లు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. అన్ని మ్యాచులు ఉప్పల్ స్టేడియంలో జరుగుతాయి.



# అత్యంత క్లిష్టంగా టీమిండియా ఫైనల్

## వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో 7 మ్యాచ్‌లు తప్పక గెలవాల్సిందే

**న్యూఢిల్లీ:** ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరాలనే భారత క్రికెట్ జట్టు కల ఇప్పుడు అత్యంత క్లిష్టమైన దశకు చేరుకుంది. ప్రస్తుత పాయింట్ల పట్టిక సమీకరణాల ప్రకారం టీమ్ ఇండియా కేవలం అద్భుత విజయాలు సాధించడమే కాకుండా, ప్రత్యర్థి జట్ల ఓటములపై కూడా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం భారత జట్టు పరిస్థితి అంత ఆశాజనకంగా ఏమీ లేదు. కేవలం 48.15 శాతం పాయింట్లతో టీమ్ ఇండియా ప్రస్తుతం ఆరో స్థానంలో కొట్టుమిట్టాడుతోంది. ఇంగ్లాండ్, పాకిస్తాన్, వెస్టిండీస్ జట్ల కంటే మాత్రమే భారత్ ముందుంది. ప్రతిష్టాత్మక ఫైనల్ పోరుకు అర్హత సాధించాలంటే, భారత్ తన ముగింపు దశలో ఆడబోయే 9 టెస్ట్ మ్యాచ్‌లలో కనీసం 7 మ్యాచ్‌ల్లో ఖచ్చితంగా విజయం సాధించాల్సి ఉంటుంది. ఇందులో ఏ ఒక్క మ్యాచ్ చేజారినా ఫైనల్ ఆశలు దాదాపు గల్లంతైనట్లే. భారత జట్టు రాబోయే రోజుల్లో మూడు ప్రధాన సవాళ్లను ఎదుర్కోవలసి ఉంది. ముందుగా టీమ్ ఇండియా శ్రీలంక పర్యటనకు వెళ్లనుంది, అక్కడ రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడాల్సి ఉంది. ఆ వెంటనే న్యూజిలాండ్ గడ్డపై మరో రెండు టెస్టుల కఠినమైన సవాలు ఎదురుకానుంది. ఈ రెండు విదేశీ పర్యటనలు ముగిసిన తర్వాత, 2027 ప్రారంభంలో ఆస్ట్రేలియా జట్టు భారత పర్యటనకు రానుంది. భారత్ వేదికగా ఇరు జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ జరగనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ చేరే క్రమంలో దాదాపు 64 నుంచి 68 శాతం పాయింట్లను సొంతం చేసుకోవాలంటే ఈ సిరీస్ భారత్‌కు జీవన్మరణ సమస్యగా మారనుంది. టీమ్ ఇండియా కేవలం తన మ్యాచ్‌లలో గెలిస్తేనే సరిపోదు. పాయింట్ల పట్టికలో మొదటి వరుసలో ఉన్న శ్రీలంక, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా జట్ల పరాజయాలపై కూడా మన అవకాశాలు ఆధారపడి ఉన్నాయి.

# భారత్‌కు ఘోర పరాజయం!

## 6 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ గెలుపు



**న్యూఢిల్లీ:** మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ముందు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. నేడు జరిగిన మూడో టీ20లో సమష్టిగా రాణించిన ఇంగ్లండ్ 6 వికెట్ల తేడాతో టీమిండియాను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(40 బంతుల్లో 7 ఫోర్లతో 56 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా, యస్తిక భాటియా(32), దీప్తి శర్మ(32), జెమీమా రోడ్రిగ్స్(29) పర్వాలేదనిపించారు. ఓపెనర్లు స్మృతి మంధాన(8), షెఫాలీ వర్మ(11) తీవ్రంగా నిరాశపర్చారు. ఇంగ్లండ్ బౌలర్లలో లారెన్ బెల్ 2 వికెట్లు తీయగా, స్మిత్, చార్లీ డెన్ తలో వికెట్ పడగొట్టారు. అనంతరం ఇంగ్లండ్ 18.3 ఓవర్లలోనే 4 వికెట్లకు 184 పరుగులు చేసి గెలుపొందింది. అలిస్ క్యాప్సే(43 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 82), హీథర్ నైట్(42 బంతుల్లో 10 ఫోర్లతో 70 నాటౌట్) హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. అరుంధతి రెడ్డి, క్రాంతి గౌడ్ రెండేసి వికెట్లు తీసారు. ఈ నెల 12 నుంచి ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుండగా, భారత్ తమ తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్‌తో ఈ నెల 14న ఆడనుంది. టీ20 ప్రపంచకప్ ముందు ఇంగ్లండ్‌తో జూన్ 10న వార్మప్ మ్యాచ్ ఆడనుంది.

# ఆస్ట్రేలియాపై పాకిస్థాన్ ఓటమి

**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై పాకిస్థాన్‌కు పరాభవం ఎదురైంది. ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా లాహోర్ వేదికగా జరిగిన రెండో వన్డేలో సమష్టిగా విఫలమైన పాకిస్థాన్ 41 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దాంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఆస్ట్రేలియా నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్లకు 231 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లీస్ (51), కామెరూన్ గ్రీన్ (53) హాఫ్ సెంచరీలతో రాణించగా, మ్యాట్ రేన్‌షా (43) పర్వాలేదనిపించాడు. పాకిస్థాన్ బౌలర్లలో షాహిన్ షా అఫ్రిది 3 వికెట్లు తీయగా, హారిస్ రౌఫ్, మిన్‌హాస్, అబ్రార్ అహ్మద్, రెండేసి వికెట్లు పడగొట్టారు. ఇక 232 పరుగుల లక్ష్య ఛేదనలో పాకిస్థాన్ 44 ఓవర్లలో 190 పరుగులకు కుప్పకూలింది. షాదాబ్ ఖాన్ (71) అరఫత్ మిన్హాస్ (33), ఘాజి ఘోరి (37) పోరాడినా ఫలితం లేకపోయింది. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ (4/33), మాథ్యూ షార్ట్ (3/36) పాక్ పతనాన్ని శాసించగా, మాథ్యూ కుహ్నెమన్, ఆడమ్ జంపా, తన్వీ సంగా తలో వికెట్ తీసారు.టాప్3 బ్యాటర్లు షాహిబ్‌జాద ఫర్హాన్(3), మాజ్ సదాకత్(0), బాబర్ ఆజామ్(16) తీవ్రంగా నిరాశపర్చారు. సల్మాన్ అఘా(7), అబ్దుల్ సమద్(2) వరుసగా పెవిలియన్ చేరడంతో పాక్ 58 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. ఆ కాసేపటికే ఘాజీ ఘోరి కూడా ఔటవ్వడంతో ఆ జట్టు కష్టాలు రెట్టింపు అయ్యాయి. కెప్టెన్ షాహిన్ షా అఫ్రిది(0), హారిస్ రౌఫ్, అబ్రార్ అహ్మద్(0) విఫలమవడంతో పాకిస్థాన్ 190 పరుగులకే పరిమితమైంది.

# నష్టాలబాటలో సెన్సెక్స్, నిఫ్టీ

## మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలే ఎఫెక్ట్




**ముంబయి, జూన్ 3:** దేశీయ ఈక్విటీ మార్కెట్‌సూచీలు మరోసారి నష్టాలబారిన పడ్డాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 303.67 పాయింట్లు క్షీణించి 74,346.17 పాయింట్లకు చేరగా నిఫ్టీ 50 సూచీ 77.95 పాయింట్లు నష్టపోయి 23,405.60 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. ఐటిఎఫ్‌ఎంసిజి స్టాక్స్ నీరసించడంతో నష్టాలు తప్పలేదు. టిసిఎస్ 8.39శాతం, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్ 5.19, ఇన్ఫోసిస్ 3.79శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.50 నష్టపోగా స్మాల్‌క్యాప్ సూచీ 0.01శాతం స్వల్పలాభం నమోదుచేసింది.మార్కెట్లపరంగా ప్రతికూలంగానే ఉంది. బిఎస్‌ఇలో 1573 షేర్లుపెరిగితే 2732 షేర్లు పతనం చెందాయి. 217 షేర్లు స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 95.68 వద్ద నమోదుకాగా ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్‌ఐదు సెటిల్‌మెంట్‌ధరలు 0.93శాతం క్షీణించి రూ.1,54,100గా నడిచింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు ఆగస్టు నెల సెటిల్‌మెంట్‌ధరలు 2.35 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 98.35 డాలర్లుగా కొనసాగింది. యూరోపియన్‌షేర్లు దిగువస్థాయిలోనే ముగిసాయి. అమెరికా 60 దేశాలపై విధించతలపెట్టిన సుంకాలకు ప్రతికూలంగా మార్కెట్లు కొనసాగాయి. ఆసియా సూచీలు బుధవారం ఎగువకు నమోదయ్యాయి. వాల్‌స్ట్రీట్ షేర్లు రాత్రికిరాత్రే రికార్డుగరిష్టాలను నమోదుచేసాయి. ఎస్‌అండ్‌పి 500 0.13శాతంపెరిగితే డౌజోన్స్ పారిశ్రామిక సగటు 228.91 పాయింట్లు లాభపడింది. ఇక నాస్‌డాక్ కాంపోజిట్ కూడా 0.03శాతం పెరిగినట్లు తేలింది. ఇక దేశీయ మార్కెట్ల పరంగాచూస్తే ఇండస్ ఇండ్‌బ్యాంకు 1.38శాతం క్షీణించింది. టిసిఎస్ కూడా 8.39శాతం దిగజారింది. జాన్ కాక్‌ఎరిల్ ఇండియా 20శాతంపెరిగింది. వారాక్ ఇంజినీరింగ్ 3.36శాతం, ఎన్‌ఎండిసి 0.77శాతంచొప్పున పెరిగాయి. కాంకార్డ్ బయోటెక్ 3.03శాతంపెరిగితే జైడస్ లైఫ్‌సైన్సెస్ 0.16శాతం దిగజారింది. ఇక డైమండ్ పవర్ ఇన్‌ఫ్రా 3.07శాతం, మార్సన్స్ 7.32శాతం, కపాసైట్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ 0.65శాతం, ఆర్‌ఐఆర్ పవర్ ఎలక్ట్రానిక్స్ 0.46శాతం క్షీణించాయి.

# 59.8 పాయింట్లకు పెరిగిన సేవలరంగ పిఎంఐ సూచీ




**న్యూఢిల్లీ,జూన్ 3:** భారత్‌సేవలరంగ పిఎంఐ సూచీ మేనెలలో స్వల్పంగా పెరిగింది ఏప్రిల్‌లో 58.8పాయింట్లుకు రాగా మేనెలలో 59.8 పాయింట్లకు పెరిగింది. భారత్‌లోసేవలరంగ పిఎంఐ కేవలం బిజినెస్ కార్యకలాపాలు విస్తరణవల్లనే పెరిగిందని అంచనా. మొత్తం 400 సేవలరంగ కంపెనీల స్పందనను క్రోడీకరించి పిఎంఐ సూచీని రూపొందించినట్లు నిపుణులు వెల్లడించారు. 50 పాయింట్లకుపైన ఉంటే పెరుగుతున్నట్లు దిగవకు వెళితే క్షీణించినట్లు పరిగణిస్తారు. రవాణారంగం, సమాచార వ్యవస్థ, ఇన్‌ఫర్మేషన్, ఫైనాన్స్, బీమా, రియల్‌ఎస్టేట్ ఇతర బిజినెస్ సేవల కంపెనీలనుంచి గణాంకాలను సేకరించి సర్వేచేసింది. ఎస్‌అండ్‌పి గ్లోబల్ పరంగాచూస్తే రవాణా, డిజిటల్‌పరిష్కారాలు, ఈకామర్స్, వినోదరంగం, ఐటి వంటిరంగాలు పిఎంఐకు మద్దతుగా ఉన్నాయి. పేరోల్స్ గణాంకాలపైనా సానుకూల స్పందన లభించింది. ఉపాది సృష్టిపరంగాచూస్తే ఏడాదిలోనే స్వల్పంగా మెరుగుపడినట్లు అంచనావేసింది. ప్యానలిస్టుల్లో ఏడుశాతం మంది నియామకాలు పెరుగుతాయని, కంపెనీల ఉద్యోగులసంఖ్య గణనీయంగా పెరగవచ్చుని తెలిపారు. సేవలరంగంలో రికవరీ కనిపిస్తే ఉత్పత్తిరంగంపై ప్రభావం పడుతుంది. 54.7నుంచి మేనెలలో 55శాతానికి ఉత్పత్తిరంగ పిఎంఐ నమోదుకావడం గమనార్హం. హెచ్‌ఎస్‌బిసి ఇండియా కాంపోజిట్ పిఎంఐ ఉత్పత్తిసూచీ, సర్వీసెస్ బిజినెస్ కార్యకలాపాల సూచీలు ఆరునెలల గరిష్టానికి నమోదయ్యాయి. 58.2నుంచి 59.3పాయింట్లకు పెరిగినట్లు ప్యానల్ నిపుణులు తెలిపారు. కొత్త ఆర్డర్లు రావడం భారత సేవలరంగ సంస్థలకు ఊతం ఇచ్చింది.


# గిటార్‌విజ్ యాప్‌కు యాపిల్ డిజైన్ అవార్డు





**న్యూఢిల్లీ, జూన్ 3:** టెక్ దిగ్గజం యాపిల్ నుంచి భారతీయ యాప్‌కు అరుదైన గౌరవం లభించింది. ఇండియాకు చెందిన గిటార్ విజ్ యాప్, 2026 సంవత్సరానికి గాను ప్రతిష్ఠాత్మకమైన యాపిల్ డిజైన్ అవార్డును గెలుచుకుంది. విభిన్న సామర్థ్యాలు గల వినియోగదారులకు సంగీతాన్ని అందుబాటు లోకి తీసుకురావడంలో చేసిన కృషికి గాను ఇన్‌క్లూజివిటీ (సమ్మిళిత) కేటగిరీలో ఈ పురస్కారం దక్కింది. భారతీయ డెవలపర్ బిజోయ్ తంగరాజ్ ఈ అద్భుతమైన యాప్‌ను రూపొందించారు. గిటార్ నేర్చుకునే కొత్తవారికి, ఇప్పటికే అనుభవం ఉన్నవారికి ఒక సమగ్రమైన టూల్‌కిట్‌గా ఈ యాప్ ఉపయోగ పడుతుంది. ముఖ్యంగా స్వరాలు, కార్డ్స్, వేళ్ల స్థానం వంటి అంశాలపై మాటల ద్వారా సూచనలు ఇవ్వడం దీని ప్రత్యేకత. దీనివల్ల సంగీతకారులు ఎలాంటి సహాయం లేకుండా స్వతంత్రంగా గిటార్ వాయించడం నేర్చుకోవచ్చు. విభిన్న నేపథ్యాలు, సామర్థ్యాలు, భాషలకు చెందిన ప్రతీ ఒక్కరికీ సంగీతాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో దీనిని రూపొందించినట్లు యాపిల్ ప్రశంసించింది. ఈ యాప్‌లో ఆపిల్‌కు చెందిన డైనమిక్ టైప్, ఇంక్రీజ్డ్ కాంట్రాస్ట్, డిఫరెన్షియేట్ వితౌట్ కలర్ వంటి అనేక యాక్సెసిబిలిటీ ఫీచర్లను సమర్థవంతంగా వినియోగించుకున్నారు. ప్రతీ ఏటా యాపిల్ సంస్థ ఇన్నోవేషన్, సోషల్ ఇంపాక్ట్, విజువల్స్ వంటి పలు విభాగాల్లో అత్యుత్తమ యాప్స్, గేమ్స్‌కు ఈ డిజైన్ అవార్డులనుఅందిస్తుంటుంది. గతంలోనూ లూమీ, డెనిమ్,ఎవాల్వ్, మెడిటేట్‌వంటి భారతీయ యాప్‌లు ఈ అవార్డుల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ఇప్పుడు గిటార్ విజ్ సాధించిన ఈ విజయం, ప్రపంచ వేదికపై భారతీయ డెవలపర్ల నైపుణ్యానికి, సృజనాత్మకతకు లభిస్తున్న గుర్తింపునకు నిదర్శనంగా నిలిచింది.

# వెండి దిగుమతులపై మరింత కఠిన కార్యాచరణ

## పరిమితి దిగుమతుల కేటగిరీలోకి గుళికలు, పొడి



**ముంబయి,జూన్ 3:** వెండి దిగుమతులు రికార్డు స్థాయిలో పెరిగిపోవడంతో కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది. వెండి దిగుమతులపై ఆంక్షలను మరింత కఠినతరం చేస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు పరిమితులు లేని వెండి గుళికలు, పొడి రూపాలను కూడా పరిమిత దిగుమతుల కేటగిరీలోకి చేర్చింది. ఇకపై ఈ రకమైన వెండిని దిగుమతి చేసుకోవాలంటే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇటీవల భారీగా పెరిగిన వెండి దిగుమతి కేంద్రం కఠిన నిర్ణయం ప్రపంచంలోనే అత్యధికంగా వెండిని వినియోగించే దేశంగా ఉన్న భారత్, ఇటీవలి కాలంలో భారీగా వెండిని దిగుమతి చేసుకుంటోంది. దీనివల్ల రూపాయి విలువపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే గత నెలలో 99.9 స్వచ్ఛత కలిగిన వెండి కడ్డీలు, ఇతర పాక్షికంగా తయారు చేసిన వెండి ఉత్పత్తుల దిగుమతిని కూడా పరిమిత కేటగిరీలో చేర్చిన విషయం తెలిసిందే. బంగారం, వెండిపై దిగుమతి సుంకాన్ని 6 నుంచి 15 కి పెంచింది. అధిక చమురు ధరల కారణంగా విదేశీ మారక నిల్వలపై పడుతున్న భారాన్ని తగ్గించే ప్రయత్నాల్లో భాగంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. గణాంకాలను పరిశీలిస్తే 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో భారత్ రికార్డు స్థాయిలో 12 బిలియన్ డాలర్ల విలువైన వెండిని దిగుమతి చేసుకుంది. అంతకుముందు ఏడాది ఈ దిగుమతుల విలువ కేవలం 4.8 బిలియన్ డాలర్లు మాత్రమే. ఈ యేడాది ఏప్రిల్‌లోనూ వెండి దిగుమతులు గతేడాదితో పోలిస్తే 157 పెరిగి 411 మిలియన్ డాలర్లకు చేరాయి. ప్రభుత్వం వెండి దిగుమతులను మరింత కష్టతరం చేసింది. ఇప్పుడు దిగుమతిదారులకు ముందస్తు అనుమతి తప్పనిసరి. అయితే ఆ అనుమతి వస్తుందో రాదో, ఎంత సమయం పడుతుందో స్పష్టత లేదని ముంబైకి చెందిన ఓ బులియన్ డీలర్ వ్యాఖ్యానించారు. భారత్‌లో వెండిని ఆభరణాలు, నాణేలు, కడ్డీలతో పాటు సోలార్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ వంటి పారిశ్రామిక అవసరాలకు కూడా విరివిగా వాడతారు. గత ఏడాది కాలంగా సంప్రదాయ వినియోగం కంటే పెట్టుబడుల రూపంలో వెండికి డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా సిల్వర్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు రికార్డు స్థాయికి చేరాయి.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | గురువారం 04 జూన్ 2026 | I

## కూటమి వైఫల్యాలపై వైఎస్సార్సీపీ నిరసన
# పోస్టర్ ఆవిష్కరించిన డాక్టర్ పినిపే శ్రీకాంత్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి. జూన్3,ప్రభాతవార్త.** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ వైఫల్యంపై నిరశన పోస్టర్ ను ఆవిష్కరించారు.భట్నవిల్లిలోని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ నివాసం వద్ద, అమలాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అధ్యక్షతన రెండేళ్ల కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ఎండగడుతూ ఈ కార్యక్రమం తలపెట్టారు.ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన తీరుకు నిరసనగా.. జూన్ 4వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నారు అని అమలాపురం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ తెలిపారు.దీనికి సంబంధించిన "పోస్టర్ ఆవిష్కరణ"ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు,రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు,రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు జిన్నూరి బాబీ,మాజీ ఎంపీ చింతా అనురాధ, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ అధ్యక్షులు సంసాని నాని,మండలాల అధ్యక్షులు బద్రి బాబ్జి,గుత్తుల చిరంజీవి,ఎంపీపీ ఇళ్ల శేషారావు,జెడ్పీటీసీ కొనుకు గౌతమి రాష్ట్ర,జిల్లా, నియోజకవర్గ, మండల,గ్రామ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



# పోలవరం జిల్లాలో లేగ దూడలపై పెద్ద పులి పంజా

- 13 ఆవు దూడలను హతమార్చిన పులి
- మన్యంలో అలజడి రేపుతున్న పులి

**రంపచోడవరం / దేవీ పట్నం మే 3 ప్రభాతవార్త.** దేవీపట్నం మండలం గంగవరం గ్రాములో బుధవారం తెల్ల వారుజామున పశు వుల పాకపై రాయల్ బెంగాల్ టైగర్ పంజా విసిరింది. పెద్ద పులి దాడిలో మొత్తం 13 లేగ దూడలు మృతి చెందాయి. ప్రాణాలు కోల్పోయిన దూడలకోసం తల్లి ఆవుల ఆక్రందన చూరులను సైతం కంట తడి పెట్టిస్తుంది.పెద్ద పులి వరుస దాడులతో గిరిజనులు అల్లాడుపోతున్నారు.మైదాన ప్రాంతంలో పట్టుకున్న పులిని పాపికొండల అభయ్యారణ్యంలో వదలటంతో గిరిజన గ్రామాల్లో పశు వులకు మృత్యు శకటంగా మారింది.పులి దాడులతో పశువుల తో పాటు తమ ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది అని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే పులి గత నెలలో రాజవొమ్మంగి మండలంలో ఒకేసారి 9 పశువులను చంపివేసింది. ఇవే కాకుండా ప్రతిరోజు ఒకటి రెండు పశువులను చంపుతూ పోతుంది. గతంలో ఆకలేసినప్పుడు మాత్రమే ఆవులను చంపి తినేది. కేవలము రెండు మూడు రోజులకు మాత్రమే ఒక పశువును చంపేది. నాలుగు నెలల పాటు ఇదే పందాను అనుసరించిన పెద్దపులి తన పందా మార్చింది. గత నెల రోజులుగా పశువులపై దాడి చేసి మూకుమ్మడిగా చంపి వేస్తోంది. తమ పశు సంపదను పెద్దపులి చంపి వేస్తుంటే అటవీ శాఖ అధికారులు కంటి తుడుపు చర్యలు మాత్రమే తీసుకుంటున్నారని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల విలువ వేల రూపాయలు ఉంటే కేవలం కొద్ది మాత్రమే పరిహారము చెల్లిస్తున్నారని ఆదివాసులు ఆరోపిస్తున్నారు. గతంలోనే పెద్దపులి మేడకు అటవీ అధికారులు జి పి ఎస్ ట్రాకర్అమర్చారు. దీంతో ఎంత దట్టమైన అడవిలో ఉన్నప్పటికీ పులి కదలికలు అధికారులకు సులువుగా తెలిసిపోతున్నాయి. పులిని బంధించేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ సైతం రంగంలోకి దింపామని అటవీ అధికారులు రోజు చెప్తున్నారు. అలాగే రాష్ట్రస్థాయి జిల్లాస్థాయి అటవీ అధికారులు పులి వెనుకే ప్రయాణం సాగిస్తున్నారు. పులి ఉనికిని చెబుతూ ప్రజలను అప్రమత్తం చేయటం మినహా గత నాలుగు నెలలుగా చేసింది ఏమీ లేదని ఆదివాసీలు పెదవి విరుస్తున్నారు. మైదాన ప్రాంతంలో స్వల్ప కాలంలోనే పులిని బంధించగలిగిన అటవీ అధికారులు ఏజెన్సీ ప్రాంతంలో పులిని బంధించడంలో ఎందుకు విఫలమవుతున్నారనేది 1000 డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. పులిని బంధించేందుకు ఈ నాలుగు నెలల కాలంలో ప్రభుత్వానికి కొన్ని లక్షల రూపాయల ఖర్చయినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎలాంటి ఫలితం లభించలేదు. పులి వైఖరిలో వచ్చిన మార్పుతో రాబోయే రోజుల్లో మనుషులపై దాడి చేస్తే పరిస్థితి ఏంటా?అని ఇక్కడ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. త్వరలోనే పులి మనుషులపై దాడి చేసే పరిస్థితులు కనిపిస్తున్నాయని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సైతం పులిని సురక్షితంగా వెంటనే బందించమని అటవీ అధికారులను ఆదేశించారు. అయినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదు. ఫిబ్రవరి 14న ఈ పులిని మైదాన ప్రాంతంలో నుండి తీసుకువచ్చి పాపికొండల సమీపంలో వదిలిపెట్టారు. అప్పటినుండి ఈ బెంగాల్ టైగర్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అటు మైదాన ప్రాంతం ఇటు ఏజెన్సీ ప్రాంతాన్ని కలియ తిరుగుతూ షికారు చేస్తోంది. పులి దాడులలో పశు సంపదను కోల్పోతున్న రైతులు ఆవేదన వర్ణనాతీతంగా ఉంది. ఎంతోకొంత పరిహారం చెల్లించి చేతులు దులుపుకొని ముందుకు సాగిపోవడం తప్ప అటవీ అధికారులు చేసిందేమీ కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పరిస్థితి చేయి దాటిపోక ముందే పెద్దపులిని బంధించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే పులి పశుమందలపై మూకుముడిగా దాడి చేయడం ప్రారంభించింది కాబట్టి ముందు ముందు ఎలాంటి పరిస్థితులు ఉంటాయో అని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. పులిని బంధించి ప్రజలకు భరోసా కలిగించాల్సిన బాధ్యత అటవీ అధికారులపై ఉంది.





## అనుమతులు లేకుండా
# అర్ధరాత్రి మట్టి తోలకాలు
### ఫిర్యాదులు పట్టించుకోని సంబంధిత అధికారులు - కొత్తపేటలోమట్టి మాఫియా దందా



**కొత్తపేట, మే03,(ప్రభాతవార్త)** కొత్తపేట మండలంలో అర్ధరాత్రి వేళల్లో మట్టి తోలకాలు జోరుగా జరుగుతున్నాయి ట్రాక్టర్లు ట్రిప్పర్లు ద్వారా మట్టి తోలకాలు జోరుగా జరుగుతున్నాయి సమాచారం అందించిన అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజల వాపోతున్నారు రాత్రి 11:30 గంటలు మొదలుకొని ఉదయం నాలుగు గంటల వరకు తోలకాలు జరుగుతున్నాయి స్థానిక సమితి రోడ్డు గుండా మంగళవారం రాత్రి సుమారు 10 ట్రాక్టర్లు ద్వారా మట్టి రవాణా జరుగుతుంది ప్రభాతవార్తసంబంధిత రెవెన్యూ అధికారికి ఐదుసార్లు ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు రాత్రికి రాత్రి అతి వేగంగా అక్రమ మట్టి తవ్వకాలు తోలకాలు జరుగుతున్నాయి వీటి వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువగా ఉన్నాయని జనం అనుకుంటున్నారు సంబంధిత జిల్లా అధికారులు కొత్తపేట మండలంలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను తోలకాలను నిరోధించాలని ప్రజలు కోరుకుంటున్నారు

## కోరంగి టూరిజం అభివృద్ధికి
# రూ.1.88 కోట్లతో ప్రణాళిక..
### ఈడీసీ చైర్మన్ల సమీక్ష సమావేశం - ఫారెస్ట్ రేంజర్ వరప్రసాద్ .



**తాళ్లరేవు, జూన్ 3( ప్రభాతవార్త):** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరింగ అభయారణ్యంలోని, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సి.బి. ఈ.టి.) అభివృద్ధికి రూ 1.88 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అటవీ శాఖ రేంజ్ అధికారి ఎస్ ఎస్ ఆర్ వరప్రసాద్ తెలిపారు. కోరంగి సి బి ఈ టి కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఆయా ఈ డి సి చైర్మన్ ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు చేసిన ఖర్చుల వివరాలను తెలిపారు. ఇ డి సి పరిధిలోని 20 గ్రామాలలో గత సంవత్సరం రూ. 99.76 లక్షల నిధులు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ముఖ్యంగా మడ అడవి అభివృద్ధికి రూ 73 లక్షలు కేటాయించి ఖర్చు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపుకి రూ. 3.44కోట్లు నిల్వ ఉన్నట్టు ఆయన వెల్లడించారు. ఈ సొమ్ము ఫిక్స్ డిపాజిట్ చేసి దాని నుండి వచ్చే వడ్డీతో పలు కార్యక్రమాలు చేపడతామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం రూ 1.88 కోట్లతో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. 2027 పుష్కరాల సందర్భంగా తీరప్రాంత గ్రామాలలో చేపట్టే పనుల కోసం రూ. కోటి 30 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈ ఏడాది మడ అడవి అభివృద్ధి కోసం రూ. 73 లక్షలు కేటాయించడం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు వాటి ఖర్చు పారదర్శకంగా సాగడానికి ఈ డి.సి.లు దోహదం చేస్తున్నాయని ఆయన తెలిపారు. ఎటువంటి పనులు చేపట్టాలన్న ఈడీసీ చైర్మన్లు అభిప్రాయాలు తీసుకుని ముందుకు వెళ్తున్నామన్నారు. కోరంగి పర్యాటక కేంద్రానికి పర్యాటకులు అధిక సంఖ్యలో రావడం ద్వారా ఆదాయం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సి బి ఈ టి చైర్మన్ పి ధనుంజయ, వైస్ చైర్మన్ బి. ఆదిలక్ష్మి, ఆయా ఈడీసీ చైర్మన్లు ఒ.రాము, ఎం. వీరబాబు, ఎస్. అన్నవరం, ఆర్. బ్రహ్మ స్వామి, బి. గంగరాజు, వి.నాగ సురేష్, వై.సత్య రాంబాబు, పి. ఆనందరావు, బి. శ్రీనివాసరావు,, సిహెచ్. నూకరాజు, ఎఫ్ ఎస్ ఓ లు ఎస్. వీరభద్రరావు, కె. సిద్ధార్థ, కె. ధనుంజయ, కె. మహేష్, జి. గోపి పాల్గొన్నారు.

## అబ్బురపరుస్తున్న శిల్పి తాళాబత్తుల సూక్ష్మ ఖండం



**పెద్దాపురం జూన్ 3(ప్రభాత వార్త )** గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, డాక్టర్. తాళాబత్తుల సాయి అతి తక్కువ సమయంలో చెక్కిన సూక్ష్మ కళా ఖండం అబ్బురపరుస్తుంది. సూక్ష్మ కళాకారుడు, చిత్రకారుడు చెక్కను గొడ్డలితో నరుకుతున్నట్టు ఉన్న ఈ సూక్ష్మ కళాఖండం మొత్తం సేవ కర్రతో కేవలం గంట సమయంలో చెక్కడమైనది. దీని ఎత్తు 16 మిల్లీమీటర్లు, వెడల్పు 8 మిల్లీమీటర్లుతో తయారు చేసినట్లు సాయి తెలిపారు. ఈయన గతంలో పలు సూక్ష్మ కళా ఖండంలు తయారు చేసి గిన్నిస్ బుక్ రికార్డును సాదించారు. సాయి ప్రతిభను పలువురు ప్రముఖులు పట్టణ ప్రజలు అభినందించారు.

## రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు మరోసారి వెన్నుపోటు
### పోస్టర్‌ను విడుదల చేసిన సూర్య ప్రకాష్



**రామచంద్రపురం జూన్ 03(ప్రభాతవార్త):** రాష్ట్రంలో అవినీతి ఆక్రమాలతో రెండేళ్ల పాటు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పాలనను చంద్రబాబు నాయుడు సాగించారని,వైఎస్ఆర్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు,రామచంద్రపురం నియోజకవర్గ సమన్వకర్త పిల్లి సూర్యప్రకాశ్ విమర్శించారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు అనే కార్యక్రమానికి సంబందిచి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుదవారం పోస్టర్‌ను విడుదల చేశారు.ఈ సఃదర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టి రెండేళ్లు గడుస్తున్నా అరకొరగా సూపర్ సిక్స్‌ను అమలుచేసి అన్ని చేసేశాం అని గొప్పలు చెప్పుకుంటూ ఈ రాష్ట్ర ప్రజలను నిలువునా వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. అడబిడ్డనిధి పేరుతో 18 నుంచి 50 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు రూ.1500లు వారి అక్కౌంట్లలోనికి జమ చేస్తామని చెప్పి హామీనిచ్చారని ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు అమలు చేయకుండా రాష్ట్రంలోని మహిళలను మోసం చేస్తున్నారన్నారు. నిరుద్యోగ భతి హామీ నిచ్చి నిరుద్యోగులకు ప్రతీ నెల 3వేలు ఇస్తామని హామినిచ్చారని ఈ రెండేళ్ల కాలంలో నిరుద్యోగ భతి రాష్ట్రంలోని యువతకు రూ.72వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటివరకు ఒక్క పైసా కూడా అందించలేదన్నారు.ప్రభుత్వం చేపట్టిన తరువాత తొలి సంతకం చేసిన మెగా డిఎస్సీని అనేక రకరాలుగా అక్రమాలు, అమవినీతికి పాల్పడి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు,ఆ శాఖ మంత్రి లోకేష్‌లు చేసి దగా డీఎస్సీగా మార్చేశారన్నారు. డీఎస్పీలో జరిగిన అక్రమాలు,అవినీతిని ఆధారాలతో సహా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బయటపెట్టినా ఈ ప్రభుత్వానికి సీమ కుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. బీసీ, ఎస్సీ మహిళలకు 50 ఏళ్లకే పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వకుండా ఇవ్వకుండా చంద్రబాబు నాయుడు వారికి కూడా వెన్నుపోటు పొడిచారన్నారు. తల్లికి వందనం అన్నారని దాన్ని కూడా కోతలు పెట్టి నామమాత్రంగానే అమలు చేసి మొదటి సంవత్సరం ఎగ్గొటి అరకొరగానే అమలు చేస్తున్నారన్నారు. ఉచితంగా 3 గ్యాస్ సిలెండర్‌లు ఇస్తామని చెప్పి ఒక సిలెండర్ ఇచ్చి చేతులు దులుపుకొని తుస్ మనిపించిన నారా చంద్రబాబునాయుడు ఘనతను ఈ రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని విమర్శించారు.అన్నదాత సుఖీభవ పేరుతో ఈ రాష్ట్ర రైతులను కూడా వదిలిపెట్టకుండా కూడమి ప్రభుత్వం నేతలు నిలువునా ముంచేశారని సూర్యప్రకాశ్ అన్నారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోలేన నానా అవస్థలు పడినా ఈ జిల్లా మంత్రి పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. అన్ని రకాలుగా చంద్రబాబునాయుడు ప్రభుత్వం చేసిన వెన్నుపోటు కార్యక్రమాలను ప్రజల్లో ఎండగట్టేందుకు పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు పాలనకు రెండేళ్లు పేరుతో నేటి నుంచి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలను చేపడుతున్నట్లు సూర్యప్రకాశ్ వెల్లడించారు. అందులో భాగంగా మండల కేంద్రాల్లో పార్టీ కన్వీనర్‌ల ఆధ్వర్యంలో నేడు(గురువారం) నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన ప్రకటించారు.యువజన విభాగంనియోకవర్గ అధ్యక్షుడు మాదిరాజు ఫద్వీరాగ్,మాజీ ఎంపీపీ అంబటి భవానీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, మాజీ కౌన్సిలర్ గుబ్బల గణ,పోతంశెట్టి గోపాలకష్ణ,ఎండీ మస్తాన్, నియోజకవర్గ మహిళా విభాగం అద్యక్షురాలు సతీష్‌కుమారి, జిల్లా బీసీసెల్ కార్యదర్శి గుత్తుల శ్రీను(డ్రీమ్), పార్టీ కన్వీనర్‌లు గాధంశెట్టి శ్రీధర్, పోలినాటి వరప్రసాద్, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లిడి సాయిలక్ష్మి, పార్టీ నేతలు గుంట ముక్కల దొరబాబు, బొమ్ము మోహనరావు, కొసనా కామేశ్వర రావు, బండి త్రిమూర్తులు, సత్తిశంకర్‌రెడ్డి,మాజీ సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## గోబర్ ధన్ ప్లాంట్స్ ఏర్పాటుకు స్థల పరిశీలన.
### - వంటశాల వ్యర్థాలు పశువుల వ్యర్థాలతో గ్యాస్ ఉత్పత్తి.





**చింతూరు జూన్ 3 ప్రభాత వార్త.** వంటశాల వ్యర్థాలతో పాటు పశువుల పేడను ఉపయోగించి కాలుష్య రహితంగా గ్యాస్ను ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వం చర్యలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో పోలవరం జిల్లాలో 8 ప్రదేశాల్లో గోబర్ ధన్ ప్లాంట్స్ ఏర్పాటుకు సి ఎస్ ఐ ఆర్ టీం సభ్యులు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సభ్యులు, మరియు పంచాయతీ రాజ్ శాఖ సంయుక్తంగా పరిశీలించి 8 ప్రదేశాలను ఎంపిక చేశారు.వాటిలో 1). ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ – చింతూరు, 2).ఆర్ ఎస్ బాయ్స్ హాస్టల్ – అడ్డతీగల 3).ఆర్ జె సి గర్ల్స్ హాస్టల్ –రంపచోడవరం 4).ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ – పెదగెద్దాడ 5).తిరుమల తిరుపతి దేవస్థాన దేవాలయం – ఐ.పోలవరం 6).ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ –మారేడుమిల్లి 7).పి టీ జి బాయ్స్ హాస్టల్ – మారేడుమిల్లి 8).ఆర్ జె సి గర్ల్స్ హాస్టల్ ౯.రామవరం లలో 8 ప్లాంట్స్ ఏర్పాటు చేయనున్నారు.వంట శాల వ్యర్థాలను,పశువుల పేడను మరియు వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించి వీటి ద్వారా బయోగ్యాస్ ను వంటశాల అవసరాలకు ఉపయోగించవచ్చునని మరియు పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చేయవచ్చునని తెలియజేశారు.ఒక్కొక్క ప్లాంట్ రూ 50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ ప్రిన్సిపాల్ – దిలీప్ సింగ్, సి ఎస్ ఐ ఆర్ బృదాం సభ్యులు ఆర్ .మోహన్, జి .సుమంత్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ జిల్లా కన్సల్టెంట్ వై.అర్జున, చింతూరు మండల డిప్యూటీ .ఎంపీడీఓ – ఆర్ .వీర్రాజు, పంచాయతీ అభివృద్ధి అధికారి –డి .సౌజన్య పాల్గొన్నారు.

## ఉమ్మడి ఏపీ సమాచార శాఖ విశ్రాంత ఉద్యోగుల
# ఆత్మీయ కలయిక.....
### విశ్రాంత ఉద్యోగుల సంఘం కమిటీ ఏకగ్రీవ ఎన్నిక...



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 3,ప్రభాతవార్త.** విశ్రాంత జీవితం అనేది కేవలం విశ్రాంతి కోసం మాత్రమే కాదని, సమాజానికి సేవ చేయడానికి, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపడానికి దేవుడు ప్రసాదించిన గొప్ప అవకాశమని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మాజీ సంచాలకులు కిస్మత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం మధురపూడిలోని కన్నయ్య ఆశ్రయ ఫౌండేషన్‌లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల విశ్రాంత ఉద్యోగుల సంఘం తొలి ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందదాయకమన్నారు. ఇటువంటి సమావేశాలు పరస్పర అనుబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు, రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి హాజరైన విశ్రాంత ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో రిటైర్డ్ డి డి కన్నారి ఫౌండేషన్ అధ్యక్షుడు రాజబాబు, రిటైర్డ్ అధికారులు ఎల్. స్వర్ణలత, డి. శ్రీనివాస్, కె. జయరావు, సీహెచ్. హరినాధబాబు, డి. నాగార్జున, ఎం. ఫ్రాన్సిస్, బాబ్జి, ఎస్.ఎస్. జీవన్, టి. త్యాగరాజు, ప్రసాదరావు, పి. కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సంఘం కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సందర్భంగా గోవిందరాజు సర్వీస్ పెన్షన్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్, కుటుంబ పెన్షన్, లైఫ్ సర్టిఫికేట్ సమర్పణ, ఈహెచ్ఎస్ హెల్త్ కార్డు, పదవీ విరమణ అనంతరం భద్రపరచుకోవాల్సిన కీలక ధ్రువపత్రాలు, ప్రభుత్వ పరంగా లభించే వివిధ ప్రయోజనాలపై వివరించారు. పెన్షనర్లకు సంబంధించిన నిబంధనలను సకాలంలో పాటించడం ద్వారా అనేక సమస్యలను నివారించవచ్చని సూచించారు. పి. కిరణ్ కుమార్ న్యాయ, వైద్య సంబంధిత అంశాలపై మాట్లాడుతూ, ఆస్తుల బదిలీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వీలునామాల ప్రాముఖ్యత, వృద్ధాప్యంలో ఎదురయ్యే న్యాయపరమైన సమస్యల పరిష్కార మార్గాలు వివరించారు. అలాగే ఆరోగ్య బీమా పథకాల ఎంపిక, ప్రీమియం చెల్లింపులు, అందుబాటులో ఉండే వైద్య సేవలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై సభ్యులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసాలకు గురైన సందర్భాల్లో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, క్రీడా–సాంస్కృతిక కార్యక్రమాలు, తీర్థయాత్రలు, పర్యాటక యాత్రలు నిర్వహించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో సామూహిక సహకారం అందించాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. 70 సంవత్సరాలు పైబడిన విశ్రాంత ఉద్యోగులను ప్రత్యేకంగా సత్కరించాలని కూడా నిర్ణయించి ఏ ఎస్ సుబ్బా రావు, సూర్యనారాయణ , చలపతి రావు, తదితరులను సన్మానించడం జరిగింది. అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార పౌర సంబంధాల విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా కె. జయరావు, ఉపాధ్యక్షులుగా సీహెచ్. హరినాధబాబు, విజయ సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పి. వెంకటప్పారావు, సంయుక్త కార్యదర్శులుగా డి. నాగార్జున, రమణమూర్తి, కోశాధికారిగా ఎస్.ఎస్. జీవన్ ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎల్. స్వర్ణలత, గోవిందరావు, కిరణ్ కుమార్, ఎం. ఫ్రాన్సిస్, త్యాగరాజు, ప్రసాదరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన సమాచార శాఖ విశ్రాంత ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై విమర్శలు మానుకోవాలి
### రాష్ట్ర రోడ్డు డవలప్మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ వెన్నా శివ



**శంఖవరం జూన్ 3 ప్రభాతవార్త** ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ ఆపద్బాంధవుడిగా నిలిచే జనసేనాని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై విమర్శలు మానుకోవాలని రాష్ట్ర రోడ్డు డవలప్మెంట్ కార్పోరేషన్ డైరెక్టర్ వెన్నా శివ అన్నారు. మండలంలోని కత్తిపూడిలో గల పార్టీ కార్యాలయంలో స్థానిక విలేకర్లతో శివ మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో కూటమి పాలనలో అభి వృద్ధి సాధనకు ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ చేస్తున్న సహకారం ఎనలేనిదన్నారు. నాడు వైసిపి పాలనలో టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా జైలుకు తరలిస్తే పవన్ కళ్యాణ్ వైసిపి దుర్మార్గపు పాలనపై పోరాడారన్నారు. పవన్ కళ్యాణ్ ఒక భారతీయునిగా తప్పులను ప్రశ్నించే హక్కు ఆయనకు ఉందని, తెలంగాణాలో అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు, మరికొందరు పవన్ కళ్యాణ్ పై చేస్తున్న విమర్శలను మానుకోవాలని, లేనిపక్షంలో ఒక భారతీయుని హక్కులను విస్మరించడమే అవుతుందనన్నారు. పవన్ కళ్యాణ్ ఏ ఒక్కరికో, ఏ ఒక్క పార్టీకో భయపడే మనస్తతత్వం కాదని, ఆయన ప్రజా సంక్షేమానికి ఆటంకం కలిగించే వారిపై నిరంతర పోరాటం సాగించే యోధుడన్నారు. పవన్ కళ్యాణ్ కృషితో రాష్ట్రంలో పలు గిరిజన గ్రామాలు రహదారి సౌకర్యం వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించిన నేత పవన్ కళ్యాణ్ అని ఇటువంటి పవన్ కళ్యాణ్ కు జన సైనికులతోపాటు, టిడిపి, బిజెపి పార్టీల కూటమి అండగా నిలుస్తుందన్నారు. విమర్శలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించారు

## ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన కార్యదర్శిగా కుమారి



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్ 3,ప్రభాతవార్త.** పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రేడ్–1 గ్రంథాలయాధికారిణి గా పనిచేసి, పదోన్నతపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన కార్యదర్శిగా కె.జె.ఎస్.ఎల్. కుమారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భముగా గ్రంథాలయ సంస్థ గౌరవ చైర్మన్ భూపతిరాజు ఈశ్వరరాజు వర్మ (సాయిబాబు రాజు) తో కలిసి బుధవారం కాకినాడ కలెక్టర్ వారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## మనమిత్ర వాట్సాప్ ద్వారా
# సులభ తరంగా స్వామివారి దర్శనం ..
### చైర్మన్, ముదునూరి,డిప్యూటీ కమిషనర్ ఈఓ, నల్లం.






**ఆత్రేయపురం, జూన్ 03,(ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ది చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి క్షేత్రానికి బుధవారం వేలాది మంది భక్తులతో శోభిల్లింది. ఏడువారాల పూర్తి అయిన భక్తులు అష్టోత్తర పూజ, నిత్య కళ్యాణంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.దీంతో ఆలయ పరిసరాలన్నీ భక్తుల గోవింద నామస్మరణతో మార్మోమోగాయి. స్వామివారి ఆలయానికి వచ్చే భక్తులు మనమిత్ర వాట్సాప్ నంబర్: 9552300009 ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి వాట్సప్ ద్వారా మీరు కోరిన సేవలను సులభంగా బుక్ చేసుకోవచ్చునని ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు తెలిపారు. వివిధ జిల్లాల నుండి ఆలయానికి వచ్చే భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం సులభంగా చేసుకునేలా ఏర్పాట్లు దేవాదాయ శాఖ ద్వారా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

**పురపాలక సంఘం - అమలాపురం**
ఆర్.ఓ.సి.నెం.758/2020-ఇ1 తేది:03-06-2026
**ఇ - ప్రొక్యూర్‌మెంటు షార్టు టెండరు నోటీసు**
అమలాపురం పురపాలక సంఘ పరిధిలో ఎస్.సి.ఎస్.పి నిధులతో ఒక (1) పనికి రూ.200.00 లక్షలతో ఇ ప్రొక్యూర్ మెంట్ ద్వారా షార్టు టెండరు పిలువబడినది.
టెండరు షెడ్యూల్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:01-06-2026 సా.07.00 ల నుండి
ముగింపు తేది: 08-06-2026 సా.గం.04.00 ల వరకు
మిగిలినవివరములు www.tender.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు చూడగలరు.
కమీషనరు,
అమలాపురం పురపాలక సంఘం

**IN THE COURT OF THE HON'BLE V SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S.NO. 770 OF 2025**
**Between:**
State Bank of India, Adikmet Road, Vidyanagar Branch
...Plaintiff
AND
Mrs. JavvadiRekha.
...Defendant
To,
Mrs. JavvadiRekha C/o. Chekka Durga Prasad, Aged about 36 years, R/o. 68-6-8, Ashok Nagar, Near 7 Hills Apartment, Kakinada (Urban), East Godavari-533003.
...Defendant
Please take Notice that the above named plaintiff Bank has filed above suit Against you, for recovery of its dues and subsequent interest, of Rs. 15,23,472/- Your are here by summoned to appear in the above court. The Hon'Ble court posted the above case on 02-07-2026 at 10.30.a.m. for your appearance either in person or through an advocate, failing which the case will be heard and decided on merits in your absence.
// By Order Of the Court //
B.YOGENDRA PRASAD
Advocate
H.No.3-5-218/55, Krishna Nagar Colony, Moulali, Hyderabad.

## పర్యావరణ దినోత్సవ సందర్భంగా చిత్రలేఖన పోటీలు



పెద్దాపురం జూన్ 3(ప్రభాత వార్త) జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్ధ శ్రీనివాస్ తెలిపారు. పెద్దాపురం యానపు సూర్యారావుభవనంలో చిత్రలేఖనం పోటీ లకు ఎందుకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖన పోటీలు జూన్ 5వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుండి జరుగుతాయని తెలిపారు. 3,4,5 తరగతులకు సబ్ జూనియర్స్ గాను, 6,7 తరగతులు జూనియర్స్ గాను, 8,9,10 తరగతులకు సీనియర్ గాను, ఇంటర్ ఆ పైన సూపర్ సీనియర్స్ గా పోటీలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులకు డ్రాయింగ్ షీట్ ఇవ్వడం జరుగుతుందని, మిగిలిన డ్రాయింగ్ మెటీరియల్ ఎవరికీ వారు తెచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో పీసీస్ కార్యదర్శి రొంగల అరుణ్, వాడపల్లి సాయి, వీరమళ్ళ బంగారం, సూర్యకళ, సూర్య అఖిల, దీక్షిత, తేజ దీపిక తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి, డ్రగ్స్ రహిత గ్రామాలుగా తీర్చి దిద్దాలి...

**ఆపరేషన్ వజ్రప్రహార్ తనిఖీలలో...డీ.ఎస్.పి. సుంకర మురళీమోహన్...**



ఆత్రేయపురం, జూన్,03,(ప్రభాత వార్త) గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రధాన లక్ష్యంగా మాదకద్రవ్యాల (గంజాయి తదితర), అక్రమ మద్యం రవాణా నియంత్రణ, నేరాల అదుపునకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్' ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహిస్తుందని డీఎస్పీ సుంకర మురళీ మోహన్ అన్నారు.ఇందులో భాగంగా మండల పరిధిలో గ్రామంలో బుధవారం తెల్లవారుజామున డిఎస్పి సుంకర మురళీమోహన్, ఆధ్వర్యంలో, రావులపాలెం రూరల్ సీఐ. సిహెచ్ విద్యాసాగర్, ఎస్సై. ఎస్. రాము వారి సిబ్బందితో కలిసి ఆపరేషన్ వజ్రప్రహార్ తనిఖీలు నిర్వహించారు. అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలు, స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ ఇన్సూరెన్స్ లేని వాహనాలపై చలాన విధించారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను సీజ్‌చేశారు. అనుమానిత వ్యక్తుల గంజాయి పై దృష్టి సారించారు. ఈ సందర్భంగా డిఎస్పి సుంకర మురళీమోహన్ మాట్లాడుతూ, గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రధాన లక్ష్యమని, ఆయన అన్నారు. రాష్ట్రంలో 100 చోట్ల ఆపరేషన్ వజ్రప్రహార్ సెర్చ్ జరుగుతుందన్నారు. అనంతరం యువతను పిలిచి గంజాయి డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఎవరైనా దొంగ బట్టు విక్రయించిన, కొన్న, అలాంటి చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. గంజాయి డ్రగ్స్ మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలు, సేవిస్తున్న, లేదా విక్రయించిన వారి వివరాలు పోలీసువారికి తెలియజేయాలన్నారు. మన ఊరు క్షేమం, మన చేతుల్లోనే ఉందని , గంజాయి డ్రగ్స్ కు బానిసలుగా మారిన వారు, మృగాళ్ల ప్రవర్తిస్తూ, ఆడపిల్లలపై లైంగిక వేధింపులు, అత్యాచారాలు, కొట్లాటలకు దిగుతూ, ఊరిని భయభ్రాంతులకు గురిచేస్తారన్నారు. అలాంటి వారిని గుర్తించడమే కాక వారిని పూర్తిగా నిర్మూలించడానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం ఎస్ఐ ఎస్ రాము, రావులపాలెం ఎస్సై చంటిబాబు, కొత్తపేట అడిషనల్ ఎస్సై వెంకటేశ్వరరావు, కొత్తపేట ఆలమూరు ఆత్రేయపురం రావులపాలెం పరిధిలో ఉన్న కానిస్టేబుల్ ఏఎస్ఐలు పాల్గొన్నారు.


## చొప్పల్లి గ్రామంలో నీటి పథకం కుళాయి పునరుద్ధరణ



వి.ఆర్.పురం,జూన్ 3,ప్రభాతవార్త మండలంలోని చొప్పల్లి గ్రామంలో ఒక వీధిలో గత కొద్ది రోజులుగా మరమ్మతులకు గురై నీటి సరఫరా నిలిచిపోయిన నీటి పథకం కుళాయి ని బుధవారం పునరుద్ధరించారు. సంబంధిత వీధిలోని కుళాయికి కొన్ని రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. అసలే వేసవి అందున కుళాయికి నీటి సరఫరా నిలిచిపోవడంతో, ఆ వీధి ప్రజలు తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. సర్పంచ్ ల పదవి కాలంపూర్తవ్వటం ఇక్కడ అసలు సమస్యగా మారింది. ఈ విషయాన్ని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి దృష్టికి తీసుకొని వెళ్లారంతో, ఎట్టకేలకు సమస్య పరిష్కారమైంది. దీంతో ఆ వీధి ప్రజలు, ఎమ్మెల్యే శిరీష దేవి, టిడిపి మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఐటీడీపీ కన్వీనర్ ఆకోజు భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ ఉర్మ ఆదమ్మ, సీనియర్ నాయకులు బోడి బోయిన సురేష్ రావు, బొర్రా సూరిబాబు, మీడియా డివిజన్ ఉర్మ బుచ్చయ్య, కారం చిరంజీవి, నీలం రాజా, జంగాల ప్రేమ్ సాగర్, కారం సత్యం, ధర్మల బాబు, కారం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## దివిలి కాలువలకు మోక్షం

**-నీటి సంఘం ఉపాధ్యక్షులు విజయ్ చొరవతో పూడిక తీత**



పెద్దాపురం జూన్ 3(ప్రభాత వార్త) ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న పెద్దాపురం మండలం దివిలి గ్రామ పంట పొలాల కాలువ అభివృద్ధి కి ఎట్టకేలకు మోక్షం లభించింది. గ్రామానికి చెందిన నీటి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జట్లా విజయ్ బాబు తొలి ప్రయత్నం లోనే కాలువ పూడిక తీతపై ప్రత్యేక దృష్టిసారించారు. దీనికి గాను ప్రధాన పంట కాలువ దొంగ దొడ్డి, బారు కాలువ శిల్పాలమ్మ కాలువ మెరక కాలువ నక్కల బారు కాలువల పూడిక తీత కు సంబంధించి సుమారు ఏడు లక్షల 61 వేల రూపాయల పూడిక తీత పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. రైతుల పక్షాన, రైతు సమస్యలు పట్ల స్పందించి నిధులు తీసుకొచ్చిన విజయ్ బాబుని పలువురు రైతులు అభినందించారు. ఈ కార్యక్రమం లో జట్ల రాంబాబు, సాలిపల్లి వెంకన్న బాబు కూటమి నాయకులు దివిలిగ్రామ రైతులు పాల్గొన్నారు.

## అడ్డాతీగల గురుకుల పాఠశాలలో గోబర్ధన్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



అడ్డాతీగల,జూన్ 03,ప్రభాతవార్త కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గోబర్ధన పథకం కింద బయో-గ్యాస్ జీవ ఇంధన ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అడ్డాతీగల మండల కేంద్రంలోని పి.పి. టి.డబ్ల్యు.ఆర్. బాలుర ప్రభుత్వ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణను బుధవారం నిపుణుల బృందం సందర్శించింది.కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు, శాస్త్రవేత్తల బృందం సభ్యులు రాయల మోహన్, జి. సుమంత్ మరియు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ జిల్లా కన్సల్టెంట్ వి. అర్జున కలిసి ఈ ఉమ్మడి తనిఖీని నిర్వహించారు.గురుకుల పాఠశాల వంటశాల నుండి ప్రతిరోజూ వచ్చే తడి వ్యర్థాలు మరియు ఆహార వ్యర్థాలను ఉపయోగించి ఈ బయో-గ్యాస్ ప్లాంట్ ను నిర్మించనున్నారు.ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే గ్యాస్ ను పాఠశాల వంటశాల అవసరాలకు ఎల్.పి.జి.కి ప్రత్యామ్నాయంగా వాడుకోవచ్చు. తద్వారా ప్రభుత్వానికి ఇంధన ఖర్చులు తగ్గుతాయి.వ్యర్థాల రీసైక్లింగ్ ద్వారా పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్యం మెరుగుపడుతుంది.ప్లాంట్ నుండి వచ్చే బై-ప్రొడక్ట్ (స్లర్రీ) ను పాఠశాల తోటలకు నాణ్యమైన సేంద్రీయ ఎరువుగా వాడుకోవచ్చు.ఈ తనిఖీకి సంబంధించిన నివేదికను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు సమర్పించి, త్వరలోనే ప్లాంట్ మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు స్థానిక స్వచ్ఛ గ్రామ అధికారులు పాల్గొన్నారు.

# ఓట్ల పరిరక్షణ ప్రతి కార్యకర్త బాధ్యత

**- మాజీ మంత్రి తానేటి వనిత**



**గోపాలపురం జూన్ 03, (ప్రభాతవార్త):** మన ఓట్లను మనమే కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ప్రస్తుత పరిస్థితుల్లో ఉందని మాజీ మంత్రి, వైసీపీ ఇన్ చార్జ్ తానేటి వనితా అన్నారు. గోపాలపురంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వనిత మాట్లాడుతూ.. బీఎల్ఏలు ముందుగా ఓటర్ల జాబితాను పరిశీలించాలన్నారు. అంతేగాక, బీఎల్ఓలు ఇంటింటికి తిరిగి ఓటర్లకు 6, 7, 8 ఫారంలను ఇచ్చి ఓటర్లను సరి చేస్తుంటారని, ఆ సమయంలో వారితో పాటు బీఎల్ఏలు కూడా వైసీపీ కు సంబంధించిన ఓట్లు సక్రమంగా ఉన్నాయో లేదో తెలుసుకోవాలని సూచించారు. అందుకు సంబంధించి ఆయా బూత్ పరిధిలోని నాయకులు కూడా బీఎల్ఏలకు వెన్నంటి ఉండాలని కోరారు. ఓటర్ల లిస్టులో అవకతవకలు లేకుండా ఓట్లను కాపాడుకోవల్సిన అంశం ఎంతో కీలకమైనదన్నారు. అదేవిధంగా 'వెన్నుపోటుకు రెండేళ్లు' ను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి, రాష్ట్ర ప్రచార కమిటీ ఉపాధ్యక్షులు కూసం రామ్మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, పిన్నమనేని చిన్నబాబు, సాలి వేణు, శ్యాం సుందర్ రెడ్డి, అన్సర్ బాషా, ఏస్కే మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

## తలసీమియా బాలుడికి హైదరాబాదు లో పింఛన్ పంపిణీ



**పెదపూడి.ప్రభాతవార్త** తలసీమియాతో బాధపడుతూ హైదరాబాదులో చికిత్స పొందుతున్న బాలుడి కుటుంబానికి పెదపూడి మండలం గండ్రేడు సచివాలయ ఉద్యోగి గుబ్బల శివకుమార్ అక్కడికి వెళ్లి పింఛను పంపిణీ చేశారు. పెదపూడి మండలం గండ్రేడు గ్రామానికి చెందిన నాగిశెట్టి దివీష్ మనీశ్వర్ తల్లిదండ్రులు నాగిశెట్టి సతీష్,నాగిసెట్టి హనీషా సింధు ఆసుపత్రి, సాయి సింధు ఫౌండేషన్, హైటెక్ సిటీ, హైదరాబాదు కు వెళ్లి గండ్రేడు సచివాలయ ఉద్యోగి గుబ్బల శివకుమార్ నెలకు రూ.10 వేలు చొప్పున 3 నెలలకు రూ.30 వేలను జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు అందించినట్లు ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సత్య నారాయణరెడ్డి(బాబి) తెలిపారు. బాధితుల పరిస్థితిని అర్థం చేసుకొని, హైదరాబాద్ లోనే పింఛన్ అందించి మానవత్వం చాటుకున్న సచివాలయ సిబ్బంది సేవలను గ్రామస్తులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రారంబానికి సిద్దమైన ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి భవనం



**రాజవొమ్మంగి, జూన్ 03, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం జడ్డంగి ప్రభుత్వ అసువత్రి ఆవరణలో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి నూతన భవనం ప్రారంబానికి సిద్ధంగా ఉంది. ఈ ఏడాది జనవరి నెలలో భవన నిర్మాణ పనులు ప్రారంభించి కేవలం ఐదు నెలల్లో పూర్తి కావడం జరిగింది. రూ. 20 లక్షలు వ్యయంతో డాక్టర్ గది, హాలు, మందులు గది, మరుగుదొడ్లు సౌకర్యంతో నూతన ఆసుపత్రి తయారయింది. భవనం పూర్తయిన విషయాన్ని ఉన్నతస్థాయి అధికారులు దృష్టిలో పెట్టడం జరిగిందని జడ్డంగి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారిణి డా. వి. ప్రమీల అన్నారు. పోలవరం జిల్లాలో జడ్డంగి, కూనవరం, మోతుగూడెం ప్రాంతాల్లో ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రుల నూతన భవనాల పనులను ప్రారంబించగా జడ్డంగి పూర్తి కావడం జరిగింది.

## మండల టీడీపీ యూనిట్ ఇన్చార్జిల సమావేశం...



**సఖినేటిపల్లి జూన్ 3, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండల యూనిట్స్ ఇన్చార్జిల సమావేశం, రాజోలు నియోజకవర్గ ఇన్ చార్జ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి అమూల్య ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు తాడి సత్యనారాయణ అధ్యక్షతన సత్యనారాయణ ఇంటివద్ద సమావేశం జరిగింది. ఈ సమావేశంలో యూనిట్ ఇన్చార్జిలు క్లస్టర్లు, కో క్లస్టర్లు నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో తాడి సత్యనారాయణ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) ప్రత్యేక సమగ్ర పునఃసమీక్షఎన్నికల సందర్భంలో ఓటరు జాబితాలను పూర్తిగా పరిశీలించి, సరిదిద్దే ప్రత్యేక కార్యక్రమాన్ని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అంటారని తెలియ జేసారు. కొత్త ఓటర్ల పేర్లు చేర్చడం,మరణించిన లేదా వేరే ప్రాంతానికి మారిన వారి పేర్లు గుర్తించటం పేరు, వయస్సు, చిరునామా వంటి వివరాల్లో తప్పులను సవరించడం,ఓటరు జాబితాను తాజాగాను, ఖచ్చితంగాను ఉంచడం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తుంది. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అని, మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ ఐ ఆర్) పై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో నారా చంద్రబాబు నాయుడు ముఖ్య నాయకులకు పలు కీలక సూచనలు చేశారని, పార్టీ కార్యకర్తలు ఎన్నికల జాబితాలపై పూర్తి అవగాహనతో పనిచేయాలని తెలిపారు. చంద్రబాబు ఓటరు జాబితాల శుద్ధి, బూత్ స్థాయి బలోపేతం, ప్రజలతో నిరంతర అనుసంధానం, కూటమి సమన్వయం తో పని చేయాలనీ చంద్రబాబు కోరారని మండలాధ్యక్షులు సత్యనారాయణ తెలియజేసారు.మన మండలం లో 12 యూనిట్స్ ఉన్నాయిని, వాటిని బలోపేతం చేసే విదంగా యూనిట్స్ పని చేయాలని, యూనిట్స్ కి పూర్తి స్థాయి లో పని చేయటానికి గ్రామ శాఖ సిద్ధంగా ఉన్నాయిని, బూత్ స్థాయి బలోపేతం కొరకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రుద్రరాజు సూరిబాబు, సిహెచ్ నాగబాబు, ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్, పోతురాజు కృష్ణ, చెల్లింగి లీల మోహన్ శ్రీనివాస్, సుంకర అమరజ్యోతి కుమార్, పావెల్ రెడ్డి, బత్తిన గంగాధర్, మండల ఉపాధ్యక్షులు చెల్లుబోయిన నాగబాబు, ప్రధాన కార్యదర్శి పప్పుల రమేష్, క్లస్టర్ 1 ఇంచార్జి చెల్లింగి లీలా మోహన్ శ్రీనివాస్, క్లస్టర్ 3 ఇంచార్జి తాడి రాము, కో క్లస్టర్ బత్తిన గంగాధర్, యూనిట్ 2 ఇంచార్జ ఇల్లింగి లక్ష్మీ, కోపనాతి రామాంజనేయులు, 4వ ఇంచార్జ్ పోతురాజు కృష్ణ, కో ఇన్చార్జ్ భాస్కర్ల సత్తిబాబు, 5వ యూనిట్ కో ఇంచార్జ్ శంకర్ గుప్తం ముత్యం, 8వ యూనిట్ ఇంచార్జి పొన్నపల్లి సూర్యనారాయణ, 9వ యూనిట్ ఇంచార్జ్ సుంకర అమర జ్యోతి కుమార్, కో ఇన్చార్జ్ అంతర్వేదిపాలెం రామకృష్ణ, 11వ యూనిట్ ఇంచార్జ్ దొండపాటి బాబురావు 12వ యూనిట్ ఇంచార్జ్ మార్గాని శ్రీనివాస్, ఉయ్యూరి వారి మెరక గ్రామ శాఖ అధ్యక్షులు చెల్లుబోయిన జై సూర్య బాబు, సీనియర్ నాయకులు గెద్దాడ వెంకటరెడ్డి పెస్సింగ్ శ్రీనివాస్, ఇల్లింగి వేణు, తదితరులు పాల్గొన్నారు.

## రుచికరమైన ఆహార పదార్థాలను వండి పెట్టాలి..

**-ఈనెల 12 నుండి తెరుసుకోనున్న సర్కారీ బడులు..**



**అంబాజీపేట, జూన్ 3, (ప్రభాతవార్త):** 2026-27 విద్యా సంవత్సరం ప్రారంభానికి ఈనెల 12 నుండి సర్కారీ బడులు తెలుసుకోనున్నాయని, ఈ సమయంలో పాఠశాలలతో పాటు డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకం వంటశాలలను శుభ్రం చేసుకోవాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సురేష్, కొత్తపేట డివిజన్ ఇన్చార్జి డివై ఈవో కె.వెంకటేశ్వరరావులు నిర్వాహకులకు సూచించారు. అంబాజీపేట జడ్పీహెచ్ స్కూల్లో ఎంఈఓ-2 మోకా ప్రకాష్ అధ్యక్షతన కుక్ కం హెల్పర్లకు మధ్యాహ్న భోజనం పథకం పై ఒకరోజు శిక్షణ తరగతులను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ దేశ భవిష్యత్తు నేటి బాలల చేతుల్లోనే ఉందని,వారికి పోషకాలతో కూడిన అత్యంత ఆరోగ్యకరమైన, శుచి, శుభ్రతతో కూడిన ఆహార పదార్థాలతో పాటు స్వచ్ఛమైన తాగునీరును అందించాలన్నారు. పిహెచ్సీ వైద్యాధికారి వి.గౌతమి మాట్లాడుతూ వంట చేసేముందు ఆకుకూరలు, కూరగాయలను స్వచ్ఛమైన నీటిలో శుభ్రం చేయడం ద్వారా వాటిలో ఉండే పోషకాలను కాపాడుకోవచ్చన్నారు. వంట నిర్వాహకులు తల,చేతులకు రక్షణ కవచాలు ధరించి వంట చేయాలని సూచించారు. అమలాపురం ఫైర్ స్టేషన్ ఏఎస్ఐ వెంకన్నబాబు మాట్లాడుతూ ప్రతిరోజు అగ్నితో వంట చేయవలసి ఉంటుంది కనుక గ్యాస్ బండను ఉపయోగించే విధానమును డెమినిస్ట్రేషన్ చేసి ప్రమాదాన్ని ఎలా నివారించుకోవాలో వివరించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం నిర్వహకుల మధ్య వంటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పుల్లేటికుర్రు ఉన్నత పాఠశాల,కె.పెదపూడి ప్రాథమిక పాఠశాలలకు చెందిన నిర్వహకులు ప్రథమ,ద్వితీయ స్థానాలలో నిలిచారు. మిగిలిన ఉన్నత, ప్రాథమిక పాఠశాలల వంట నిర్వాహకులు విద్యార్థులకు అందించే అన్ని రకాల వంటకాలను తయారుచేసి ప్రదర్శనలో పెట్టారు. గంగలకుర్రు గుంటమామిడి దొడ్డ ప్రాథమిక పాఠశాలకు చెందిన నిర్వాహకురాలు కె. గంగారత్నం తాను రాష్ట్ర సమావేశంలో శిక్షణ పొందిన అంశాలను తోటి నిర్వహకులకు వివరించారు. అనంతరం ప్రథమ,ద్వితీయ స్థానాల్లో నిలిచిన నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. ఈ శిక్షణ తరగతిలో మండలంలోని 64 పాఠశాలలకు చెందిన 72 మంది నిర్వాహకులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె. సాయిరామ్,బీర ధర్మారాజు, బోనం గంగాధర్,ఎండిఎన్ఎం. షరీఫ్,ఎ.శ్రీనివాసరావు,ఎల్ వి. సత్యనారాయణ, కత్తుల వెంకటేశ్వరరావు,సీఆర్ఎంటీలు పి.గోవిందరాజు,ఎన్.వెంకటేష్, టి.నాగరాజు,ఎం.దుర్గారావు, టి.సత్యనారాయణ,సిబ్బంది డి. రామకృష్ణ,వి.దుర్గాదేవిలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ..ఆరోగ్య రక్షణ..

**-అంబాజీపేటలో ప్రపంచ సైకిల్ దినోత్సవం..**



**అంబాజీపేట, జూన్ 3, (ప్రభాతవార్త):** పర్యావరణ పరిరక్షణతో పాటు ఆరోగ్య రక్షణకు సైకిల్ తొక్కడం ఎంతో మంచిదని రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు బొంతు పెదబాబు,శిరిగినీడి వెంకటేశ్వరరావు,ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావులు అన్నారు. భారత యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ కాకినాడ జిల్లా ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించిన ప్రపంచ సైకిల్ దినోత్సవ ర్యాలీని అంబాజీపేటలో బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ శాస్త్ర,సాంకేతిక పరిజ్ఞానంతో పరుగులు పెడుతున్న నేటి కాలానికి ఆకర్షితులైన యువత తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం లేదన్నారు. సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్యానికి రక్షణగా ఉండడంతో పాటు పర్యావరణ పరిరక్షణ సమతుల్యతను పాటించేందుకు ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ఇంధన ధరలు, భవిష్యత్తులో తలెత్తబోయే ఇంధన కొరతను దృష్టిలో ఉంచుకుని సైకిల్ వినియోగాన్ని, నడకను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్యం, అభివృద్ధితోపాటు సమాజాభివృద్ధికి తోడ్పడవచ్చని తెలిపారు. అనంతరం స్థానిక బస్ స్టేషన్ నుండి నాలుగు రోడ్ల సెంటర్ వరకు సైకిల్ పై ర్యాలీ వచ్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మై భారత్ వాలంటీర్లు అనూష, సరోజిని, నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, మంద రాజేష్,కొప్పినీడి సాయి సూర్య, క్రీడాకారులు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

## జెఈఈ ఉత్తమ ర్యాంకర్స్ కు సన్మానం



**మామిడికుదురు.జూన్ 03(ప్రభాతవార్త)** మామిడికుదురు మండలంలో జెఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన భూపతి నిశాంత్,భూపతి నిహాంత్,లిఖితపూడి హరిసత్యరామ్మోహన్,ఉండ్రు సౌశీల్ లను బుధవారం ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు.విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారికి శుభాకాంక్షలు తెలిపి పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు కారుపల్లి కళ్యాణ్ బాబు,ప్రధాన కార్యదర్శి సాధనాల సత్యనారాయణ,ఆర్థిక కార్యదర్శి గెడ్డం భాస్కర్, జిల్లా మాజీ అధ్యక్షులు బత్తుల నకులరాజు, బయ్యా మోహన్,జిల్లా కార్యదర్శి టీఆర్ కె గణపతి,నేల శ్రీనివాసరావు,ఉండ్రు శ్రీరమణ,తోట ప్రసాద్ పాల్గొన్నారు.

## గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



**మామిడికుదురు.జూన్ 03(ప్రభాతవార్త)** పెదపట్నంలంక బొక్కావారిపాలెం వైనతేయ గోదావరి నదిలో గల్లంతైన అదే గ్రామానికి చెందిన బండారి వెంకటేశ్వరరావు అలియాస్ శ్రీనివాస్(55)మృతదేహాన్ని స్థానికులు మంగళవారం రాత్రి వెలికి తీశారు.గోదావరి నదిలో స్నానానికి దిగి శ్రీనివాస్ గల్లంతైన విషయం విధితమే. దీంతో కుటుంబ సభ్యులు,స్థానికులు గాలింపు చర్యలు చేపట్టగా గల్లంతైన ప్రాంతంలోనే అతని మృతదేహం లభ్యమయ్యింది.శ్రీనివాస్ మృతదేహం లభ్యం కావడంతో అతని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.మృతుని కుమారుడు దుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు నగరం ఎస్ఐ ఎ.చైతన్య కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## చికిలింత లో గంగాలమ్మ తల్లి పండుగ..

**-కొత్తపల్లిలో తాటాకు దొప్పలో భోజనాలు**



**రాజవొమ్మంగి, జూన్ 03, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలం చికిలింత గ్రామంలో బుధవారం గంగాలమ్మతల్లి పండుగ ఘనంగా జరిగింది. గ్రామ పెద్ద కాకర శంకురమయ్య పర్యవేక్షణలో గ్రామస్తులు, పెద్దలు ఐక్యంగా పండుగను చేసుకొన్నారు. గిరిజన ఆచార, సంప్రదాయం పద్ధతులతో ఒక ఉత్సవంగా పండుగ సాగింది. ఉదయాన్నే గ్రామ వీధులు గుండా అమ్మవారి ప్రతి రూపంగా బావించే ఘటంతో ఊరేగింపును నిర్వహించారు. డప్పులు, కోలాట, నందరాటతో జరిగిన ఊరేగింపులో ప్రతీ ఇంటి ముందుకు అమ్మ వారు గటానికి నీటిని వారధిగా పోసి పసుపు, కుంకుమ తో పూజలను చేశారు. అనంతరం గ్రామమంతా ఐక్యంగా గంగాలమ్మతల్లి ఆలయానికి చేరుకొని పూజలు చేసి మొక్కులను తీర్చుకొన్నారు. ప్రతీ యేటా తొలకరి సాగుకు ముందు గ్రామ దేవతలు పండుగలు చేస్తారు. గిరిజన సాంప్రదాయాలకు ప్రతీకగా గ్రామ దేవతలు ఉత్సవాలను చెప్పవచ్చు. ఈకార్యక్రమంలో కోండ్ల సూరిబాబు, జర్తా బాబూరావు, అవూరి అబ్బాయిరెడ్డి, జనుమూరి రాజబాబు, కాకర రాజబాబు, కోసూరి సుబ్రమణ్యం, జనుమూరి దొరబాబు, కోసూరి శ్రీ రాములు, పాకాల రమేష్, పాకాల వెంకట్రావు, జనుమూరి చిన్న మాస్టర్, కాకర జోగిరాజు కాకర నాగేశ్వరావు, కోసూరి బుల్లబ్బాయి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు. వంచంగి పంచాయితీ జి. కొత్తపల్లి గ్రామంలో నాలుగవ రోజు గంగాలమ్మ తల్లి పండుగ జరిగింది. గంగాలమ్మ తల్లి ఆలయం వరకూ ఊరేగింపుగా కోలాట, నందరాటతో వెళ్లి పూజలను చేశారు. భూమిని దేవతగా బావించి భూదేవి పండుగ చేసి విత్తనాలను పెట్టారు. భోజనాలను కూడా అక్కడే తయారు చేసుకొని పచ్చితాటాకులను దొప్పులుగా చేసుకొని వాటిని ఆహారాన్ని పెట్టుకొని సహాపంక్తి భోజనాలను చేసి అనంతరం ఇంటికి చేరుకొన్నారు. ఈకార్యక్రమంలో కొర్రాబు సత్యనారాయణ, కొర్రాబు శ్రీను, జర్తా వెంకట్రావు, గోము సత్తిబాబు, జర్తా బాబ్జి, ఆశ వర్కర్ నూకరత్నం గ్రామస్తులందరూ పాల్గొన్నారు.

## మా పాఠశాల రద్దు కాలేదు, తప్పుడు వార్తలు నమ్మవద్దు.

**రౌతులపూడి, జూన్ 3.(ప్రభాత వార్త)** తమ పాఠశాల రిజిస్ట్రేషన్ రద్దు కాలేదని తప్పుడు వార్తలు నమ్మవద్దని శ్రీ వేద ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం స్పష్టంచేశారు.బుధవారం రౌతులపూడిలో శ్రీ వేద ప్రైవేట్ పాఠశాల ఆవరణంలో విలేఖర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ అల్లు సత్తిబాబు మాట్లాడుతూ తమ పాఠశాల రిజిస్ట్రేషన్ రద్దు అయినట్లు గతంలో దీనిని నిర్వహించిన వాటాదారులు తప్పుడు ప్రచారం చేసి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుని తల్లిదండ్రులను ఆవేదనకు గురిచేస్తున్నారని తెలిపారు.తమపాటశాల విషయమై కోర్టులో కేసు వున్న మాట వాస్తవమేనని అయితే 2038సంవత్సరం వరకు తమకు హక్కు పత్రాలున్నాయని వాటిని విలేఖర్లకు చూపించారు. తమకు షోకాజ్ నోటీసులు వచ్చినప్పటికీ రద్దుచేసినట్లు ఉత్తర్వులు రాలేదని 2038వరకు దిగ్విజయంగా నడిపిస్తామని తలిదండ్రులు ఆవేదన చెందవద్దని హితవుపలికారు. ఈ కార్య క్రమంలో ప్రిన్సిపాల్ బండారు సూర్యప్రకాశరావు,మేనేజ్మెంట్ బండారు నాగు,కోటిబాబు తది తరులు పాల్గొన్నారు.

## మంచినీటి బోరుకు మరమ్మతులు ప్రజల సమస్యను తీర్చిన పీసా చైర్మన్ ఒడుగుల వీరబాబు



**అడ్డతీగల, జూన్ 03, ప్రభాతవార్త** మండలంలోని కొనలోవ గ్రామపంచాయతీ పరిధిలో గల కోనలోవ గ్రామంలో ఎదురవుతున్న తాగునీటి సమస్యకు తాత్కాలికంగా ఉపశమనం లభించింది. గ్రామంలోని ముఖ్యమైన మంచినీటి బోరు ఇటీవల పాడైపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం సర్పంచులు అందుబాటులో లేని కారణంగా, తాగునీటి కోసం పడుతున్న అవస్థలను స్థానిక పీసా గ్రామస్తులు కమిటీ చైర్మన్ ఒడుగుల వీరబాబు దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన చైర్మన్ వీరబాబు తక్షణమే పంచాయతీ సెక్రెటరీతో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. ఆయన చొరవతో అధికారులు వెంటనే స్పందించి, పాడైపోయిన మంచినీటి బోరుకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. బోరు మళ్లీ పనిచేయడం ప్రారంభించడంతో గ్రామస్తుల తాగునీటి కష్టాలు తీరాయి. తమ సమస్యపై తక్షణమే స్పందించి బోరు రిపేర్ చేయించిన పీసా చైర్మన్ ఒడుగుల వీరబాబుకు, పంచాయతీ అధికారులకు కోనలోవ గ్రామ ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## రిటైనింగ్ వాల్ పనుల్లో నాణ్యత లోపం!!!!

**-అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం !!!**



**కాట్రేనికోన, జూన్ 03(ప్రవార్త వార్త):** కాట్రేనికోన మండలంలోని తిమ్మాపురం సమీపంలో పంట కాలువ గట్టుకు నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనుల్లో నాణ్యత పాటించడం లేదని రైతులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ గత కొన్ని రోజులుగా కాంక్రీట్ మిక్సర్ సహాయంతో పనులు జరుగుతున్నా, సంబంధిత ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణ కరువైందని ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేయిస్తున్నారని, సిమెంట్, ఇసుక, కంకర నిష్పత్తి సరిగా పాటించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కాలవకు నీరు వస్తే ఈ గోడ నిలుస్తుందా? అని అనుమానంగా ఉంది. షట్టరింగ్ పెట్టి సన్నని గోడ కడుతున్నారు. స్టీల్ సరిగా వేయడం లేదు. అధికారులు పని ప్రదేశం వద్దకు వచ్చి తనిఖీ చేయడం లేదు అని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ బుధవారం ఉదయం కాంక్రీట్ పని చేపట్టారు. సంబంధిత అధికారులు ఎవరు దగ్గర లేరు. ఇలా అయితే పనుల్లో నాణ్యత ఎక్కడుంటుంది అని ప్రశ్నిస్తున్నారు. లష్కర్ ఉన్న వారికి కాంక్రీట్ పనులపై అవగాహన ఉండదు. ఇక్కడ కట్టిన గోడలో కంకర రాళ్ళు బయటకు కనిపిస్తున్నాయి. ఇవి అలా ఉంటే నీటి ప్రవాహానికి కొద్ది కొద్దిగా పాడయ్యే అవకాశం ఉంది.లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు వెచ్చించి చేపట్టే పనులు నాసిరకంగా చేస్తే భవిష్యత్తులో భారీ నష్టం తప్పదని ప్రజలు హెచ్చరిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పని ప్రదేశం వద్దకు వచ్చి తనిఖీ చేసి, నాణ్యతతో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.. ఎస్సై సుభాని..

**అంబాజీపేట,జూన్ 3, (ప్రభాతవార్త):** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా



ఉండాలని, అపరిచిత వ్యక్తులు తమ వ్యక్తిగత వివరాలు, బ్యాంకు లావాదేవీలను అడిగితే తొందరపడి ఇవ్వద్దని, వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్కు ఫిర్యాదు చేయాలని ఎస్సై షేక్ సుభాని సూచించారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న జన జాగృతి రథం అంబాజీపేటకు బుధవారం వచ్చింది. జన జాగృతి రథంకు అమర్చిన తెర (స్క్రీన్) నుండి చిత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. అంబాజీపేటలో బుధవారం వారపు సంత కావడంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా రథంను నిలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుభానితోపాటు సిబ్బంది, స్థానికులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై సుభాని మాట్లాడుతూ సైబర్ నేరాలు పలు రకాలుగా జరుగుతున్నాయని వీటిపట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. అశ్లీల వీడియోలు,ఫోటోలు పంపి డబ్బులను డిమాండ్ చేయటంతో పాటు మానసికంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. పెళ్లిళ్ల పేరుతో మ్యాట్రిమోనీలను ప్రారంభించి ఫోటోలు సేకరించి యువతులను వలలో వేసుకుంటున్నారన్నారు. అబ్బాయిలు అమ్మాయిల పేర్లతో యువతలతో పరిచయాలు పెంచుకుని మోసం చేస్తున్నారన్నారు. లాప్టాప్లు, కంప్యూటర్లను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, పని అయిన వెంటనే వాటిని ఆఫ్ లో పెట్టాలని సూచించారు. తమ వ్యక్తిగత వివరాలను, వీడియోలను, ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టవద్దన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో బహిరంగ ప్రదేశాలకు వెళ్లిన సమయంలో మీరు సరదాగా ఫోటోలు తీసుకునే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, ఎవరైనా అపరిచిత వ్యక్తులు మీ ఫోటోలు తీస్తున్నారేమో ముఖ్యంగా యువతలు,మహిళలు గమనించుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు నగదు పంపించాలని అడిగినా, ఓటీపీ నెంబరు చెప్పాలని అడిగినా ఇవ్వద్దని, అలాగే బ్యాంకు ఖాతా నెంబర్ కూడా తెలియజేయవద్దని ఎస్ఐ సూచించారు. అలాగే జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో జన జాగృతి రథం ద్వారా సైబర్ నేరాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారని, ప్రతి ఒక్కరు అవగాహన చేసుకోవాలని ఎస్ఐ సుభాని సూచించారు.

## హెల్మెట్ లు కొనుగోలు చేయించే కొత్త కార్యక్రమానికి శ్రీకారం



**రాజవొమ్మంగి, జూన్ 03, ప్రభాతవార్త** రాజవొమ్మంగి మండలంలో జడ్డంగి గ్రామంలో బుధవారం సి. ఐ. గౌరీశంకర్, ఎస్. ఐ చిన్నబాబు ఆధ్వర్యంలో పోలీసులు కొత్త కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహన తనిఖీలను నిర్వహించి జరిమానాలు వేయకుండా హెల్మెట్ లను కొనుగోలు చేయించే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రహదారి భద్రతపై అవగాహనను కల్పించారు. హెల్మెట్ ప్రాణ రక్షణ కవచమని, తప్పనిసరిగా దరించాలని సి. ఐ. గౌరీశంకర్ అన్నారు. ప్రజలు ప్రాణ భద్రతే పోలీసులు ప్రధాన లక్ష్యమని ఎస్. ఐ. చినబాబు తెలిపారు. ఈకార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్స్ శాస్త్రి, రాజ్ కుమార్, ఏ. పి. ఎస్. పి. సిబ్బంది విధులను నిర్వహించారు.

మరిన్ని వార్తలు 6లో

తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## లొల్ల లాకుల వద్ద సోలార్ వెలుగులు....

**-ఎమ్మెల్యే బండారు సొంత నిధులు 6 లక్షలతో సోలార్ లైట్లు , 15బెంచీలు ఏర్పాటు మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు**



**ఆత్రేయపురం, జూన్ 03,(ప్రభాత వార్త).** కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమకూర్చిన 6 లక్షల రూపాయలు నిధులతో సోలార్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసినట్లు మండల టీడీపీ అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు సొంత నిధులు 6 లక్షలతో లొల్ల లాకుల ప్రాంతంలో సోలార్ విద్యుత్ లైట్లు20, పర్యటకులు కూర్చుంటానికి 15 బెంచి బల్లలను ఏర్పాటు చేశామని తెలిపారు.. సోమవారం మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు దగ్గరుండి పనులు నిర్వహించారు. లొల్ల లాకులు అందంగా తీర్చిదిద్దేందుకు మరిన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం పుష్కరాలు నాటికి పూర్తయితాయని కూసంపూడి రామకృష్ణ రాజు తెలిపారు. సోలార్ విద్యుత్ వెలుగులతో లొల్ల లాకులు వద్ద మరింతగా పర్యాటక శోభ సంతరించుకుందని సెంట్రల్ డెల్టాకు ప్రధాన ఆయువు పట్టైన లోల్ల లాకులు వద్ద రానున్న రోజుల్లో పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇప్పటికే పర్యాటక కేంద్రంగా లొల్ల లాకులు దినదిన అభివృద్ధి చెందుతుండగా లొల్ల లాకుల ప్రాంతంలో గతంలో కొన్ని వందల సినిమా షుటింగులు జరిగినప్పటికీ తరువాత కాలంలో లాకు సమీప ప్రాంతాలు పిచ్చి మొక్కలతో ఉండడంతో సినిమా షుటింగ్ తగ్గిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు లొల్ల లాకుల సుందరీకరణ చేయాలని శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని అందులో భాగంగా గత నెలలో లొల్ల లాకుల అభివృద్ధికి రూ 74, కోట్ల20 లక్షల రూపాయలు నిధులు సాధించి సెంట్రల్ డెల్టా రైతుల అభిమానం చూరగొన్నారు. అహర్నిశలు కష్టించి ఆఖరికి లొల్ల లాకుల ఆధునికరణకు కృషి చేసి కొనసీమ జిల్లా సాగునిటీ వ్యవస్థ ఆధునికరణకు కొత్త బాటలు వేశారు. 130 ఏళ్ల క్రితం సర్ ఆర్థన్ కాటన్ దొర సాగునిటీ వ్యవస్థ ఏర్పాటు చేసి అపర భగీరథుడుగా కీర్తి పొందగ ఎమ్మెల్యే బండారు సత్యానంద రావు లొల్ల లాకుల ఆధునికరణకు నిధులు సాధించి కోనసీమ ప్రజల నుండి నిరజనాలు అందుకుంటున్నారన్నారు.

## ఉపాధి పనులపై ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

**-స్వర్ణ గ్రామ రికార్డులు, జనగణన పనుల పరిశీలన**



**కాట్రేనికోన, జూన్ 03 (ప్రభాతవార్త):** కాట్రేనికోన మండలంలోని పల్లంకుర్రు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీవో బి. రాజేశ్వరావు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న ప్రాంతాలను సందర్శించి మస్టర్ రోల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. హాజరు నమోదు, కూలీల వేతన చెల్లింపులు, పని కొలతల్లో ఎలాంటి అవకతవకలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో తప్పనిసరిగా నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని క్షేత్ర సహాయకులకు సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా శ్రామికులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం పల్లంకుర్రు స్వర్ణ గ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో పలు రికార్డులను పరిశీలించారు. తల్లికి వందనం", అక్షరాంధ్ర సిటిజన్ ఈ-కేవైసీ" కార్యక్రమాల అమలుపై ఆరా తీశారు. పౌర సేవల అందింపులో ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. జనగణననమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, ప్రజల సహకారంతో జనగణనను పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించిన వారిపై చర్యలు తప్పవని సిబ్బందికి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో (పీఆర్) ఎన్. శంకరనారాయణ, పంచాయతీ కార్యదర్శి రామారావు, టెక్నికల్ అసిస్టెంట్ లావణ్య, స్వర్ణ గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ పై పెద్దాపురం పోలీసుల దండయాత్ర

**-యువకుల్లో మార్పు కోసమే స్పెషల్ డ్రైవ్ -పెద్దాపురం డిఎస్పీ తిలక్**



**పెద్దాపురం జూన్ 3 (ప్రభాత వార్త )** మాదకద్రవ్యాల నియంత్రణపై పెద్దాపురం పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. డి.ఎస్.పి ఏసిబి తిలక్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక పాండువుల మెట్ట వద్ద డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దాపురం డిఎస్పి తిలక్ మాట్లాడుతూ యువకుల్లో మార్పు కోసం డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామన్నారు. తొలిదశలోనే తల్లిదండ్రులు సమాచారం ఇస్తే డీ-అడిక్షన్ కేంద్రాల ద్వారా పిల్లలకు సాయం చేసే విధంగా కౌన్సిలింగ్ తో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వారిలో మార్పు రాకపోతే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సారి ఉన్నతాధికార్ల ఆదేశాల మేరకుడ్రగ్స్ పై దండయాత్ర' పేరుతో సబ్ డివిజన్ స్థాయిలో గంజాయి నిర్మూలనకు పూర్తి స్థాయి లో చర్యలు చేపటమన్నారు. విద్యాసంస్థలు తెరుచుకోగానే హాస్టల్స్ లో ఉంటున్న విద్యార్థులపై ప్రత్యేక నిఘాఏర్పాటు చేసి యువత లో మార్పు కోసం చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు, వై.ఆర్.కే శ్రీనివాస్, కృష్ణ భగవాన్,తిరుపతిరావు, అంకబాబు, ఎస్సైలు మౌనిక, రఘునందరావు, నాగబాబు, సతీష్, ల్యాబ్ టెక్నీషన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్తలంకలో టిడిపి సమావేశం



**ముమ్మిడివరం మే 3 ప్రభాతవార్త** ముమ్మిడివరం మండలం కొత్తలంక గ్రామంలో తెలుగుదేశం పార్టీ కొత్తలంక యూనిట్ ఇంచార్జి నడిమింటి సూర్య ప్రభాకర్ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ యూనిట్ సమావేశం జరిగింది ఈ సమావేశంలో కర్రీ వాని రేవు గ్రామపంచాయతీ, కొత్తలంక గ్రామ పంచాయతీలకు చెందిన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కార్యదర్శులు బూత్ కన్వీనర్లు కో. కన్వీనర్లు పాల్గొన్నారు. కొత్తలంక కర్రీ వాని రేవుగ్రామాల్లో చెందిన పలు సమస్యలపై చర్చించడం జరిగింది పలు అభివృద్ధి కార్యక్రమాలు కొరకు తీర్మానం చేసి ఉన్నారు ఈ కార్యక్రమంలో కొత్తలంక తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల మల్లికార్జునరావు కర్రి వాని రేవు అధ్యక్షులు రేఖాడి రాంబాబు బూత్ కన్వీనర్లు దాసరి గంగాధర్ రావు గేసాల చందర్రావు దువ్వూరి రాంబాబు బొక్క త్రినాధరావు కుంచే ప్రసాదరావు పలివెల నాగరాజు బీర శివ లతో పాటు పలువురు పాల్గొన్నారు

## పట్టణ ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యాలే లక్ష్యం

**- త్రాగునీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులకు శ్రీకారం**



**రామచంద్రపురం జూన్ 03 (ప్రభాతవార్త):** రామచంద్రపురం మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన తాగునీటి సరఫరా అందించేందుకు మొత్తం రూ.51.90 లక్షల వ్యయంతో నాలుగు తాగునీటి పైప్‌లైన్ అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ ఆర్డీవో సరళావతి,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పట్టణంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. పనులు పూర్తయిన అనంతరం సంబంధిత వార్డుల ప్రజలకు నాణ్యమైన తాగునీటి సరఫరా మరింత మెరుగుపడుతుందని ఆర్డీవో సరళావతి తెలిపారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో రామచంద్రపురం పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా చేపడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్. ఆర్.రాజు,డి.ఈ శ్రీకాంత్, కూటమి పార్టీ నాయకులు పట్టణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ,ఉపాధ్యక్షులు చందమామ వాసు, కంచుమర్తి బాబురావు,కట్టా నాగేశ్వరరావు,నారాపురెడ్డి బలరాం,జనసేన నాయకులు సత్యవాడ శ్రీహరి పంతులు,కె శ్రీనివాసు,ఆనంద్,పెద్దబాబు,అంకం శ్రీను,పి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవాలి. ఏ, వో ఈశ్వరరావు.



**జూన్ 03 (ప్రభాతవార్త):** ప్రతీ ఒక్క రైతులు నేషనల్ ఫెర్టిలైజర్ సేల్ ఫ్రమ్ వర్క్ యాప్ ద్వారా ఎరువులు బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఈశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలప్రకారశీ క్యూ ఆర్ కోడ్ వచ్చిన మూడు రోజుల లోపు ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు దీనిని ఉపయోగించుకోవాలని కోరారు.

## ఈ నెల 5న రైతు సదస్సు.

**-ఉద్యాన శాఖ అధికారినీ . దివ్యశ్రీ.**

**రౌతులపుడి జున్3(ప్రభాత వార్త)** ఈ నెల 5న వైఎస్ ఆర్ విశ్వ విద్యాలయం వెంకటరామన్నగూడెంలో సుస్థిర ఉద్యానం ఆధునిక ఫలసాయం కాపీఆదునిక విజ్ఞానం, సాంకేతీకత కృత్రిక మేధస్సు, డ్రోన్ టెక్నాలజీ, స్వయం చాలిత పరికరాల వినియోగంపై ఈ కార్య క్రమంలో చర్చిస్తారని తెలిపారు. ఈ కార్య క్రమానికి మంత్రి కింజరపు అచ్చెన్నాయుడుదురనీయున్నారని ఆసక్తిగల రైతులు హాజరు కావాలని కోరారు.

## రాబోవు రోజులు వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీవే : మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



**వి.ఆర్.పురం,జూన్13,ప్రభాతవార్త** రాబోవు రోజులు వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీవే నని పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు ఇప్పటి నుండే 2029 ఎన్నికలకు సమాయత్తం కావాలని, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, వైసిపి రాష్ట్ర నాయకురాలు నాగులపల్లి.ధనలక్ష్మి పార్టీ శ్రేణులను ఉత్తేజపరుస్తు మాట్లాడారు. బుధవారం మండల కేంద్రం రేఖపల్లిలో వైసిపి మండల కన్వినర్.మాదిరెడ్డి సత్తిబాబు అధ్యక్షతన ఆ పార్టీ వి.ఆర్.పురం, కూనవరం, చింతూరు, ఎటపాక నాలుగు మండలాల బూత్ లెవెల్ ఏజెంట్ల కు (ఎస్.ఐ.ఆర్) ఓటర్లు జాబితా సమగ్ర సవరణ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి హాజరై మాట్లాడారు. పార్టీ శ్రేణులకు భవిషత్ కార్యాచరణపై దిశా నిర్దేశం చేశారు. పార్టీ నాయకత్వం ప్రజల్లోకి పార్టీని తీసుకొని వెళ్ళి, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైసిపి ని అధికారంలోకి తీసుకొని వచ్చి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని తిరిగి ముఖ్యమంత్రిగా చూసుకోవటం కోసం కసిగా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో చింతూరు జడ్.పి.టి.సి చిచ్చుడి.మురళి, కూనవరం ఎంపిపి పాయం.రంగమ్మ, స్థానిక ఎంపిటిసి బంధం.విజయలక్ష్మీ, రమాదేవి, కొమ్మని.సునిత, ఆ పార్టీ నాయకులు మాచర్ల.గంగయ్య, చిక్కాల.బాబు, బొడ్డు.సత్యనారాయణ, పిట్టా.రామారావు, పోడియం.గోపాల్, వడ్డాణపు.చిన్న రాజారావు, చిన్ని, కోట్ల.కృష్ణ, ప్రసాద్, ఆవుల.మరియదాసు, ఆకుల. పెద్దోడు, చీమల.కాంతారావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు లక్షల విలువైన గంజాయి పట్టివేత ముగ్గురు వ్యక్తుల అరెస్ట్.




**చింతూరు జూన్ 3 ప్రభాతవార్త** అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి నాలుగు కేజీల గంజాయితో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు చింతూరు ఎస్సై సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తమకు వచ్చిన విశ్వాసనీయ సమాచారంతో మోటు జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన హోండా యాక్టీవ్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గంజాయితో పాటు ముగ్గురు వ్యక్తులు అరెస్ట్ చేసామని వారి వద్ద నుంచి నాలుగు సెల్ ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నట్టు ఈ సందర్భంగా తెలిపారు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు తెలిపారు.

## మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**--సర్పవరం సీఐ ప్రకాష్**



**కాకినాడ రూరల్, జూన్ 3 (ప్రభాతవార్త):** మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సర్పవరం సిఐ సిహెచ్ .ప్రకాష్ సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా, బుధవారం సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానితులుగా గుర్తించిన ఆరుగురు వ్యక్తులకు డ్రగ్ డిటెక్షన్ పరీక్షలలోపాజిటివ్‌గా తేలిన ముగ్గురు వ్యక్తులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు చట్టపరమైన పరిణామాలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి తల్లిదండ్రులు,సంరక్షకులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పరీక్షల ఫలితాల గురించి వివరించి పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి ఉంచి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## కొత్తపేట ఆర్డీవో గా సత్యనారాయణ బాధ్యతలు స్వీకరణ



**కొత్తపేట,మే03,(ప్రభాతవార్త)** కొత్తపేట నూతన ఆర్డీవోగా జి వి వి సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయ అధికారులు సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శు భాకాంక్షలు తెలిపారు ప్రజలు రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నూతన ఆర్డీవో సత్యనారాయణ తెలిపారు ఆర్డీవో సత్యనారాయణ గత సార్వత్రిక ఎన్నికల్లో కొత్తపేట నియోజకవర్గ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు

## క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీ అందజేసిన ఎస్సై



**కాట్రేనికోన 03 జూన్ (ప్రభాతవార్త)** కాట్రేనికోన జడ్పీ హై స్కూల్ ఆవరణంలో జై భీమ్ యువజన సంఘం వెంకమ్మ చెరువు ఆధ్వర్యంలో నిర్వహించిన "జై భీమ్ ప్రీమియర్ లీగ్ – 2026" క్రికెట్ టోర్నీ ఘనంగా ముగిసింది. హోరా హోరి గా జరిగిన ఫైనల్ మ్యాచ్ లో రామస్వామి తోటకు చెందిన బాబా యూత్ జట్టు విజేత గా నిలిచింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై ఐ అవినాష్ హాజరై విన్నర్ జట్టుకు ట్రోఫీ ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూక్రీడలు యువతలో క్రమశిక్షణ,స్నేహ భావాన్ని పెంచుతాయన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, క్రీడలపై దృష్టి పెట్టాలని సూచించారు. వారం రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో 8 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో ఉత్కంఠభరితమైన పోరు జరిగింది. విజేత, రన్నర్ జట్లకు ట్రోఫీలు, క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్ రావు, నల్లా నరసింహామూర్తి, జగడం బాలయోగి,నల్లా హరి కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## మునికూడలి ఘాట్‌ను 'ఆదర్శ ఘాట్‌గా' తీర్చిదిద్దుతాం-ఎమ్మెల్యే బత్తుల



**సీతానగరం, జూన్ 03, (ప్రభాతవార్త):** రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని సీతానగరం మండలం మునికూడలిలోని దేవాన్ష్ ఘాట్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ ఘాట్‌గా తీర్చిదిద్దనున్నట్లు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం ఆయన వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో ఘాట్‌ను పరిశీలించి, ఘాట్ లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మునికూడలి ఘాట్‌కు ఎంతో ఆధ్యాత్మిక విశిష్టత ఉందని కొనియాడారు. పుష్కరాల సమయంలో ఇక్కడికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అత్యుత్తమ వసతులు కల్పించాలని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశించారని, ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. దేవాన్ష్ ఘాట్‌ను 54 మీటర్ల మేర విస్తరించడంతో పాటు, మండలంలోని వెదుళ్ళపల్లి, రాజంపేట సహా మొత్తం 15 ఘాట్లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా నివారణకు దోమలను నిర్మూలించండి



**మామిడికుదురు.జూన్ 03(ప్రభాతవార్త)** దోమల నిర్మూలన ద్వారానే మలేరియా వ్యాధి నివారణ సాధ్యమవుతోందని తెలుపుతూ లూటుకుర్రు లో పీహెచ్సీ ఉద్యోగులు బుధవారం ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. రాజోలు సబ్ యూనిట్ అధికారి యెరుబండి ఆదినారాయణ ఆదేశాల మేరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించారు. పీహెచ్సీ వైద్యులు మౌనిక,ఫణి శైలజ,సూపర్వైజర్లు రాజేంద్రబాబు,హెల్త్ అసిస్టెంట్లు కేవీ సూర్యనారాయణ,ఉమా మహేశ్వరరావు,శ్రీనివాసాచార్యులు,ఏఎన్ఎం లు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూన్ 30 లోపు 'జలధార' పనులు పూర్తి చేయాలి: ఎంపీడీవో ఏవివి కుమార్



**అడ్డతీగల,జూన్ 03, ప్రభాతవార్త** అడ్డతీగల మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో కలెక్టర్ కొత్తగా మంజూరు చేసిన 139 జలధార పనులను జూన్ 30 లోపు పూర్తి చేయాలని ఎంపీడీవో ఏ.వి.వి. కుమార్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జలధార పనులు పూర్తయ్యాకే ఇతర పనులను చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి పనిని పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేయించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వి. చందు, ఏపీఓ బి. చిరంజీవి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు పై వెళ్లకుండా అడ్డుకుంటున్నారు..రైతు ఫిర్యాదు



**మామిడికుదురు.జూన్ 03(ప్రభాతవార్త)** కరవాక గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వ రోడ్డుపై వెళ్లకుండా అడ్డుకుంటున్నారని రైతు రేకపల్లి రామస్వామినాయుడు పంచాయతీ కార్యదర్శికి బుధవారం ఫిర్యాదు చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద ఉన్న ఆర్ అండ్ బి రోడ్డు నుంచి దుళ్లరేవు స్మశాన వాటికకు వెళ్లే మార్గంలో ఉపాధిహామీ పథకంలో సీసీ రోడ్డు వేశారని ఆరోడ్డు పై జేసీబీలు, ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి తమకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వాపోయారు. దీనిపై విచారణ జరిపి అడ్డంకులు సృటిస్తున్న సదరు ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## తొమ్మిది బుధవారాల తో పోటెత్తిన సుదర్శన హోమం...



**సఖినేటిపల్లి జూన్ 3, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం లో నవ నరసింహ క్షేత్రాలలో ఐదవ క్షేత్రం అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి ఆలయంలో భక్తులు పోటెత్తిరి. శ్రీ లక్ష్మీ నృసింహుని అతి ప్రీతికరమైన బుధవారం రోజున తొమ్మిది ప్రదక్షణ లతో తొమ్మిది రోజులు చేసి, పదవ రోజు శ్రీ నృసింహుని సుదర్శన హోమంలో కూర్చొన్న భక్తులు కోరిన కోరికలు నెరవేరునని విశ్వాసము, నెరవేరిన వారూ ఉన్నారు. ఈ సుదర్శన హోమము ను చేసిన కొద్ది రోజులలకే మనకు కావలసిన అన్ని స్వామి నెరవేర్చేదరని భక్తులు తెలుపుచున్నారు. హోమంలో సుమారు 50 జంటల భక్తులు పాల్గొన్నారని ఆలయ పరివేక్షకులు పి విజయ సారధి తెలిపారు.

## ర్యాలి జగన్మోహిని కేశవస్వామి వారి నిత్యాన్న పథకానికి విరాళం.




**ఆత్రేయపురం, జూన్,03,(ప్రభాత వార్త)** ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవస్వామి, ఆలయానికి బుధవారం భక్తులు పోటెత్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. దువ్వాడ వాస్తవ్యులు శెట్టి రాంబాబు ,అరుణ కుమారి వారు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామి,గోపాల స్వామివారిని దర్శించుకుని స్వామి వారి అన్నదాన పథకానికి రూ.6,116/-లు విరాళంగా అందించారు .దాతలకు స్వామివారి దర్శనం అనంతరం అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా,ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ఇంచార్జ్ ఈఓ, దారపురెడ్డి సురేష్ బాబు, లు స్వామివారి చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు.

## శంఖవరం తహశీల్దార్ కార్యాలయాన్ని తనికీ చేసిన జెసి అపూర్వ భరత్

**పరిసరాలు, రికార్డుల నిర్వహణ తీరుపై అసంతృప్తి**



**శంఖవరం జూన్ 3 ప్రభాతవార్త** మండల కేంద్రం శంఖవరంలో గల తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ బుధవారం అకస్మికంగా తనికీ చేసారు. తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న జెసి అపూర్వ భరత్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెత్త, చెదారాన్ని గుర్తించడం, కార్యాలయ భవనం పాడుబడినట్లుగా (ఎటువంటి రంగులు లేకుండా) ఉండడాన్ని గుర్తించి అసంతృప్తి వ్యక్తం చేసారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించి, పేర్లు చదవగా అతి తక్కువ సంఖ్యలో మాత్రమే సిబ్బంది హాజరు కావడంతో తహశీల్దార్ తాతారావుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. రికార్డుల గదిని పరిశీలించిన అపూర్వ భరత్ వాటిపై దుమ్ము, ధూళితో రికార్డులు మురికి పట్టడంపైన ఆగ్రహం వ్యక్తం చేసారు. అలాగే పిజిఆర్ఎస్ రిజిష్టర్ ను, మండల ప్రొఫైల్ ను అడుగగా తహశీల్దార్ తాతారావు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో జెసి భరత్ అసహనం వ్యక్తం చేసారు. మండలంలోని 32 రెవెన్యూ గ్రామాలలో వేసవి దృష్ట్యా నెలకొన్న తాగునీటి సమస్యలపై ఆరా తీసారు. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన జనగణన సర్వేపై తహశీల్దార్ తాతారావును వివరాలు అడిగి తెలుసుకుని, అన్ని గ్రామాల్లోనూ జనగణన సర్వే దాదాపుగా పూర్తి కాగా, శంఖవరంలో మాత్రం 850 గృహాల సర్వే మిగిలిపోవడాన్ని గుర్తించి ఎంపిడిఓ నాగేంద్రను చరవాణిలో సర్వే పూర్తిస్థాయిలో, గడువు లోపున వేగంగా నిర్వహించాలన్నారు. అనంతరం కార్యాలయం నుండి బయటకు వచ్చిన జెసి భరత్ తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రహారీ గోడ నిర్మాణానికి అంచనాలు రూపొందించి తనకు పంపించాలని, తక్షణ చర్యల్లో భాగంగా వారం రోజుల్లో కార్యాలయానికి రంగులు వేయించాలని తహశీల్దార్ తాతారావును ఆదేశించారు. కార్యక్రమంలో జెసి వెంట సిసీలు రఘు, వీరబాబు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps